Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 186 మేడ్చల్ మల్కాజ్‌గిరి 27 జూలై 2023 గురువారం పేజీలు : 4


## లోక్‌సభ ఎన్నికల్లో ఏం హామీలు ఇమ్మంటారు?

చెన్నై : వచ్చే యేడాది జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో 'మక్కల్ నీది మయ్యం' ఎన్నికల మేనిఫెస్టోను ప్రజాభిప్రాయాలకు అను గుణంగా రూపొదించాలని నిర్ణయించింది. ఇప్పటికే ఆ పార్టీకి 114 మంది జిల్లా కార్యదర్శులు ఉన్నారు. పార్టీని పటిష్ఠం చేసే దిశగా 234 అసెంబ్లీ నియోజకవర్గాలకు పార్టీ ఇన్‌ఛార్జీలను నియమించేందుకు ఆ పార్టీ అధ్యక్షుడు, ప్రముఖ సినీ నటుడు కమల్‌హాసన్ పార్టీ నేతలతో చర్చలు జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో 'మక్కలోడు మయ్యం' (ప్రజలతో పార్టీ) పేరుతో ఎలాంటి ఎన్నికల హామీలను ప్రకటించాలో పార్టీ జిల్లా శాఖల నాయకులు ప్రజల నుంచిఅభిప్రా యాలను సేకరించాలని కమల్‌హాసన్ ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు, ఉచిత పథకాలకు సంబంధించిన 15 ప్రశ్నలు కలిగిన కరపత్రాలను పంపిణీ చేసి వాటికి సమాధానాలను ప్రజల నుంచి రాబడుతున్నారు.

# అవిశ్వాస నోటీసు




## బిజెపి సర్కార్‌పై 'యుద్ధానికి' సిద్ధమైన ప్రతిపక్షాలు

దిల్లీ: కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం అవిశ్వాసాన్ని ఎదుర్కోనుంది. బుధవారం ఉదయం విపక్ష పార్టీలు ఇచ్చిన అవిశ్వాస తీర్మాన నోటీసులను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తాజాగా అనుమతించారు. 'దీనిపై నేను అన్ని పార్టీలతో చర్చిస్తాను. ఆ తర్వాత చర్చకు సమయం ప్రకటిస్తాను' అని స్పీకర్ వెల్లడించారు. మణిపుర్ అంశంపై పార్లమెంటులో ప్రధాని మోదీ ప్రకటన చేయాల్సిందేనని పట్టుబట్టిన విపక్ష కూటమి 'ఇండియా'.. ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు స్పీకర్‌కు నోటీసులు ఇచ్చిన సంగతి తెలిసిందే. కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడితే.. ప్రధాని మోదీ మాట్లాడటంతో పాటు తమకూ పలు అంశాలను లేవనెత్తడానికి అవకాశం లభిస్తుందనే యోచనతో విపక్ష కూటమి ఈ అడుగువేసింది. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం స్పీకర్‌కు కాంగ్రెస్, భారాస నోటీసులు సమర్పించాయి. ఈ నోటీసులను పరిశీలించిన ఓం బిర్లా.. తీర్మానానికి అనుమతించారు. మణిపుర్ అంశంపై వాయిదా పడిన సభ 12 గంటలకు తిరిగి ప్రారంభమైంది. ఆ తర్వాత స్పీకర్ ఓం బిర్లా అనుమతితో కాంగ్రెస్ డిప్యూటీ నేత గౌరవ్ గొగొయ్.. ఈ తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టారు. అనంతరం ఈ తీర్మానంపై చర్చించేందుకు ఎంతమంది మద్దతు ఇస్తున్నారని స్పీకర్ సభ్యులను అడిగారు. దీంతో కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ సహా పలువురు విపక్ష నేతలు తమ మద్దతు ప్రకటిస్తూ లేచి నిల్చున్నారు. చర్చకు అవసరమైన మద్దతు లభించడంతో ఈ తీర్మానాన్ని స్పీకర్ అనుమతించారు. దీనిపై అన్ని పార్టీలతో చర్చించి తేదీ, సమయం ప్రకటిస్తానని తెలిపారు. ఇదిలా ఉంటే.. మణిపుర్ అంశంపై పార్లమెంట్ కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతూనే ఉంది. ఇదే విషయంపై ప్రధాని మోదీ ప్రకటన చేయాలని విపక్షాలు పట్టుబట్టడంతో మరోసారి దిగువ సభ వాయిదా పడింది.

**ఎవరి బలాబలాలు ఎలా ఉన్నాయి..? :** నరేంద్ర మోదీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వంపై కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ అవిశ్వాస తీర్మానం నోటీసు ఇవ్వడం, దీనికి సభాపతి ఓం బిర్లా అనుమతి ఇవ్వడంతో ఎవరి బలాబలాలు ఎలా ఉన్నాయనే చర్చ మొదలైంది. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడానికి 50 మంది సభ్యుల మద్దతు ఉండాలి. లోక్‌సభలో సభ్యుల సంఖ్య 543 కాగా, 537 మంది ప్రస్తుతం ఉన్నారు. 6 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఎవరి వైపు ఎవరు నిలిచే అవకాశం ఉందనేది ఓసారి చూద్దాం.

**మోదీ సర్కార్‌కు మద్దతుగా 331 మంది..** నరేంద్ర మోదీ ప్రభుత్వానికి 331 మంది సభ్యుల (లోక్‌సభ స్పీకర్‌తో కలిపి) మెజారిటీ ఉంది. అతిపెద్ద పార్టీగా బీజేపీకి సొంతంగా 301 సీట్లు ఉన్నాయి. కూటమి భాగస్వాములుగా మద్దతుగా నిలుస్తున్న పార్టీల్లో శివసేన (షిండే)-13, రాష్ట్రీయ లోక్ జన్‌శక్తి పార్టీ (ఆర్ఎల్‌జేపీ)-5, అప్నా దళ్ సోనీలాల్ (ఏడీఎస్)-2, లోక్ జన్‌శక్తి పార్టీ (రామ్ విలాస్)-1, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (అజిత్ పవార్)-1, అల్ జారా?ండ్ స్టూడెంట్స్ యూనియన్ (ఏజేఎస్‌యూ)-1, నేషనలిస్ట్ డెమోక్రటిక్ ప్రొగ్రెసివ్ పార్టీ (ఎన్‌డీపీపీ)-1, నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పీఎఫ్)-1, నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ)-1, సిక్కిం క్రాంతికారి మోర్చా (ఎస్‌కేఎం)-1, మిజో నేషనల్ ఫ్రంట్ (ఎంఎన్ఎఫ్)-1, ఇండిపెండెంట్లు (సుమలత, నవనీత్ కౌర్)-2 ఉన్నారు.

**మోదీ ప్రభుత్వానికి మద్దతుగా వైఎస్ఆర్‌సీపీ :** ఎన్‌డీఏలో భాగస్వామిగా లేని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సారథ్యంలోని యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ (వైఎస్ఆర్‌సీపీ) అవిశ్వాస తీర్మానానికి వ్యతిరేకంగా మోదీ ప్రభుత్వానికి మద్దతు ప్రకటించింది. ఆ పార్టీకి 22 మంది ఎంపీల బలం ఉంది.

**విపక్ష కూటమి 'INDIA' బలం 142...** కాగా, కొత్తగా 26 పార్టీలతో ఏర్పడిన విపక్ష కూటమి ఇండియాకు 142 మంది సభ్యుల బలం ఉంది. సీట్ షేర్ ప్రకారం ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌కు 50 మంది ఎంపీలు ఉన్నారు. ద్రవిడ మున్నేట్ర కళగం (డీఎంకే)కు-24, తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)- 23, జనతాదళ్ యూనైటెడ్ (జేడీయూ)-16, శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ థాకరే)-6, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ-శరద్ పవార్)-4, సమాజ్ వాదీ పార్టీ (ఎస్పీ)-3, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్)-3, జమ్మూ అండ్ కశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ (జేకేఎన్‌సీ)-3, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్)-3, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (సీపీఐ)-2, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)-1, జారా?ండ్ ముక్తి మోర్చా (జేఎంఎం)-1, రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ (ఆర్ఎస్‌పీ)-1, విడుదలై చిరుతైగళ్ కట్చి (వీసీ కే)-1, కేరళ కాంగ్రెస్ (మణి)కి ఒక ఎంపీ ఉన్నారు. కాగా, INDIA కూటమిలో భాగస్వామ్యం లేని కేసీఆర్ సారథ్యంలోని భారత్ రాష్ట్ర సమితి విపక్షాల అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇవ్వాలని నిర్ణయించింది. బీఆర్ఎస్‌కు లోక్‌సభలో 9 మంది ఎంపీల బలం ఉంది.

**తటస్థంగా ఉండే వారిలో..** కాగా, ఎన్డీయే, ఇండియా కూటమిలో ఎవరి వైపు ఉండాలనే విషయంపై ఇంకా తేల్చిచెప్పని (తటస్థ) పార్టీల్లో బిజూ జనతాదళ్ (బీజేడీ)కి 12 మంది ఎంపీల బలం ఉంది. బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్‌పీ)-9, తెలుగుదేశం పార్టీ (టీడీపీ)-3, ఏఐఎంఐఎం-2, శిరోమణి అకాలీ దళ్ (సాద్)-2, జనతాదళ్-సెక్యులర్ (జేడీఎస్)-1, రాష్ట్రీయ లోక్‌తాంత్రిక్ పార్టీ (ఆర్ఎల్‌పీ)-1, ఆల్ ఇండియా యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఏఐయూడీఎఫ్)-1, శిరోమణి అకాలీదల్ (అమృత్‌సర్)-1, స్వతంత్ర అభ్యర్థి హీరా శరణ్య ఉన్నారు.







హైదరాబాద్ : వర్షాలు హైదరాబాద్‌ను అల్లకల్లోలం చేస్తున్నాయి. ఐదు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్నాయి. ఈ వర్షాలకు పలు ప్రాంతాల్లోకి భారీగా నీరు చేరుతోంది. ఇక మురుగు కాలువలు పొంగి పొర్లి ఇళ్లలోకి నీళ్లు ప్రవహిస్తున్నాయి. మురుగు నీరు ఇళ్లలోకి చేరడంతో పాటు మరోవైపు పాములు కూడా ఇళ్లలోకి వస్తున్నాయి. తాజాగా ఇలాంటి ఘటనే ఒక చోటుచేసుకుంది. అల్వాల్ ప్రాంతంలో ఓ ఇంట్లోకి పాము రావడంతో వాళ్లు ఆందోళన చెందారు. జీహెచ్‌ఎంసీ అధికారులకు సంపత్ అనే యువకుడు ఫిర్యాదు చేశాడు. అయితే ఫిర్యాదు చేసి 6 గంటలు గడిచినా కూడా జీహెచ్‌ఎంసీ సిబ్బంది పట్టించుకోలేదు. అంతే ఆ యువకుడికి బీభత్సమైన కోపం వచ్చింది. పామును జీహెచ్‌ఎంసీ ఆఫీసుకి తెచ్చి వదిలాడు. ఆఫీసులోని టేబుల్‌పై పామును పెట్టి సంపత్ తన నిరసన వ్యక్తం చేశాడు.

## టికెట్ల ఖరారు పై ఆశావాహులకు కాంగ్రెస్ హైకమాండ్ క్లారిటీ..!!

హైదరాబాద్ : తెలంగాణ కాంగ్రెస్ లో సీట్ల కోసం పోటీ పెరిగింది. కొత్త ముఖాలు తెర పైకి వస్తున్నాయి. తమకే సీటు అంటూ ప్రచారం చేసుకుంటున్నాయి. ఎవరికి వారు టికెట్లు తమకే అంటూ ప్రచారం చేసుకోవటం సరి కాదని పార్టీ నాయకత్వం స్పష్టం చేస్తోంది. టికెట్ల ఖరారు నిర్ణయం పూర్తిగా తామే పర్యవేక్షిస్తామని పార్టీ సీనియర్లకు హైకమాండ్ హామీ ఇచ్చింది. తాజాగా మేడ్చల్ సీటు వ్యవహారం పైన హైకమాండ్ కు వచ్చిన అంశం పైన పార్టీ నాయకత్వం స్పష్టత ఇచ్చినట్లు సమాచారం. టికెట్లపై నేతల ఆశలు:తెలంగాణ కాంగ్రెస్ లో పెరిగిన జోష్ టికెట్ల పైన పలువురు ఆశలు పెంచుకుంటున్నారు. కాంగ్రెస్ కు అధికారం ఖాయమని నమ్మి పార్టీలోకి వస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. కొందరు ముఖ్య నేతలు తమతో పాటుగా తమ విధేయులకు సీట్లు కావాలంటూ పార్టీలో చేరిక సమయంలో ఒప్పందాలు చేసుకుంటున్నారు. కొంత వరకు వారి షరతులకు పార్టీ హైకమాండ్ మొగ్గు చూపుతోంది. అదే సమయంలో పార్టీని తొలి నుంచి నమ్ముకున్న వారు ఉన్న స్థానాల్లో మాత్రం ఆచి తూచి స్పందిస్తోంది. పార్టీ కోసం కష్టపడిన వారిని విస్మరించి కొత్త వారికి ప్రాధాన్యత ఉండదని తాజాగా ఢిల్లీ కేంద్రంగా జరిగిన పార్టీ ముఖ్య నేతల సమావేశంలో హైకమాండ్ స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే తాజాగా మేడ్చల్ నియోజకవర్గం అంశం తెర మీదకు వచ్చింది.



**హైకమాండ్ వద్దకు మేడ్చల్ అంశం:**సోషల్ మీడియాలో తీన్మార్ మల్లన్న తానే కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రచారం చేసుకుంటున్నారని పార్టీ నేతలు అధినాయకత్వం దృష్టికి తీసుకెళ్లారు. తాము ఎవరికీ ఎటువంటి హామీ ఇవ్వలేదని కాంగ్రెస్ నాయకత్వం స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే మేడ్చల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ కోసం మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్న గారి లక్ష్మారెడ్డితో పాటుగా జంగయ్య యాదవ్, హరి వర్ధన్ రెడ్డి పార్టీ కోసం పని చేస్తున్నారు. ఇప్పుడు మల్లన్న తానే అభ్యర్ధి అని ప్రచారం చేసుకోవటం పైన పార్టీలో చర్చ జరుగుతోంది. ఎన్నికల వేళ అందరి సమిష్టి నిర్ణయం మేరకు అభ్యర్ధిని ఖరారు చేసి..అందరూ అభ్యర్ధి గెలుపుకు పని చేసేలా టికెట్ల ఖరారు విషయంలో హైకమాండ్ ప్రణాళికా బద్దంగా వ్యవహరిస్తోందని నేతలు చెబుతున్నారు.

వైఖరి స్పష్టం చేసిన హైకమాండ్:పార్టీలో నేతల చేరికల సమయంలో ఒప్పందాలను నేరుగా పార్టీ నాయకత్వం చర్చిస్తోంది. వారి అభ్యర్ధనల పైన ఆచి తూచి స్పందిస్తోంది. కాంగ్రెస్ పార్టీకి పట్టున్న మేడ్చల్ లాంటి నియోజకవర్గాల్లో అందరికీ ఆమోదయోగ్యంగా నిర్ణయం ఉంటుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పార్టీ కోసం పని చేసిన వారి సేవలను విస్మరించేలదని స్పష్టం చేస్తోంది.

అభ్యర్ధిని గెలిపించాల్సింది స్థానిక నేతలు..కేడర్ కావటంతో వారి అభీష్టానికి వ్యతిరేకంగా ఏ నిర్ణయాలు ఉండవని పార్టీ నేతలు తేల్చి చెబుతున్నారు. కాంగ్రెస్ కష్టాల్లో ఉన్న సమయంలో నష్టాలు భరించి పని చేసిన నేతలకే తొలి ప్రాధాన్యత ఉంటుందని పార్టీ నాయకత్వం స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.

## సాగుకు 24 గంటలు విద్యుత్ అందిస్తూ... ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా..!



# తెలంగాణ రికార్డు!!

హైదరాబాద్ : సాగుకు 24 గంటల పాటు నిరంతరంగా విద్యుత్ అందిస్తున్న ఏకైక రాష్ట్రంగా తెలంగాణ రికార్డు నెలకొల్పింది. ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా నిలుస్తోంది. ప్రతిపక్షాలు చేసే విమర్శలకు నిరంతర విద్యుత్ అమలుతోనే సమాధానం చెబుతోంది. ఎన్నో ఆటు పోట్లు.. ఎంతో వ్యయంతో కూడిన నిర్ణయం అమలు చేస్తోంది ఎన్నో సమస్యలు వాటికి పరిష్కారాలు..ప్రభుత్వ శ్రమ ఫలితంగా తెలంగాణ అంతటా నిరంతర విద్యుత్తు వెలుగులు విరజిమ్మాయి. 2014 కి ముందు..ఆ తరువాత:2004 నుంచి 2014 వరకు ఉన్న కరెంటు సరఫరా తీరు..రాష్ట్ర విభజన తరువాత విద్యుత్ అమలు పైన చర్చకు ప్రభుత్వంలోని మంత్రులు సవాల్ విసురుతున్నారు. వ్యవసాయానికి 24 గంటల కరెంటు అందిస్తున్నదేశంలోనే తొలి రాష్ట్రంగా తెలంగాణ రికార్డు సాధించింది. విద్యుత్తు వ్యవస్థ బలోపేతానికి 37,911 కోట్లు ఖర్చు చేసింది. వినియోగంలో 33% వాటా వ్యవసాయానిదేనని అధికారిక లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. లక్షల్లో సాగు విద్యుత్ కనెక్షన్లు పెరిగాయి. 2018 నుంచి ఇప్పటి వరకు నిరంతర ఉచిత్ విద్యుత్ తెలంగాణ రైతులకు అందుతోంది. 2018 జనవరి 1 తెలంగాణ రైతాంగం కోసం సీఎం కేసీఆర్ ఎన్నో వ్యవ ప్రయాసలు..ప్రణాళికలతో ఈ పథకం అందుబాటులోకి తెచ్చారు.

**ప్రణాళికా బద్దంగా ఒక్కో అడుగు:** తెలంగాణ ఏర్పాటు సమయానికే విద్యుత్ లోటు ఉంది. వ్యవసాయం..పరిశ్రమలకు కోతలతో బాధతలు తప్పేవి కాదు. రాత్రి పూట పాములు, తేళ్లు, విషపు పురుగుల కాట్లతో ఎంతోమంది రైతన్నలు చేన్లలోనే ప్రాణాలు విడిచారు. పంటలు చేతికి రాక.. కండ్లముందే ఎండిపోతుంటే చూడలేక పురుగుల మందు తాగి విగతజీవులైనవారు వందల మంది ఉన్నారు. రైతుల విద్యుత్తు కష్టాలను స్వయంగా చూసిన కేసీఆర్ కు అవే రైతుకు ఏదైనా చేయాలి, ఎంతైనా చేయాలి, ఎంత చేసినా తక్కువే అన్న ఆలోచనకు దారి తీశాయి. ఆ ఆలోచనే.. 24 గంటల నిరంతర విద్యుత్ నిర్ణయానికి కారణమైంది. రాబోయే రోజుల్లో వచ్చే డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని వ్యవసాయానికి 24 గంటలపాటు ఉచిత విద్యుత్తు అందించేందుకు ఏమేం కావాలన్నదానిపై పక్కాగా ప్రణాళిక సిద్ధం చేశారు. దేశంలోనే తొలి రాష్ట్రంగా:క్షేత్రస్థాయిలో 24 గంటల పాటు విద్యుత్తును నిరంతరాయంగా అందించేందుకు వ్యవస్థల బలోపేతంపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ట్రాన్స్‌కో, డిస్కం వ్యవస్థలను పటిష్ఠం చేసేందుకు రూ.37,911 కోట్లు ఖర్చు చేసింది. ట్రాన్స్‌ఫార్మర్ల సంఖ్యను గణనీయంగా పెంచడం, తగినంత సిబ్బం దిని అందుబాటులో ఉంచడం ముఖ్యమని గుర్తించారు. రాష్ట్ర అవసరాలకు తగ్గట్టు సొంతంగా విద్యుత్తును ఉత్పత్తి చేయాలని సంకల్పించారు. ఈ ప్రణాళికలను పక్కాగా అమలు చేశారు. ఒక్కో జిల్లాను అనుసంధానం చేసుకొంటూ, అన్ని జిల్లాలను అనుసంధానం చేశారు. సాంకేతిక సమస్యలను, లోటుపాట్లను ఎప్పటికప్పుడు పరిష్కరించి పథకం అమల్లోకి తెచ్చారు.

**ఏకైక రాష్ట్రంగా తెలంగాణ :** తెలంగాణ ఏర్పడే నాటికి 74 మెగావాట్లుగా ఉన్న సౌర విద్యుత్తును 5,117 మెగావాట్లకు తీసుకుపోయారు. యాదాద్రిలో 4,000 మెగావాట్లు సహా మరో 8,705 మెగావాట్ల విద్యుత్తు ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి. వీటికోసం రూ.వేల కోట్లు ఖర్చు ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. రాష్ట్రంలో వినియోగించే విద్యుత్తులో 33 శాతం వ్యవసాయానికే వినియోగిస్తున్నట్టు అధికారులు లెక్కలు వేశారు. వానకాలంలో కంటే.. యాసంగిలో వ్యవసాయానికి విద్యుత్తు వినియోగం ఎక్కువగా ఉంటున్నది. అందుకు అనుగుణంగానే విద్యుత్తు అధికారులు చర్యలు తీసుకొంటున్నారు. రూ.37,911 కోట్లతో ట్రాన్స్‌మిషన్, డిస్కం వ్యవస్థలను బలోపేతం చేశాం. ట్రాన్స్‌ఫార్మర్ల సంఖ్యను, సామర్థ్యాన్ని గణనీయంగా పెంచారు. ఫలితంగా రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి 24 గంటల కరెంటు ఇవ్వడం విజయవంతమైంది.

## సంపాదకీయం

# సద్దాం పాలనే బెటర్..

## గళమెత్తిన ఇరాక్ ప్రజలు

ఇరాక్. పాకిస్థాన్ దేశానికి సమీపంలో ఉన్న ముస్లిం కంట్రీ. అయితే.. ఇక్కడ సద్దాం హుస్సేన్ నియంతలా వ్యవహరిస్తున్నారని.. పేర్కొంటూ.. 2000 సంవత్సరంలో అప్పటి అమెరికా అధ్యక్షుడు జార్జ్ బుష్.. ఇరాక్పై దండెత్తారు. అంతేకాదు.. అప్పటి ఇరాక్ పాలకుడు.. సద్దాం హుస్సేన్ను చంపి.. అక్కడ అమెరికా పాలనను ప్రారంభించారు. నిజానికి అమెరికా ప్రమేయాన్ని నిలువరించడమే ఇరాక్ అధిపతిగా .. సద్దాం చేసిన ప్రయత్నం. ఈ కసితోనే కక్షగట్టిన .. అమెరికా.. సద్దాంను చంపే వరకు కూడా నిద్రపోలేదు. ఇరాక్ను హస్త గతం చేసుకోవడం ద్వారా.. చమురు నిల్వలను సొంతం చేసుకునే పన్నాగం కూడా ఉందని.. అప్పట్లో విశ్లేషణలు వచ్చాయి. అయినప్పటికీ.. అమెరికా తన పంతాన్ని నెగ్గించుకునేందుకు.. ఇరాక్ వద్ద.. అంటే.. సద్దాం వద్ద.. సామూహిక జన హనన ఆయుధాలు ఉన్నాయని.. వీటిని ప్రయోగించే అవకాశం ఉందని ఇది ప్రపంచానికి పెను సవాల్ వంటిదని పేర్కొంటూ.. ఏకపక్షంగా దాడులు చేసింది. అయితే.. యుద్ధం ముగిసింది.. బంకర్లో దాక్కున్న సద్దాంను అమెరికా సేనలు మట్టుబెట్టాయి. ఆయన శిలా విగ్రహాలను పెళ్లగించాయి. కట్ చేస్తే.. 2003లో అమెరికా అప్రకటిత పాలనలోకి ఇరాక్ వెళ్లిపోయింది. మరి అగ్రరాజ్యం కనుసన్నల్లో ఇరాక్ అభివృద్ధి చెందిందా? ఇప్పటికి 20 ఏళ్లు పూర్తయ్యాయి. మరి ఈ 20 ఏళ్లలో ఇరాక్ ఏమేరకు పుంజుకుంది? అనే ప్రశ్నలు సహజంగానే తెరమీదికి వస్తాయి. దీనిపై ఇటీవల గాలప్ ఇంటర్నేషనల్ సంస్థ ఓ సర్వే చేపట్టింది. దీనిలో అనేక మంది ఇరాక్ పౌరులు భాగస్వామ్య మయ్యారు. వీరు తమ అభిప్రాయాలను నిస్సంకోచంగా వెల్లడించారు. సద్దాం హుస్సేన్ పాలనను పడగొట్టడానికే అమెరికా దండయాత్ర చేసిందని సర్వేలో పాల్గొన్న 29 శాతం మంది పేర్కొన్నా రు. అమెరికా నేతృత్వంలో 2003 నుంచి దేశం పరిస్థితి అధ్వాన్నంగా మారిందని మెజారిటీ ప్రజలు చెప్పడం గమనార్హం. అమెరికా దండయాత్రకు ముందుతో పోలిస్తే ఇప్పటి ఇరాక్ పరిస్థితి ఎలా ఉందంటే.. 60 శాతం మంది ప్రస్తుతం దేశం పరిస్థితి బాగా దిగజారిందని చెప్పడం.. అమెరికా దుర్నీతికి నిదర్శనంగా మారింది. ఇక 2003 తర్వాత ఇరాక్లో షియా అరబ్ మెజారిటీ రాజకీయంగా శక్తిమంతంగా మారింది. ఇది సున్నీ కుర్ద్ ఇతర మైనారిటీ కమ్యూనిటీల్లో ఆగ్రహాన్ని పెంచింది. అంటే ఒకరకంగా.. రాజకీయ అస్థిరత కూడా పెరిగిందనే చెప్పాలి. సద్దాం పాలనలో జీవితం బాగుండేదని దాదాపు 54 శాతం మంది సున్నీ ముస్లింలు అభిప్రాయపడ్డారు.

**ఐఎస్ పోయి..** ఇరాక్కు అమెరికాతో పాటు మిత్ర దేశాల నుంచి భారీ మిలటరీ సహాయం అందడంతో 2018లో ఐఎస్ను దేశం నుంచి తరిమికొట్టారు. అప్పటి నుంచి దేశంలో స్థిరత్వం తిరిగొచ్చింది. 2007లో ఇరాక్లో అమెరికా సైనికుల సంఖ్య అత్యధికంగా 170000గా ఉండేది. ఇప్పుడు వారి సంఖ్య దాదాపుగా 2500గా ఉంది.

**యువత పరిస్థితి దారుణం?** ఇరాక్లో యువత భవిష్యత్ అంధకారంలో ఉందని తెలుస్తోంది. 2019లో బాగ్దాద్ వీధుల్లో ప్రారంభమైన అక్టోబర్ సోషల్ ఉద్యమాన్ని అణిచివేశారు. ఇక దేశం వదిలిపోవాలనే ప్రయత్నాల్లోనూ ప్రజలు ఉండడం గమనార్హం. 25 శాతం మంది ప్రజలు దేశంలో ఉండడానికి ఇష్టపడడం లేదు. అయితే 47 శాతం మంది ప్రజలు మాత్రం.. ఇక్కడే ఉండి దేశాన్ని పునర్నిర్మించాలని భావిస్తున్నారు.

# భవన నిర్మాణాల్లో ఇష్టారాజ్యం!



కరీంనగర్ : హైదరాబాద్‌లో అనుమతికి విరుద్ధంగా భవన నిర్మాణ పనులు ప్రారంభించడమే కాకుండా.. అయిదు రోజుల్లో రెండు శ్లాబులు వేసేందుకు ప్రయత్నించడంతో అది కూప్పకూలి ఇద్దరు అమాయక కూలీలు మృతి చెందారు.. ఈ ఘటనతో ఉమ్మడి జిల్లాలో నిర్మాణాల తీరుపైనా అనుమానాలు రేకెత్తుతున్నాయి.. ఎవరంటే వారు బిల్డర్లుగా అవతారమెత్తి ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపడుతున్నారన్న ఆరోపణలు ఉన్న నేపథ్యంలో నిబంధనలు పాటిస్తున్నారా అన్న ఆందోళన ఉంది.. ఉమ్మడి జిల్లాలోని నగరాలు, పట్టణాల్లో భవన నిర్మాణాల సంఖ్య విపరీతంగా పెరిగింది. స్థలాలు కొనుగోలు చేసి యజమానులు సొంతంగా కట్టుకోవడంతోపాటు నిర్మించిన ఇళ్లను కొనుగోలు చేస్తున్నవారూ ఉన్నారు. వీటిని త్వరగా నిర్మించి ఇవ్వాలని కొందరు యజమానులు షరతులు విధిస్తుండగా, బిల్డర్లు కూడా తక్కువ రోజుల్లో ఇంటిని నిర్మించి ఇస్తామని ఇటీవల ఎక్కువగా ప్రచారం చేసుకుంటున్నారు. నగర శివారులో ఇలాంటి ఇళ్ల నిర్మాణాలు జరుగుతుండగా నాణ్యత ప్రమాణాలపై పట్టింపు కరవయింది. నగర, పురపాలికల్లో అనుమతులకు విరుద్ధంగా ఇళ్ల నిర్మాణమూ అధికమయింది. ఒకటెండ్రు అంతస్తులకు అనుమతి తీసుకోవడం, అదనంగా రెండు అంతస్తులు అక్రమంగా నిర్మించుకోవడం, మరికొందరైతే అసలు అనుమతి తీసుకోకుండా ప్రజాప్రతినిధుల మద్దతుతో నిర్మించడం మామూలయిపోయింది. సెట్‌బ్యాక్ పాటించకపోవడం.. గేట్లు లోపలి వైపు తెరచుకోవడం వంటి విషయాలను పట్టించుకునేవారే లేరు. కరీంనగర్‌లోని ఒక్కో డివిజన్‌లో పాతిక సంఖ్యలో అనధికారిక నిర్మాణాలు ఉండటం గమనార్హం.

ఇంజినీర్లు చెబుతున్నారిలా..రూ.లక్షలు వెచ్చించి సొంత ఇంటిని నిర్మించుకోవడానికి ఆసక్తి చూపిస్తున్న యజమానులు.. ఆ నిర్మాణాలు త్వరగా నిర్మించి ఇవ్వాలని ఒత్తిడి పెంచుతున్నారు.అనుమతి తీసుకున్న తర్వాత గ్రౌండ్ ఫ్లోర్ నిర్మించేందుకు కనీసం నాలుగు నెలల సమయం తీసుకోవాల్సి ఉంటుంది. ఇందులో రెండు నెలలు పిల్లర్లు, శ్లాబు వేసేందుకు, మరో రెండు నెలలు గోడలు, ప్లంబింగ్ పనులు ఉంటాయి. ఆరు నెలలు సమయం తీసుకుంటే భవనం మరింత పటిష్ఠంగా ఉంటుంది. ఇటీవల మూడు నెలల్లో భవనం నిర్మిస్తామని ప్రచారం చేసుకుంటున్నారు. దాంతో సిమెంటు పనుల్లో బలం ఉండదు. పిల్లర్లు, గోడల నిర్మాణం తరవాత కనీసం 10 నుంచి 15 రోజులపాటు నీటి తడి అందాలి. శ్లాబుకు అయితే మడులు కట్టి 21 రోజులు కచ్చితంగా నీటిని పట్టి ఉంచాలి. సిమెంటు గట్టి పడాలంటే కనీసం 8 రోజుల సమయం పడుతుంది.మొదటి రోజు నీరు ఎక్కువ తాగుతుండగా ఆ తర్వాత కొంతమేర ఆవిరి పోను నిలిచి ఉంటుంది. ఎక్కువ మొత్తంలో మడుల్లోని నీరు తగ్గితే శ్లాబు వేసిన పద్ధతిని అనుమానించాల్సి ఉంటుంది. కొందరు వ్యక్తిగతంగా నిర్మించుకుంటుండగా నీటి తడి అనేదే ఉండటం లేదు. ఒకటెండ్రు రోజులు నీటిని పట్టి మిగతా పనులు చకచకా కానిచ్చేవారు ఉన్నారు.

ఇవీ గమనించాలి..

పట్టణాలు, నగరాల్లో రియల్ వ్యాపారులు కొందరు బిల్డర్ల అవతారం ఎత్తుతున్నారు. అర్హత లేని వారు కూడా ఇంజినీర్లుగా చెలామణి అవుతూ ఇళ్లు కట్టిస్తున్నారు. మరికొందరైతే దొంగ సర్టిఫికెట్లు కూడా తీసుకొచ్చి ఇంటి యజమానులను బురిడీ కొట్టిస్తున్నారు. దీంతో సాంకేతిక తప్పిదాలు చోటుచేసుకుని నిర్మాణం నాసిరకంగా ఉండే అవకాశముంది. నిర్మాణానికి దరఖాస్తు చేసుకుంటే స్థలాన్ని పరిశీలించిన తర్వాత అనుమతి ఇస్తున్నారు. పనుల తనిఖీ వ్యవస్థ మాత్రం లేదు. దీంతో అర్హులైన ఇంజినీర్లు పర్యవేక్షిస్తున్నారా.. వాడే సామగ్రి నాణ్యమైనదా పర్యవేక్షించేవారే లేరు. అవగాహన ఉన్న ఇంటి యజమానులు జాగ్రత్త పడుతున్నా.. తెలియనివారు నిబంధనలు పాటించక నష్టపోయే అవకాశముంది.

జాగ్రత్తలు తీసుకోకపోతే నష్టాలే

రాజేందర్, అధ్యక్షుడు, కరీంనగర్ కన్సల్టింగ్ ఇంజినీర్స్, ఆర్కిటెక్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్

సొంతిల్లు నిర్మించుకునే సమయంలో క్రమ పద్ధతిలో పనులు చేపట్టాలి. యజమానులు అర్హులైన ఇంజినీర్ల దగ్గరికి రాకపోవడంతో భవన నాణ్యతలో లోపాలు వస్తున్నాయి. ఇంటిని నిర్మిస్తే కనీసం వందేళ్లు పటిష్ఠంగా ఉండాలి. ఎలివేషన్‌కు ఆకర్షితులై నష్టపోతున్నారు.

నిర్మాణ ఇంజినీర్లే బాధ్యులు

వై.సుభాష్, డిప్యూటీ సిటీ ప్లానర్, కరీంనగర్ నగరపాలిక

పది మీటర్ల ఎత్తు నిర్మించే భవనాలకు అనుమతి తీసుకునే సమయంలో నిర్మాణ ఇంజినీరు డిజైన్లు, ధ్రువీకరణ ఇస్తారు. ఆ నిర్మాణానికి వారే పూర్తి బాధ్యులు. చిన్న భవనాల వారైతే ఎన్ని అంతస్తుల కోసం పిల్లర్లు వేస్తున్నారో అంతే భవనాన్ని నిర్మించాలి. లేదంటే కూలి పోతుంది. పట్టణ ప్రణాళిక అనుమతి తీసుకోకపోతే చట్ట ప్రకారం కేసులు తప్పవు.

# స్వచ్ఛత సరే.. అభివృద్ధిలోనూ మెరవాలి



సిరిసిల్ల: జాతీయస్థాయిలో స్వచ్ఛత పురస్కారాలు అందుకుంటున్న సిరిసిల్ల పురపాలక సంఘం అభివృద్ధి పనుల్లోనూ మెరవాల్సి ఉంది. జిల్లా కేంద్రమైన సిరిసిల్ల పురపాలికలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. అయితే అధికారుల నిర్లక్ష్యం కారణంగా పనులు మందగించాయి. పెండింగ్‌లో ఉన్న వాటిని సకాలంలో పూర్తి చేస్తేనే పట్టణవాసులకు సౌకర్యంగా ఉంటుంది. స్వచ్ఛ సర్వేక్షణ్‌లోనే కాదు జీవన ప్రమాణాల మెరుగుకు కృషి చేయాల్సిన అవసరం ఉంది. అటువంటప్పుడే పట్టణం అన్ని రంగాల్లో ఔరా అనిపించేలా మారే అవకాశాలున్నాయి.

పెండింగ్‌లో ఉన్నవి.. వెంకంపేట రోడ్డు, డ్రైనేజీల పనులకు రూ.2.29 కోట్లు కేటాయించగా డ్రైనేజీలు పూర్తయ్యాయి. వెంకంపేట రోడ్డు పనులు ఇంకా కొనసాగుతున్నాయి.

రూ.2 కోట్లతో సిరిసిల్ల ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదాన అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. గ్రావెల్ పోసి ఎత్తు పెంచనున్నారు. శౌచాలయాలు, ఓపెన్ జిమ్, రన్నింగ్ ట్రాక్, సీటింగ్ గ్యాలరీస్, లైటింగ్, గేట్లు ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా పైకా భవనంపై క్రీడాకారుల సౌకర్యార్థం డార్మెటరీ నిర్మించనున్నారు. వీటిని పూర్తి చేయాల్సి ఉంది.సిరిసిల్లలో రూ.50 లక్షలతో కొండా లక్ష్మణ్ బాపూజీ కూడలిని ఏర్పాటు చేస్తున్నారు. వీటిని వేగవంతం చేయాల్సి ఉంది.

సిరిసిల్లలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం వరకు రూ.35 కోట్లతో చేపడుతున్న 4 కి.మీ.మొదటి బైపాస్ రోడ్డు పనులు, ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ నుంచి మొదలుకొని రగుడు వరకు రూ.95 కోట్లతో చేపడుతున్న 11 కి.మీ. రెండో బైపాస్ రోడ్డు నిర్మాణాల్లో తీవ్ర జాప్యం నెలకొంది.

సిరిసిల్లలోని శాంతినగర్, పెద్దూర్, రగుడు వద్ద రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణంలోనూ నిర్లక్ష్యం వహిస్తున్నారు. సీసీ రోడ్లు, సెప్టిక్ ట్యాంక్, నీటి సంపులు, సప్లై లైన్లు వంటి పనులు నేటికీ పూర్తి చేయలేదు. వీటిని పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాల్సి ఉంది.శాంతినగర్, అంబేడ్కర్‌నగర్, విద్యానగర్ లింకు రోడ్ల నిర్మాణానికి రూ.7 కోట్లు మంజూరయ్యాయి. వీటిని కూడా చేపట్టాల్సి ఉంది.

ఓపెన్ జిమ్‌లను లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేశారు. ఇవి మరమ్మతులకు గురయ్యాయి. వీటిని బాగు చేయడానికి రూ.3 లక్షలు కేటాయించినా పనులు చేపట్టలేదు.

సిరిసిల్ల పురపాలక సంఘంలో 2018- 2019 సంవత్సరంలో రగుడు, చంద్రంపేట, ముష్టిపల్లి, రాజీవ్‌నగర్, చిన్న బోనాల, పెద్ద బోనాల, సర్దాపూర్ గ్రామాలు విలీనమయ్యాయి. గత మూడు సంవత్సరాల క్రితం విలీనమైన శివారు గ్రామాల్లో రూ.9 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో గత ఏడాది కాలంలో పనులకు శ్రీకారం చుట్టి పూర్తి చేశారు. రూ. 13 లక్షలతో తారకరామనగర్ అర్బన్ పార్క్‌ను ఏర్పాటు చేశారు. రాజీవ్‌నగర్‌లో రూ.13 లక్షలతో బస్తీ దవాఖానా నిర్మించారు. స్థానికులకు వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి.

రూ.1.05 కోట్లతో అత్యాధునిక దోబీఘాట్, రూ.103 కోట్లతో ముస్లిం గ్రేవ్ యార్డ్‌లను నిర్మించారు. రూ.13 కోట్లతో కొత్త చెరువు పనులు, రూ. 3.5 కోట్లతో మినీ స్టేడియం పనులు పూర్తయ్యాయి.

రూ.1.38 కోట్లతో వెంకటాపూర్ వద్ద అర్బన్ పార్క్, రూ.40 లక్షలతో యానిమల్ కేర్ సెంటర్‌లను ఏర్పాటు చేశారు.

రూ.15 కోట్లతో ఇంటర్నల్ రోడ్లు, డ్రైన్లు పూర్తి చేశారు.

ట్రాఫిక్ సిగ్నల్స్

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కూడలి వద్ద, నేతన్నచౌక్ వద్ద లీడ్ స్పేస్ కంపెనీ సౌజన్యంతో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. నేతన్నచౌక్ వద్ద ఏర్పాటు చేశారు. కలెక్టరేట్ కూడలి వద్ద పూర్తి చేయలేదు. ఇక్కడ కూడా పూర్తి చేయాల్సిన అవసరం ఉంది.

మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి

గత సంవత్సరం చేపట్టిన అభివృద్ధి పనులు చాలా వరకు పూర్తి చేశాం. పెండింగ్‌లో ఉన్న పనులను సైతం నిర్దేశించిన గడువులోగా పూర్తి చేస్తాం. స్వచ్ఛతతో పాటు అభివృద్ధిలోనూ సిరిసిల్లను మొదటిస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తాం.సమ్మయ్య, మున్సిపల్ కమిషనర్

# ఆశలు ఫలించేనా..?

భూపాలపల్లి : దశాబ్దాల కిందట తెల్ల కాగితాలపై జరిగిన కొన్ని భూక్రయవిక్రయాలు వారసుల ప్రవేశంతో సమస్యగా మారుతున్నాయి. తమ పూర్వీకుల నిరక్షరాస్యత, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని కొందరు బలవంతంగా తెల్లకాగితాలపై రాయించుకుని ఆ భూములను స్వాధీనం చేసుకున్నారంటూ జిల్లాలో ఎక్కడో ఒక్కచోట వివాదాలు జరుగుతున్న సంఘటనలు కనిపిస్తున్నాయి. దశాబ్దకాలంగా తెల్లకాగితాలపై రాసుకున్న విక్రయం ఒప్పందాలను క్రమబద్ధీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2016లో ప్రత్యేక కార్యాక్రమానికి శ్రీకారం చుట్టింది. దీంతో జిల్లాలో అనేక మంది రైతులు ముందుకు వచ్చి సాదాబైనామాలతో దరఖాస్తు చేసుకున్నారు. ఇలా జిల్లాలో 80,425 దరఖాస్తులు రాగా వాటిని పరిశీలించిన



అధికారులు 15,034 దరఖాస్తుల సమస్యలను పరిష్కరించారు. మిగిలిన 65,391 తిరస్కరించారు. తమ దరఖాస్తులు ఎందుకు తిరస్కరణకు గురయ్యాయో వాటిని క్రమబద్ధీకరించేందుకు అధికారులు ముందుకు రాకపోవడంతో వేలాదిమంది రైతులు సాదాబైనామా కొనుగోళ్ల క్రమబద్ధీకరణకు ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్నారు.

# రాజముద్రే తరువాయి

భూపాలపల్లి : ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కామారెడ్డి పట్టణం కొత్త మాస్టర్ ముసాయిదా అంశం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఐదారు రోజులుగా రైతులు, ప్రజలు ఆందోళన బాట పట్టారు. దీంతో అందరి దృష్టి నగరాలు, పట్టణాల్లో కొత్తగా రూపొందించిన మాస్టర్ ప్లాన్లపై పడింది. వరంగల్ నూతన బృహత్ ప్రణాళిక(మాస్టర్ ప్లాన్)పై చర్చించుకుంటున్నారు. కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ పర్యవేక్షణలో లీ అసోసియేట్ కన్సల్టెంటు విజన్-2041 పేరుతో ఈ ప్రణాళిక రూపొందించింది. దీనిపైనా రైతులు, స్థానికుల నుంచి పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమైంది. దాదాపు 3వేల పైనే అభ్యంతరాలు వచ్చాయి. వీటిని ఎంత వరకు పరిగణలోకి తీసుకు



న్నారనేది గోప్యంగా ఉంచారు. ప్రధాన మూడు జోన్లను స్థానికులు వ్యతిరేకించారు. వరంగల్ మాస్టర్ ప్లాను 1971లో తయారు చేశారు. 1972లో అమల్లోకి తెచ్చారు. ఇప్పటికి 50 ఏళ్లు దాటింది. నిబంధనల ప్రకారం 15 ఏళ్లకోసారి పునఃపరిశీలించాలి. ఈ విధానం అమలు కాలేదు. పాతదే అమలవుతోంది.

గ్రీన్ జోన్: భట్టుపల్లి, కడిపికొండ శివారుల్లో గ్రీన్ జోన్లు ప్రతిపాదించారు. దీనిపై రైతులు వ్యతిరేకించారు. గ్రీన్ జోన్ అంటే భవన నిర్మాణ అనుమతులు ఇవ్వరు, అన్ని రకాలైన కట్టడాలకు ఇబ్బందికరంగా ఉంటుంది. రైతులు, ప్రజలు గొడవ చేశారు.

పరిశ్రమల..: మడికొండ, రాంపూర్ శివారుల్లో ప్రతిపాదించారు. ప్రస్తుతం ఉన్న 100 ఎకరాలే కాకుండా, చుట్టు పక్కల ప్రైవేటు స్థలాల్లో పరిశ్రమల జోన్ ఎలా పెడుతారని రైతులు వ్యతిరేకించారు. చివర్లో మార్పులు చేశారు. పబ్లిక్ అండ్ సెమీ పబ్లిక్: మామునూరు, పింఛన్‌పురా, సింగారం శివారుల్లో ప్రతిపాదించారు. నిబంధనల ప్రకారం నివాస, వాణిజ్య భవనాలు, లేఅవుట్లకు అనుమతులు ఇవ్వరు. కేవలం ప్రభుత్వ కార్యాలయాలకు మాత్రమే ఉంటుంది. దీనిపై కూడా అభ్యంతరాలు వచ్చాయి.

ప్రత్యేకతలివీ.. విజన్-2041 పేరుతో నాలుగేళ్ల క్రితమే జియో గ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్(జీఐఎస్) విధానం ద్వారా రూపొందించారు.మొత్తం 10 జోన్లుగా విభజించారు. కాజీపేట, హనుమకొండ, వరంగల్‌లో నివాస, వాణిజ్య భవన నిర్మాణాలకు పచ్చా జెండా ఊపారు. గతంలో అడ్డంకులుండేవి. కొత్తగా గ్రోత్ కారిడార్ ప్రతిపాదించారు. ప్రాంతీయ, బాహ్య, అంతర్ వలయ రహదారుల పక్కన టౌన్‌షిప్‌లు ఏర్పాటు కానున్నాయి. 100, 150, 200 అడుగుల రహదారుల పరిసరాల్లో గ్రోత్ కారిడార్ నిబంధనలు అమల్లోకి వస్తాయి. కొత్తగా మిక్స్‌డ్ ల్యాండ్ యూజ్ జోన్ ప్రతిపాదించారు. దీనివల్ల 80, 100, 150, 200 అడుగుల రహదారుల పరిసరాల్లోని ఒక కిలోమీటరు వరకు మిక్స్‌డ్ ల్యాండ్ యూజ్ సిస్టమ్ అమలు చేస్తారు. నివాస, వాణిజ్య, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా భవన నిర్మాణాలకు అనుమతులు వస్తాయి. హైదరాబాద్ హెచ్ఎండీఏ మాదిరిగా మూడు రహదారులు ప్రతిపాదించారు. ప్రాంతీయ బాహ్య వలయ రహదారి నగరానికి సుమారు 35-40 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. 2050 వరకు అన్ని అవసరాలకు ఉపయోగపడుతుంది.

గ్రేటర్ వరంగల్ చుట్టూ బాహ్య వలయ రహదారి డిజైన్ చేశారు. ఇప్పటికే .జాతీయ రహదారుల శాఖ హైదరాబాద్- కరీంనగర్, ఏటూరునాగారం రహదారిలో సుమారు 27 కిలోమీటర్లు పూర్తి చేసింది.త్రినగరిలో అంతర్ వలయ రహదారి డిజైన్ చేశారు. కుడా ఇప్పటికే రూ.150 కోట్లతో భూసేకరణ చేసింది. 200 అడుగుల రోడ్డు నిర్మాణానికి సీఎం హామీల పథకం ద్వారా రూ.50 కోట్లు విడుదలయ్యాయి.

అమలైతే మెట్రో నగరాల స్థాయి

వరంగల్ మెట్రో నగరంగా ఎదగాలంటే బృహత్ ప్రణాళిక చాలా అత్యవసరం. 10 జోన్లు, గ్రోత్ కారిడార్, మిక్స్‌డ్ ల్యాండ్ యూజ్ జోన్లు వంటి ఏర్పాటుతో దేశంలోని మెట్రో నగరాల సరసన వరంగల్ నిలవనుంది. 2021 మార్చిలోనే రాష్ట్ర పురపాలక శాఖ ఆమోదించింది. ముఖ్యమంత్రి కేసీఆర్ సంతకం చేస్తే రాజముద్ర పడటమే తరువాయి. కొవిడ్-19 వల్ల జాప్యమైందని త్వరలోనే అధికారిక ఉత్తర్వులు వెలువడుతాయని అధికారులంటున్నారు.

# ఆక్రమణల పర్వం

భూపాలపల్లి : వరంగల్ మహానగరంలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణల పర్వం కొనసాగుతోంది. కాలనీల్లోని ప్రధాన మార్గాల్లో స్థలం కనిపిస్తే కబ్జాకు యత్నం చేస్తున్నారు. ముందుగా ఆ స్థలాలను శుభ్రం చేస్తున్నారు. అనంతరం తాత్కాలికంగా షెడ్లు నిర్మిస్తున్నారు. కొన్నాళ్లకు గుట్టు చప్పుడు కాకుండా పక్కా నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రశ్నించే వారిని నయానో, భయానో లొంగదీసుకుంటున్నారు. ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాల్సిన నగరపాలక, రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

ఫిర్యాదుల వెల్లువ: కాలనీల్లో కబ్జాలపై స్థానికులు ఎప్పటికప్పుడు ఆరా



తీస్తున్నారు. వాటిని ప్రతి బల్దియా, కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణి కార్యాక్రమాల్లో ఫిర్యాదులు చేస్తూనే ఉన్నారు. చిత్రాలతో సహా ఆధారాలు ఇస్తున్నారు. అయినా సంబంధిత అధికారులు ఫిర్యాదులను లెక్కలోకి తీసుకోకపోవడంతో పలు విమర్శలకు తావిస్తోంది. బాలసముద్రంలోని శ్రీనివాసనగర్‌లో 30 అడుగుల రోడ్డును ఆక్రమిస్తున్నారని గత నగరపాలక సంస్థ కమిషనర్‌కు పలువురు విన్నవించారు. ఉజిలీబేస్ ప్రాంతంలో కొందరు వ్యాపారులు నడక దారులను సైతం ఆక్రమించి నిర్మాణం చేపట్టారని వాటిని తొలగించాలని వినతిపత్రం అందించారు.

# కేయూ.. ప్రాంగణ నియామకాల్లో జోరు

వరంగల్ : కాకతీయ విశ్వవిద్యాలయం.. ఓయూ తర్వాత అతిపెద్ద యూనివర్సిటీ.. విద్యార్థులను అక్కున చేర్చుకుంటోంది.. ఉన్నత విద్యను అందిస్తోంది.. విషయ నైపుణ్యాలను పెంపొందిస్తోంది.. వివిధ కంపెనీలను ఆహ్వానిస్తోంది.. క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.. విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తోంది.. వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తోంది..

కేయూ విద్యార్థులు ప్రాంగణ నియామకాల్లో జోరు కొనసాగిస్తున్నారు. జాతీయ, బహుళ జాతి సంస్థల్లో ఆకర్షణీయమైన వేతనాలతో కొలువులకు ఎంపికవుతున్నారు. ఇంజినీరింగ్, ఫార్మసీ, బయోటెక్నాలజీ, జియాలజీ, మానవ వనరుల నిర్వహణ శాస్త్రాలకు చెందిన విద్యార్థులు సత్తా చాటుతున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే కళాశాలల ప్రిన్సిపాళ్లు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకొని క్యాంపస్ ఇంటర్వ్యూలకు విద్యార్థులను సిద్ధం చేస్తున్నారు.

ప్లేస్‌మెంట్ సెల్ పాత్ర కీలకం

క్రమం తప్పకుండా ప్రాంగణ నియామకాల ప్రక్రియ కొనసాగుతోంది. వివిధ కంపెనీలను రప్పించడం, విద్యార్థులను ఇంటర్వ్యూలకు సంసిద్ధులను చేయడానికి కళాశాలల్లో ప్లేస్‌మెంట్ సెల్‌లు ఏర్పాటు చేశారు. విషయ నిపుణులను ప్లేస్‌మెంట్ అధికారులుగా నియమించారు. వీరు ఏయే సంస్థల్లో ఎలాంటి ఉద్యోగాలు ఉన్నాయో శోధిస్తున్నారు. కొలువుల సాధనకు ఎలాంటి శిక్షణ ఇవ్వాలో తెలుసుకొని.. విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్నారు. అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచుతారు. రాత పరీక్షకు ఎలా సిద్ధం కావాలి, ఇంటర్వ్యూలను ఎలా ఎదుర్కోవాలో మెలకువలు నేర్పిస్తున్నారు.

ఏటా మూడుసార్లు క్యాంపస్ ఇంటర్వ్యూలు జరుగుతాయి. గత మూడేళ్లలో 1461 మంది ఉద్యోగాలను సాధించారు. మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు 629 మందికి, కో ఎడ్యుకేషన్ ఇంజినీరింగ్ కళాశాలలో 440 మంది, బయోటెక్నాలజీలో 75, జియాలోజీలో 182, హెచ్‌ఆర్ఎంలో 33, ఫార్మసీలో 92 మందికి కొలువులు వచ్చాయి. ఈ ఏడాది మార్చిలో ప్రాంగణ నియామకాలు జరిగాయి. ఎంపికైన వారికి ప్రస్తుతం నియామక పత్రాలు అందాయి.

సలహాలు, సూచనలు ఇచ్చారు

బి.వర్ష, కంప్యూటర్ సైన్స్

ఆఖరి సంవత్సరం చదువుతున్నా. ఈ ఏడాది మార్చిలో జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగం లభించింది. సంతోషంగా ఉంది. ఈ నెలలో ఎంపిక సమాచారం వచ్చింది. గ్లోబల్ బిజినెస్ సర్వీసెస్ (జీవీఎస్)లో ఏడాదికి రూ.8.25 లక్షల వేతనం. ఉద్యోగ సాధనకు ఎలా సిద్ధం కావాలో అధ్యాపకులు ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు ఇచ్చారు.

నియామక పత్రం వచ్చింది

ఎం.లిఖిత, ఐటీ

కళాశాలలో ప్రవేశం పొందినప్పటి నుంచే ప్రాంగణ నియామకాలపై అధ్యాపకులు కల్పించిన అవగాహన ఉద్యోగ సాధనకు దోహదపడింది. గత మార్చిలో కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూకు హాజరయ్యాను. రాత, ముఖాముఖి పరీక్షల్లో నెగ్గాను. డెలైట్ కంపెనీలో ఉద్యోగం సాధించా. ఏడాదికి రూ. 7.8 లక్షలు వేతనం ఇస్తామని నియామక పత్రం వచ్చింది.

రూ. 8 లక్షల ప్యాకేజీ

వి.సంకీర్తన, సీఎస్ఈ, కేయూ మహిళా ఇంజినీరింగ్ కళాశాల

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగం సాధించినందుకు కుటుంబ సభ్యులు ఎంతో సంతోషపడ్డారు. డీవీఎస్ బ్యాంక్ లిమిటెడ్ సంస్థలో ఏడాదికి రూ.8 లక్షల ప్యాకేజీ ఇస్తామని సంస్థ నిర్వాహకులు సమాచారం ఇచ్చారు. విద్యాసంవత్సరం ప్రారంభం నుంచే అకడమిక్ అంశాలపై దృష్టి సారించా.

కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకున్నా

పి.పవన్, ఈసీఈ

ఇన్ఫోసిస్‌లో ఉద్యోగం వచ్చింది. ఏడాదికి రూ.7.5 లక్షల వేతనం. ఈ కొలువు సాధించడంలో అధ్యాపకులు, ప్లేస్ మెంట్ అధికారి, ప్రిన్సిపల్ సూచనలు సలహాలు ఎంతో దోహదపడ్డాయి. ఇంటర్వ్యూలు ఎలా ఎదుర్కోవాలో అర్థమైంది. కమ్యూనికేషన్ స్కిల్స్, ఆంగ్లంలో నైపుణ్యం పెంచుకున్నా. వీటిపై విద్యార్థులు ప్రత్యేక దృష్టి సారిస్తే కొలువులు సాధించవచ్చు.

ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం– ఎం.సదానందం, కేయూ మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్

విద్యాసంవత్సరం ప్రారంభం నుంచే ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. కంపెనీలు, అందులో ఉండే ఉద్యోగాలు, వాటిని సాధించడం కోసం ఎలా సిద్ధం కావాలో అవగాహన కల్పిస్తున్నాం. ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం.

ప్రణాళికతో ముందుకు..– ఆచార్య పి.మల్లారెడ్డి. కేయూ కోఎడ్యుకేషన్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్

మంచి ఉద్యోగాలు సాధించాలంటే ఎలా ముందుకు వెళ్లాలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్లేస్‌మెంట్ సెల్‌కు పూర్తి బాధ్యతలు అప్పగించాం. అకడమిక్ పుస్తకాలతో పాటు జనరల్ నాలెడ్జికి సంబంధించిన పుస్తకాలను కూడా అందుబాటులో ఉంచాం. ఏటా 100 మందికి పైగా ఉద్యోగాలు సాధించగలుగుతున్నారు.

కంపెనీలను సంప్రదిస్తున్నాం– బి.కిరణ్‌కుమార్ ప్లేస్‌మెంట్ అధికారి

ఏటా వివిధ కంపెనీల నిర్వాహకులను సంప్రదిస్తున్నాం. ఆ సంస్థల్లో ఎలాంటి ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయో తెలుసుకొని వాటికి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాం. ఆఖరి సంవత్సరం విద్యార్థులు అధిక మొత్తంలో ఉద్యోగాలు సాధిస్తున్నారు.

# ఉపరితల గని.. ఉత్పత్తి ఆగొద్దని

వర్షాకాలం.. సింగరేణి ఉపరితల గనులకు పరీక్ష సమయం లాంటిది. ఏటా అత్యధికంగా కురుస్తున్న వర్షాలతో సంస్థలోని ఉపరితల గనులు జలమయమై షావల్స్, డ్రిల్స్ వంటి భారీ యంత్రాలు నీట మునగడం, కోల్‌బెంచ్‌లు కనుమరుగవడం పరిపాటిగా మారుతోంది. ఈ సంవత్సరం రామగుండం రీజియన్‌లోని ఉపరితల గనుల ప్రాజెక్టు అధికారులు ముందు చూపుతో వర్షాలు, వరద ముప్పు నుంచి ప్రాజెక్టులను కాపాడుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్నారు. వందల మీటర్ల లోతులో.. పదుల కిలోమీటర్ల వెడల్పుతో నడుస్తున్న ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుల్లోకి వరద నీరు చేరకుండా ప్రాజెక్టుల పక్క నుంచి ప్రవహించే వాగులను శుభ్రం చేయించారు. క్వారీల్లోకి చేరే వర్షపు నీటిని ఎప్పటికప్పుడు ఎత్తిపోసే విధంగా అత్యధిక సామర్థ్యం ఉన్న పంపులను, నీరు ఎత్తిపోసేందుకు ఆటంకం లేకుండా సబ్‌మెర్సిబుల్ పంపులను సైతం సమకూర్చుకున్నారు.

లక్ష గ్యాలన్లు ఎతిపోసేలా..ఈ ప్రాజెక్టులో రోజువారి బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 8 వేల టన్నులు, రోజువారి ఓబి(మట్టి)వెలికితీత 80 వేల క్యూబిక్ మీటర్లు. ఈ ప్రాజెక్టును వర్షం, వరద ముప్పు నుంచి కాపాడుకునేందుకు ముందస్తుగా ప్రాజెక్టులో నిమిషానికి లక్ష గ్యాలన్ల నీటిని ఎత్తిపోయడానికి వీలుగా 350హెచ్‌పీ సామర్థ్యం ఉన్న 5 పంపులను, 550 హెచ్‌పీ–1తోపాటు ప్రైవేటుకు చెందిన 250 హెచ్‌పీ–4 పంపులను సమకూర్చారు.నదిలో కలిసేలా..ఈ ప్రాజెక్టులో రోజువారి బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 8 వేల టన్నులు, రోజువారి ఓబి(మట్టి)వెలికితీయడం 90 వేల క్యూబిక్ మీటర్లు. గతంలో ఈ ప్రాజెక్టులో షావల్ మునిగిన ప్రమాదాలు పునరావృతం కాకుండా ముందస్తుగా 12 నీటి పంపులను సమకూర్చారు.

# మొక్కల పండగ.. చేద్దాం నిండుగా



మహబూబాబాద్ : అంతరించిపోతున్న అడవులకు పునరుజ్జీవం పోయడం..ఫల, ఔషధ మొక్కలను పెంచి ఆరోగ్యవంతమైన తెలంగాణగా మార్చాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం 'తెలంగాణకు హరితహారం' కార్యక్రమం తీసుకొచ్చింది. వనాలతోనే జనాలు, వన్యప్రాణుల మనుగడ కొనసాగిస్తాయి. భూతాపాన్ని తగ్గేలా.. విస్తారంగా వర్షాలు కురిసేలా తోడ్పాటునందిస్తున్నాయి. ఇలా ఎన్నో ప్రయోజనాలను కోరుతూ చేపడుతున్న మొక్కల పండగ తొమ్మిదో విడత ప్రారంభమైంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొదలైన ఈ వేడుకలో అందరం పాల్గొందాం.. మొక్కలు నాటి ప్రకృతిని సంరక్షిద్దాం. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా తొమ్మిదో విడత హరిత హారంలో 1.66 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యం నిర్దేశించుకున్నారు. రాష్ట్ర దశాబ్ది వేడుకల్లో భాగంగా జూన్ 19 నుంచి ఈ మొక్కల పండగను మొదలు పెట్టారు. పర్యావరణానికి, ఇతర ప్రయోజనాలకు తోడ్పడే మొక్కలతో పాటు ఇళ్లలో పెంచేందుకు పండ్లు, పూల మొక్కలు కూడా ఉన్నాయి.

ఇదే తరుణం..జూన్ 19న మొదలైనప్పటికీ అన్ని జిల్లాలో వర్షాలు సమృద్ధిగా కురవలేదు. మొక్కలు నాటడానికి సమయం అనుకూలంగా లేదు. ఇటీవల నుంచి వానలు విస్తారంగా కురుస్తుండటంతో భూమంతా పదునైనందున శాఖల వారీగా పెట్టుకున్న లక్ష్యం పూర్తి చేసేందుకు చక్కని అవకాశం. నిర్దేశించుకున్న ప్రదేశంలో నాటి లక్ష్యాన్ని పూర్తి చేస్తే ప్రభుత్వ ఆశయం నెరవేరుతుంది.

ఊరూరా నర్సరీలు

హరితహారం కార్యక్రమం మొదట్లో మొక్కల కొరత ఏర్పడింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని మూడేళ్లుగా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ప్రతి పంచాయతీలో నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలు పెంచుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 1,688 నర్సరీలు ఏర్పాటు చేసి 2.62 కోట్ల మొక్కలు పెంచుతున్నారు. వీటిలో కానుగ, యాప, చింత, జామ, టేకు, మామిడి, మునగ, దానిమ్మ, సీతాఫలం, నిమ్మ, గులాబి తదితర మొక్కలను సంరక్షిస్తున్నారు. మొక్కలు అందుబాటులో ఉండటంతో హరితహారం లక్ష్యం నెరవేరుతోంది. రవాణా సమస్యలు తొలగిపోతున్నాయి. వీటితో పాటు అటవీశాఖ, పురపాలక సంఘాల పరిధిలోనూ నర్సరీలు పెంచుతూ లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు నాటేందుకు కసరత్తు చేసున్నారు.

వివిధ శాఖల భాగస్వామ్యంతో..

జిల్లాల వారీగా నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకునేందుకు అన్ని శాఖలను భాగస్వామ్యం చేస్తున్నారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీ, అటవీ, పోలీస్, మున్సిపాలిటీ, విద్య, ఎక్సైజ్, వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమ, సంక్షేమ శాఖలు, ఇలా అన్ని శాఖలను కలుపుకుని ఎక్కువ మొత్తంలో మొక్కలు నాటి పచ్చదన్నాన్ని పెంచేందుకు కార్యాచరణ రూపొందించుకున్నారు. అటవీ ప్రాంతంలోని ఖాళీ స్థలాల్లో, రైతుల పొలం గట్లలో, రహదారులకు ఇరువైపులా, వైకుంఠ ధామాల్లో, డంపింగ్ యార్డులు, చెరువు గట్లపై, రహదారులకు ఇరువైపులా, ప్రభుత్వ కార్యాలయాల, ఆసుపత్రులు, పాఠశాలలు, ఇళ్ల ఆవరణల్లో పెంచేందుకు నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు.

జిల్లాల వారీగా నాటాల్సిన మొక్కల లక్ష్యం (లక్షల్లో)

భూపాలపల్లి 14.50

ములుగు 13.5

జనగామ 54.74

వరంగల్ 25.95

మహబూబాబాద్ 49.64 హనుమకొండ 8.00

# పీడీ యాక్టు.. నేరాలు అదుపు!



వరంగల్ : సమాజంలో నేరాలు పెరిగిపోతున్నాయి. పోలీసులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా కొందరు అదే పనిగా పెట్రేగిపోతున్నారు. వీరిని కట్టడి చేయడానికి పీడీ (ప్రివెన్షియల్ డిటెక్షన్) యాక్టును ప్రయోగిస్తున్నారు. జైలుకు పంపుతున్నారు. బయటకు వచ్చిన తర్వాత ప్రత్యేక నిఘా ఉంచుతున్నారు. వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తున్నారు. అవసరమైన కౌన్సెలింగ్ ఇస్తున్నారు. నేరాలు అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు. ఇప్పటి వరకు వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో 256 మందిపై పీడీ చట్టం నమోదు చేశారు. ఇందులో గంజాయి, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా చేసే వారితో పాటు రౌడీషీటర్స్, భూ కబ్జాదారులు, హత్యకేసులో నిందితులు ఉన్నారు. వరంగల్ మహానగరంలోని మరికొంత మందిపై పీడీ యాక్టు నమోదు చేసేందుకు రంగం సిద్ధం చేశారు.

సాధారణంగా నేరాలు చేసిన వారిపై పోలీసులు వివిధ సెక్షన్ల కింద కేసులను నమోదు చేస్తారు. కేసు తీవ్రతను బట్టి ఠాణాలో నోటీసు ఇస్తారు. అవసరమైతే న్యాయస్థానంలో హాజరుపరుస్తారు. నేరం తీవ్రతను పరిగణలోకి తీసుకునే జడ్జి.. బెయిల్ మంజూరు చేస్తారు.. లేదా రిమాండ్ విధిస్తారు. కానీ పీడీ యాక్టు కింద కేసు నమోదైతే నిందితుడిని కోర్టులో హాజరుపర్చకుండా నేరుగా జైలుకు తరలిస్తారు. మూడు నెలల తర్వాత బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. గతేడాది వర్ధన్నపేట ఠాణా పరిధిలో అక్రమంగా గంజాయి సరఫరా చేస్తున్న నలుగురు స్మగ్లర్మలపై, కమిషనరేట్ పరిధిలో దారి దోపిడీలకు పాల్పడుతున్న నలుగురిపై ఇంతేజార్‌గంజ్ పోలీసులు పీడీ యాక్టు నమోదు చేశారు.

ఇలా చేస్తారు..

నేరగాళ్ల సమచారం, సాక్ష్యాలను ముందస్తుగా సేకరిస్తారు. హైకోర్టులో ప్రత్యేక బెంచ్ ద్వారా అనుమతి తీసుకొని నిందితులను అరెస్టు చేసి నేరుగా జైలుకు పంపిస్తారు. వారికి ఎలాంటి బెయిల్ మంజూరు కాదు. గతంలో కలప స్మగ్లర్లు, కరుడుగట్టిన నేరగాళ్లు, దోపిడీలు చేసే వారిపై దీనిని ప్రయోగిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొన్ని మార్పులతో ప్రస్తుతం చాలా మందిపై నమోదు చేస్తున్నారు. ఈ యాక్టుకు సంబంధించిన ఉత్తర్వులు నేరుగా పోలీసు కమిషనర్ జారీ చేస్తారు. శిక్ష అనుభవించి బయటకు వచ్చిన తర్వాత వారిపై నిరంతరం పోలీసుల నిఘా ఉంటుంది.

ఇతర రాష్ట్రాల వారిపై..

కాజీపేట, వరంగల్ రైల్వేస్టేషన్ల మీదుగా పలు రైళ్లు వివిధ రాష్ట్రాలకు వెళ్తుంటాయి. ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడకు వచ్చి నేరాలు చేసి సులువుగా తప్పించుకొని వెళ్లిపోతున్నారు. వీరిని నియంత్రించలేకపోతున్నారు. సీసీ కెమెరాలలో గుర్తించి పీడీ యాక్టు నమోదు చేస్తున్నారు. తమిళనాడు, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌కు చెందిన వారిపై కేసులు ఉన్నాయి.

నకిలీ విత్తనాలు విక్రయించిన వారిపై..

టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి

వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే వారిపై పీడీ యాక్టు నమోదు చేస్తాం. ప్రజల అస్తులకు ఇబ్బందులు కలిగిస్తూ ఆసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటున్నాం. గంజాయి సరఫరా చేస్తే వారిని కట్టడికి చేయడానికి ఈ యాక్టు ప్రయోగిస్తున్నాం.

# డ్రైవర్లకు శిక్షణ.. ప్రయాణికులకు భద్రత

మహబూబాబాద్ : ఆర్టీసీ.. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తోంది.. పథకాలతో ప్రజలకు చేరువ అవుతోంది. ఆదాయాన్ని పెంచుకోవడానికి అందివచ్చిన అవకాశాలను వినియోగించుకుంటోంది. ప్రత్యేక రాయితీలు కల్పిస్తూ అందరి మన్ననలు పొందుతోంది. వివాహాది శుభాకార్యాలకు బస్సులను అద్దెకు ఇచ్చే విధానాన్ని సులభతరం చేసింది. ఇటీవల ఒక్కో గ్రామానికి ఒక్కో బస్ అధికారిని నియమించింది. ఇలా వివిధ కార్యక్రమాలతో ముందుకు సాగుతోంది. తాజాగా ప్రమాదాల నివారణపై దృష్టి సారించింది. దీనికోసం డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ ఇస్తోంది.

తాజాగా డ్రైవర్లకు..ఇటీవల బస్సు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. డ్రైవర్లు సమర్థులైనప్పటికీ ఎదురుగా వచ్చే వాహనదారుల తప్పిదాలతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. ప్రమాద రహిత రీజియన్‌గా తీర్చిదిద్దాలని అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా డ్రైవర్లకు హనుమకొండ ములుగు రోడ్డులోని ఆర్టీసీ స్టాఫ్ జోనల్ శిక్షణ కళాశాలలో ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు. ఈ నెల 12న మొదలైంది. రోజుకు 100 మంది చొప్పున 20 రోజుల పాటు ఈ శిక్షణ కొనసాగనుంది. చెన్నై నుంచి చోలా ఎంఎస్ రిస్క్ సర్వీసెస్ సంస్థ ప్రతినిధులు వచ్చారు. డ్రైవర్లు విధి నిర్వహణలో ఒత్తిడిని ఎలా అధిగమించాలి, మానసికంగా, శారీరకంగా ఎలా మెదగాలో శిక్షణ ఇస్తున్నారు. వారిలో నైపుణ్యాన్ని మరింత మెరుగుపరుస్తున్నారు. పాటలతో కార్యోన్ముఖులను చేస్తున్నారు. వివిధ రకాల క్రీడా పద్ధతుల ద్వారా డ్రైవర్ల ఓర్పు, నైపుణ్యం, ప్రతిస్పందన, పరస్పర సమన్వయం, జ్ఞాపకశక్తిని పరీక్షిస్తున్నారు. ఆ తర్వాత తగిన సూచనలు ఇస్తున్నారు. బస్సులు నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎలాంటి ఆహారం తినాలి, రోడ్డు భద్రత నియమాలు, ఒళ్లు, నడుము నొప్పులు రాకుండా ఏమి చేయాలి, ఎలా కూర్చోవాలి అనే విషయాలపై అవగాహన కల్పిస్తున్నారు. నిత్యం చేయాల్సిన వ్యాయామంపై శిక్షణ ఇస్తున్నారు.

టీఏసీటీ పేరుతో విడతల వారిగా..

టీఏసీటీ (టీఎస్ ఆర్టీసీ ఏప్రిల్ ఛాలెంజ్ ఫర్ ట్రైనింగ్ ప్రోగ్రాం) పేరుతో డ్రైవర్లు, కండక్టర్లకు విడతల వారీగా ప్రత్యేక శిక్షణ ఇస్తోంది. బస్సులో కొంతమంది కండక్టర్లు తమ మాట తీరుతో ప్రయాణికులు నొచ్చుకునేలా ప్రవర్తిస్తున్నారు. గొడవలు జరిగిన సందర్భాలూ ఉన్నాయి. ఇలాంటి వారిలో మార్పు తీసుకురావాలని నిర్ణయించింది. నిట్, కేయూ ప్రొఫెసర్లు, వైద్య నిపుణులతో ప్రత్యేకంగా శిక్షణ ఇప్పించింది. ప్రయాణికులతో మర్యాదగా నడుచుకోవాలని సార్, మేడమ్ అంటూ సంబోధించాలని, వృద్ధులు, పిల్లలను ఆదరించాలని, లగేజీ ఎక్కువగా ఉన్న వారికి సహాయం చేయాలనే అంశాలపై నిపుణులతో నెల రోజుల పాటు శిక్షణ ఇచ్చారు.

ఎంతగానో ఉపయోగపడుతోంది–బి.దేవ్లా, తొర్రూరు డిపో

నిపుణులతో ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు. కొత్తగా ఉద్యోగంలో చేరినట్లు అనిపిస్తోంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వివిధ రకాల క్రీడా పద్ధతులతో మాలోని నైపుణ్యాలను తెలుసుకుంటున్నారు. ఒత్తిడిని తట్టుకొని శారీరకంగా, మానసికంగా ఎటువంటి ఆటుపోట్లు లేకుండా ఉండటానికి సూచనలు ఇస్తున్నారు. డ్రైవింగ్ సమయంలో ఎటువంటి పద్ధతులను పాటించాలనే అంశాలపై నూతన విధానంలో శిక్షణ ఇస్తున్నారు. ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది.

ఒత్తిడిని అధిగమించడానికి..

జె.శ్రీలత, ఆర్టీసీ ఆర్ఎం మా సంస్థలోని డ్రైవర్లను మరింత సమర్థులుగా తీర్చిదిద్దడానికి శిక్షణ ఎంతగానో దోహదపడుతుంది. విధి నిర్వహణలో ఒత్తిడిని అధిగమించాలి. శిక్షణతో పాటు ప్రమాదాల నివారణకు తగిన సూచనలు ఇస్తున్నారు. ఉన్నతాధికారుల సూచనలు ఎప్పటికప్పుడు పాటిస్తూ సంస్థను అభివృద్ధి పరుస్తూ ప్రయాణికుల ఆదరణను పొందడానికి కృషి చేస్తున్నాం. రీజయన్‌లోని డిపోలు – 9 మొత్తం బస్సులు 984 పనిచేసే కార్మికులు 4500 డ్రైవర్లు 2500

# ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణకు అడుగులు

కరీంనగర్ : విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించేందుకు హేతుబద్ధీకరణ వైపు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ నిర్ణయంతో ఎస్జీటీ పోస్టులకు కోత పడనుంది. ఇటీవల ఆ శాఖ ఉన్నతాధికారులు హైదరాబాద్‌లో జిల్లా విద్యాశాఖాధికారులతో సమావేశమై వివరాలు సేకరించారు. హేతుబద్ధీకరణతో టీచర్స్ రిక్రూట్‌మెంట్ టెస్ట్(టీఆర్టీ)లో భర్తీ చేసే ఉపాధ్యాయుల ఖాళీల సంఖ్య తేలనుంది. ఈ విధానంతో ఉన్న ఉపాధ్యాయులనే సర్దుబాటు చేయనుండడంతో ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎదురుచూస్తున్న అభ్యర్థుల ఆశలు గల్లంతయ్యే అవకాశముంది.

ఎస్జీటీ పోస్టులపై ప్రభావం..

జిల్లాలో ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ చేపడితే ప్రాథమిక పాఠశాలల్లోని ఎస్జీటీ పోస్టులపై ప్రభావాన్ని చూపనుంది. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండి ఉపాధ్యాయులు ఎక్కువగా ఉంటే ఇతర పాఠశాలలకు కేటాయిస్తారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో 6, 7 తరగతుల్లో విద్యార్థులు లేకున్నా ఉపాధ్యాయులున్నారు. ఇలాంటి పరిస్థితే జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో నెలకొంది. ప్రభుత్వం విడుదల



చేసిన జీవో 25 ప్రకారం హేతుబద్ధీకరణ ద్వారా విద్యార్థుల సంఖ్య ప్రకారం ఉపాధ్యాయులను నియమిస్తే చాలా ఎస్జీటీలు ఇతర పాఠశాలలకు వెళ్లే పరిస్థితి ఉంటుంది. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఒక్కో సబ్జెక్టుకు ఒక టీచర్ ఉండాలనే నిబంధనతో వాటిపై హేతుబద్ధీకరణ ప్రభావం పడదు.

నియామకాల్లో కోత

జిల్లాలోని ప్రాథమిక పాఠశాలల్లో ఎస్జీటీ పోస్టులు ప్రస్తుతం ఉన్న విద్యార్థుల సంఖ్య ప్రకారం మిగులుగా ఉండనున్నాయి. టీఆర్టీ ద్వారా ఆ పోస్టుల నియామకాల్లో కోత పడనుంది. జిల్లాలో మొత్తం 426 ప్రాథమిక, 76 ప్రాథమికోన్నత, 149 ఉన్నత పాఠశాలలున్నాయి. వాటిల్లో 3,124 మంది ఉపాధ్యాయులకుగాను ప్రస్తుతం 2,767 మంది పని చేస్తున్నారు. 2015లో ప్రభుత్వం హేతుబద్ధీకరణ చేపట్టింది.

ప్రాథమిక పాఠశాలల్లో అన్ని మాధ్యమాల స్థానిక సంస్థలు, ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్జీటీ పోస్టులు మొత్తం 1,207 ఉండగా 1,094 మంది పని చేస్తున్నారు.

విద్యార్థుల సంఖ్య ప్రకారం హేతుబద్ధీకరణ చేపడితే జిల్లాలోని స్థానిక సంస్థల తెలుగు మాధ్యమ ప్రాథమిక పాఠశాలల్లో నియామకాలకు ఎస్జీటీ పోస్టులు మిగలవని అధికారుల అంచనా. ఉర్దూ మాధ్యమ స్థానిక సంస్థల పాఠశాలలదీ ఇదే పరిస్థితి.

ప్రభుత్వ యాజమాన్యం పరిధిలోని తెలుగు, ఉర్దూ మాధ్యమ ప్రాథమిక పాఠశాలల్లో మాత్రం 29 ఎస్జీటీ పోస్టులు టీఆర్టీ నియామకాలకు ఖాళీగా ఉండే అవకాశముందని అధికారుల వివరాల్లో తేల్చినట్లు తెలిసింది.

జిల్లాలో హేతుబద్ధీకరణ జరిగితే స్థానిక సంస్థల తెలుగు మాధ్యమంలో 230 ఎస్జీటీ పోస్టులు మిగులుతాయని సమాచారం.

జిల్లాలో ఈ ప్రక్రియ ద్వారా భాషా పండితులు 13, పీఈటీలు 7, స్కూల్ అసిస్టెంట్ 26, ఎస్జీటీ 29 పోస్టులు టీఆర్టీ ద్వారా నియామకాలకు ఖాళీగా నిలవనున్నట్లు జిల్లా విద్యాశాఖ లెక్క తేల్చినట్లు సమాచారం.

జిల్లాలోని 426 ప్రాథమిక పాఠశాలల్లో 51 మందికిపైగా విద్యార్థుల సంఖ్య ఉన్నవి 93 ఉన్నాయి. మరో 30 పాఠశాలల్లో విద్యార్థులే లేరు. 10 మందిలోపు విద్యార్థులున్న పాఠశాలలు 43 ఉన్నాయి.

# పెరిగిన కోడిగుడ్డు వినియోగం

కరీంనగర్ : టమాటతోపాటు కూరగాయల ధరలు పెరిగాయి. వాటికి ప్రత్యామ్నాయంగా వారంలో రెండు, మూడు రోజులు ఉల్లిగడ్డ కోడిగుడ్డు కూర, గుడ్డు పులుసు, ఆమ్లేట్లతో భోజనం చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నట్లు తిరుమల్‌నగర్‌కు చెందిన రాజేశ్వరి పేర్కొన్నారు. పిల్లలు కూడా ఇష్టపడి తింటున్నారని తెలిపారు. కూరగాయలు ధరలు తగ్గాక వాటిని ఎక్కువ వినియోగిస్తామంటున్నారు. నాలుగు గుడ్లు, పావుకిలో ఉల్లి, కొత్తిమీర తదితరాలు కలిపి రూ.60 మించడం లేదు. ఆ మొత్తం చెల్లిస్తే అరకిలో టమాట రావడంలేదని గృహిణులు అంటున్నారు. వర్షాలతో ఆమ్లేట్, ఎగ్‌ఫ్రైడ్ రైస్, ఎగ్ చిల్లీ వంటివి చేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నామని కొందరు చెబుతున్నారు. ఓ వైపు కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. రూ.200 మార్కెట్‌కు తీసుకెళ్తే రెండు కూరగాయల కంటే ఎక్కువ రావడంలేదు. చాలా కుటుంబాలు ప్రత్యామ్నాయ మార్గాలు వెతుకుతూ.. కోడిగుడ్డు ఎంచుకుంటున్నాయి. వీటిని తింటే ఆరోగ్యానికి ఎంతో మంచిదనే కరోనా సమయంలో ప్రచారం పెరగడంతో శాఖాహారులు సైతం దృష్టి సారించారు. పెరగడానికి, ప్రోటీన్లు అందడానికి ఇవి ఉపయోగపడతాయి.

30 లక్షల వినియోగం

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 250 నుంచి 300 ఫౌల్ట్రీ ఫారాలు ఉండగా అందులో లేయర్ కోళ్లు కోటి వరకు ఉంటాయి. వీటి నుంచి నిత్యం 80 లక్షలకుపైగా గుడ్లు ఉత్పత్తి అవుతున్నాయి. జిల్లాలో 25 లక్షల వరకు అమ్ముతున్నట్లు వ్యాపార వర్గాలు తెలిపాయి. కూరగాయల ధరలు అమాంతం పెరగడం, ఇతర కారణాల నేపథ్యంలో జిల్లాలో రోజుకు 30 లక్షల గుడ్లు వినియోగిస్తున్నారు. మిగిలినవి నాగ్‌పూర్, ఉత్తర్‌ప్రదేశ్‌లాంటి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నట్లు జిల్లా ఫౌల్ట్రీ రైతుల సంఘం ప్రతినిధి వెంకటరమణారెడ్డి తెలిపారు. ధర కూడా తగ్గిందని వివరించారు.తగ్గుతున్న ధరమొన్నటివరకు రిటేల్‌లో ఆరు రూపాయలు విక్రయించారు. గత రెండు రోజులుగా రూ.5 చొప్పున విక్రయిస్తున్నా రు. నాడు హోల్‌సేల్ ధర రూ.4.45గా ఉంది. ప్రత్యేక విక్రయ కేంద్రాల్లో నాటు, గిరిరాజా కోళ్లకు సంబంధించి గుడ్లు కూడా విక్రయిస్తున్నారు. వీటి కోసం ప్రత్యేకంగా ఆర్డర్లు ఉంటాయి. ఒక్కో దాని ధర రూ.7కు పైగానే ఉంది. ఇటీవల వీటి వినియోగం బాగా పెరిగింది. ఇవి క్రీమ్ రంగులో ఉంటున్నాయి.రోజుకు 250 ట్రేలు విక్రయిస్తున్నా..ప్రతి రోజు సగటున 200 ట్రేలు విక్రయిస్తాం. గత వారం రోజుల నుంచి 250 అమ్ముతున్నాం. కూరగాయల ధరలు పెరగడంతో వీటి వైపు వస్తున్నారు.

# హద్దులు మార్చి అడ్డగోలు రిజిస్ట్రేషన్లు



కొత్తగూడెం : మడుపులు చెల్లిస్తే చాలు.. మార్కెట్ విలువ తగ్గిస్తారు.. నాలా చెల్లించకున్నా ఇళ్ల స్థలాలుగా మారుస్తారు. ఇదీ మధిర సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో జరుగుతున్న తంతు. కొందరు అధికారుల తీరుతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. గత ఏడాది అబ్కారీ కార్యాలయాన్ని ఓ ప్రయివేటు వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేసిన వ్యవహారాన్ని ప్రజలు మరిచిపోకముందే అధికారుల లీలలు ఒక్కొక్కటి వెలుగు చూస్తున్నాయి.

ప్రభుత్వ ధర తగ్గించి..

మధిర–విజయవాడ ప్రధాన రహదారిలో అంబేడ్కర్ సెంటర్ నుంచి మార్కెట్‌యార్డు వరకు రోడ్డుకు ఇరువైపులా కమర్షియల్ ప్లాట్లున్నాయి. వీటి ధర చదరపు గజానికి రూ.17,600లుగా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఏడాది జూన్ నెలలో ముగ్గురు వ్యక్తులు ఆర్అండ్‌బీ రోడ్డు పక్కనే కొంత స్థలాన్ని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్లు చేయించారు. ఇక్కడ దక్షిణం హద్దు ఆర్అండ్‌బీ రోడ్డు అని రాయకుండా మున్సిపాలిటీ రోడ్డు అని రాసి చదరపు గజం ధర రూ.5,800లుగా నిర్ణయించారు. మరో డాక్యుమెంట్‌లో ముగ్గురు వ్యక్తులతో పార్టీషన్ దస్తావేజు నమోదైంది. ఇందులోనూ హద్దులు మార్చి.. మార్కెట్ విలువకన్నా తగ్గించి రిజిస్ట్రేషన్ చేశారు.వేరొక డాక్యుమెంట్‌లో దక్షిణం ఆర్అండ్‌బీ రోడ్డు ఉండగా.. మున్సిపాలిటీ రోడ్డు అని హద్దులు మార్చి రూ.5800లుగా విలువ తగ్గించారు.

అంబేడ్కర్ సెంటర్‌లోనే ఒకరు 55 చదరపు గజాల స్థలాన్ని కొనుగోలు చేశారు. సదరు వ్యక్తి మాత్రం నిబంధనల ప్రకారం చదరపు గజానికి రూ.17,600 చొప్పున ఫీజు చెల్లించి మేలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు.

ఇన్‌ఛార్జుల పాలనలో..ఇక్కడ అయిదు నెలలుగా ఇన్‌ఛార్జి సబ్‌రిజిస్ట్రార్లు పనిచేస్తున్నారు. రెగ్యులర్ సబ్‌రిజిస్ట్రార్ దీర్ఘకాల సెలవులో ఉన్నారు. దీంతో జిల్లాలో వివిధ కార్యాలయాల్లో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్లను ఇన్‌ఛార్జులుగా నియమిస్తున్నారు. ఇప్పటి వరకు ముగ్గురు సీనియర్ అసిస్టెంట్‌లు ఇన్‌ఛార్జులుగా వ్యవహరించారు. ప్రభుత్వ నిబంధనలను తోసిరాజని అడ్డగోలుగా రిజిస్ట్రేషన్లు చేస్తుండటం 'మామూలు'గా మారింది. కొందరి హయాంలో అక్రమ రిజిస్ట్రేషన్ల కారణంగా రూ.లక్షలు చేతుల మారాయనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ వైనంపై స్థానికంగా బహిరంగంగానే విమర్శలు గుప్పుమంటున్నాయి. వ్యవసాయ భూములకు నాలా చెల్లించకుండానే అడ్డదారిలో పత్రాలు సృష్టించి గజాల్లో ప్లాట్లుగా రిజిస్ట్రేషన్ చేశారు. ఇందుకు గాను ఓ అధికారి రూ.లక్షల్లోనే ముడుపులు తీసుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. వారం రోజుల క్రితం ఓ అధికారి మధిర ప్రధాన వీధిలో ముగ్గురు అక్కాచెల్లెల్లకు సంబంధించిన ఆస్తిని సెటిల్‌మెంట్ దస్తావేజు చేసేందుకు రూ.38వేలు వసూలు చేశారు. ఈ విషయమై వీరిలో ఒకరు అధికారి వద్దకు వెళ్లి 'ఎందుకు ఎక్కువ డబ్బు తీసుకున్నారు. నన్ను మోసం చేశారంటూ' నిలదీయడం కొసమెరుపు.

నాలా చెల్లించకుండానే గజాల్లోకి మార్చి..

దిడుగుపాడు రెవెన్యూలో ఒకరు 5ఎకరాలకు పైగా భూమి కొనుగోలు చేశారు. అదే వ్యక్తి ఇదే రెవెన్యూలో మూడు ఎకరాలకు పైగా కొనుగోలు చేశారు. సదరు భూమికి ధరణిలో పాస్‌బుక్ రాలేదు. అయినా నాలా చెల్లించకుండానే అడ్డదారిలో జీపీ చేయించి ఇళ్ల ప్లాట్లుగా రిజిస్ట్రేషన్ చేశారు. ఇందుకుగాను ఆ అధికారికి దళారీ ద్వారా పెద్దమొత్తంలో ముడుపులు అందాయనే విమర్శలు గుప్పుమంటున్నాయి. ఇదే రీతిలో కొన్ని అనధికార వెంచర్లలో రిజిస్ట్రేషన్లు చేశారనే ఆరోపణలున్నాయి. నాలా చెల్లిస్తే ప్రభుత్వానికి పది శాతం ఆదాయం వచ్చేది.

ఆరోపణలపై ప్రస్తుత ఇన్‌ఛార్జి సబ్‌రిజిస్ట్రార్ వి.సతీశ్‌రెడ్డిని వివరణ కోరగా.. లింకు డాక్యుమెంట్లు ఉన్న భూములకే రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు చెప్పారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూస్తున్నామన్నారు. ఆరోపణలున్న డాక్యుమెంట్ల వివరాలు పరిశీలించి వివరణ ఇస్తామన్నారు.

# పునాదికి ముందే వసూళ్ల దందా!

కొత్తగూడెం : పురపాలకాల్లో ఇళ్ల నిర్మాణాల్లో పారదర్శకత ఉండాలని, దళారీ వ్యవస్థను నిర్మూలించాలని రాష్ట్ర ప్రభుత్వం 'టీఎస్‌బీపాస్' వ్యవస్థతో పాటు నూతన పురపాలక చట్టంలో పలు నిబంధనలు అమలులోకి తీసుకొచ్చింది. కానీ యజమానుల్లో అవగాహన లోపాన్ని, భయాన్ని ఆసరాగా చేసుకుని కొందరు దళారులు గతంలో మాదిరిగానే చేతివాటం ప్రదర్శిస్తుండటం గమనార్హం. వివరాల ఆన్‌లైన్, ప్లానింగ్, పురపాలక అనుమతి రుసుంకు అదనంగా వసూలు చేస్తున్నారు. ఏ పనికి ఎంత చెల్లించాలో తెలియని నిర్మాణదారులు దళారుల చెప్పినంత ముట్టజెప్పక తప్పడం లేదు. దీంతో చాలామంది అసలు కంటే రెండు, మూడు రెట్లు ఇంటి అనుమతికి ఖర్చు చేస్తూ మోసపోతున్నారు. ఈ విషయమై ఇప్పటికైనా పురపాలక అధికారులు పట్టణ ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

దరఖాస్తుదారులు ఏం చేయాలి?

పట్టణంలో ఇల్లు నిర్మించుకోవాలంటే యజమాని సంబంధిత పత్రాలతో పాటు, ప్లాన్ తయారు చేయించి టీఎస్‌బీపాస్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ దరఖాస్తు చేయాలి. అనంతరం టౌన్‌ప్లానింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో వివరాలు పరిశీలిస్తారు. ఇంటి కొలతల ఆధారంగా వారు నిర్ధారించిన రుసుమును ఆన్‌లైన్‌లో చెల్లించాలి. ఇంటి ప్లాన్ తీసే క్రమంలోనే యజమానులు దళారులను ఆశ్రయిస్తున్నారు. వారు ఒక్కో ప్లాన్‌కు కనీసం రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు వసూలు చేస్తున్నారు. టౌన్ ప్లానింగ్ నుంచి ఇబ్బంది లేకుండా చూస్తామని ఆన్‌లైన్, రుసుము చెల్లింపులూ వారే చూస్తున్నారు. పత్రాల ఆన్‌లైన్‌కు రూపాయి అవసరం లేకున్నా.. ఇష్టారాజ్యంగా వసూళ్లకు పాల్పడుతున్నారు.

అధికారులు ఏం చెబుతున్నారంటే..

భవన నిర్మాణ అనుమతులకు టీఎస్‌బీపాస్ ద్వారా సులభంగా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చు.



75 చదరపు గజాల విస్తీర్ణం వరకు ఏ అనుమతీ అవసరం లేదు. రూపాయి చెల్లిస్తే చాలు.5 నుంచి 239.20 చదరపు గజాల వరకు తక్షణ అనుమతి ఇస్తారు.239.20 నుంచి 598 చదరపు గజాల్లో గ్రౌండ్‌౦2 అంతస్తుల వరకు నిర్మాణ అనుమతికి స్వీయ ధ్రువీకరణ పత్రం ఆధారంగా అనుమతి లభిస్తుంది.98 చదరపు గజాలు మించి, గ్రౌండ్‌౦2 కన్నా ఎక్కువ అంతస్తులు నిర్మించాలనుకుంటే సింగిల్ విండో విధానం ద్వారా టీఎస్‌బీపాస్‌లో అనుమతిస్తారు.75 నుంచి 500 చదరపు గజాల వరకు ఎల్‌టీపీ అవసరం లేకుండా ప్లాన్ గీయించి ఆన్‌లైన్ తీసుకోవచ్చు.'ఇంటి నిర్మాణ దరఖాస్తుదారులు నేరుగా పురపాలకంలో సంప్రదించాలి. దళారులను నమ్మి ఆర్థికంగా నష్టపోవద్దు. ఆన్‌లైన్ వ్యవస్థపై కాస్త అవగాహన ఉన్నా స్వయంగా ప్లాన్ రూపొందించుకోవచ్చు. లేదా అనుభవం ఉన్నవారి సేవలు న్యాయమైన రుసుములతో వినియోగించుకోవచ్చు. అధిక మొత్తం వసూలు చేసేవారిపై ఎవరైనా ఫిర్యాదు చేయొచ్చు. చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.' అవినాశ్, పట్టణ ప్రణాళిక అధికారి, ఇల్లెందు

## అరకొర నిధులు.. అసంపూర్తిగా పల్లె దవాఖానాలు

బోయినపల్లి: పల్లె ప్రజలకు వైద్యం మరింత చేరువచేసేందుకు ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలను పల్లె దవాఖానాలుగా మార్చుతున్నారు. ఈ మేరకు పల్లె దవాఖానాలకు సొంత భవనాలు నిర్మించాలని నిర్ణయించారు. మండలంలో మూడు చోట్ల సొంత భవనాల నిర్మాణం చేపట్టారు. తలుపులు బిగించి రంగులు వేశారు. అయితే భవనాలు వినియోగంలోకి రావాలంటే మరిన్ని నిధులు అవసరం కానున్నాయి. దీంతో పనులు మధ్యలో ఆగిపోవడంతో ప్రజలకు అందుబాటులోకి తీసుకురాలేని పరిస్థితి నెలకొంది. బోయినపల్లి, కొదురుపాక, విలాసాగర్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ) ఉన్నాయి. బోయినపల్లి పీహెచ్‌సీ పరిధిలో బోయినపల్లి, తడగొండ, కోరెంలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలు, విలాసాగర్ పీహెచ్‌సీ పరిధిలో విలాసాగర్, వెంకట్రావుపల్లి ఉన్నాయి. కొదురుపాక పీహెచ్‌సీ పరిధిలో కొదురుపాక, వరదవెల్లిలో ఆరోగ్య ఉప కేంద్రాలున్నాయి. ఇందులో బోయినపల్లి, కొదురుపాక, వరదవెల్లి ఆరోగ్య ఉప కేంద్రాలను పల్లె దవాఖానాలుగా మార్చడంతోపాటు సొంత భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఒక్కో భవనం కోసం రూ.16 లక్షలు కేటాయించారు. ఈ నిధులతో భవన నిర్మాణం మెజార్టీ పనులు పూర్తయ్యాయి. రంగులు, ఫ్లోరింగ్, విద్యుత్తు, తలుపులు, ఇతర పనుల కోసం ఒక్కో భవనానికి రూ.5 లక్షలు కేటాయించాలని ప్రతిపాదనలు పంపగా బోయినపల్లి భవనానికి రూ.4 లక్షలు, కొదురుపాక, వరదవెల్లి భవన మిగులు పనులకు రూ.2 లక్షల చొప్పున కేటాయించారు. వీటితో భవనాలు, తలుపులకు రంగులు వేయడం వంటి పనులు చేపట్టారు. విద్యుత్తు, సీసీ ఫ్లోరింగ్, శౌచాలయం, ఇతర పనులు పూర్తి చేయడానికి ఒక్కో భవనానికి సుమారు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలు అవసరమవుతాయని అధికారులు భావిస్తున్నారు.

పూర్తయితే ...గ్రామాల్లో నిర్మిస్తున్న పల్లె దవాఖానాలు పూర్తయితే ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువకానున్నాయి. పల్లె దవాఖానాలో ఎంఎల్‌హెచ్‌పీలను (మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్) నియమించనున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుతున్న వైద్య సేవలు పల్లె దవాఖానాల్లో అందనున్నాయి. రోగులకు అత్యవసర చికిత్స అవసరమైతే ఎంఎల్‌హెచ్‌పీలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రిఫర్ చేస్తారు. అక్కడ వైద్యాధికారి వైద్య సేవలు అందిస్తారు. వైద్యాధికారి ఉన్న చోట ఎంఎల్‌హెచ్‌పీ ఉండరు.

మిగిలిన కేంద్రాలకు మంజూరైతే..బోయినపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తడగొండ, కోరెం, విలాసాగర్ పీహెచ్‌సీల పరిధిలోని విలాసాగర్, వెంకట్రావుపల్లి ఉప కేంద్రాలకు సొంత భవనాలు మంజూరు కాలేదు. స్థల సమస్య ఉండటంతో రెండో విడతలో ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం చెల్లిస్తున్న అద్దెకు గ్రామాల్లో అనువైన ఇళ్లు లభించడం లేదు. అరకొర సౌకర్యాల మధ్య సిబ్బంది కాలం గడుపుతున్నారు. సిబ్బందితోపాటు కేంద్రానికి వచ్చే రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉప కేంద్రాలకు భవనాలు మంజూరు చేస్తే వైద్య సేవలు చేరువయ్యే అవకాశం ఉంది.

పనులు పూర్తి చేసేందుకు చర్యలుమంజూరైన నిధులతో పల్లె దవాఖానాలకు సొంత భవనాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇంకొన్ని పనులు చేపట్టడానికి ఒక్కో భవనానికి మరో రూ.2 లక్షల వరకు నిధులు అవసరమవుతాయి.

# యువ గుండె పదిలం



ఖమ్మం : ఉరుకుల పరుగుల జీవితాల్లో చాలా మంది ఆరోగ్య సంరక్షణను నిర్లక్ష్యం చేస్తున్నారు. సమస్య బయటపడిన తర్వాతే ఆసుపత్రి గడప తొక్కుతున్నారు. ఆ లోపు పరిస్థితి విషమించడం, దవాఖానాకు చేరేలోపే అసువులుబాయడం సాధారణమైపోయింది. ఇటీవల కాలంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో యుక్త వయస్కులు ఎక్కువగా గుండెపోటుతో మరణిస్తుండటం ఆందోళనకరం. హృదయం లయ తప్పడంతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితుల్లోనూ నాలుగు పదుల లోపువారి శాతం ఎక్కువగా ఉంటోంది. ఆరోగ్యంపై అశ్రద్ధ వల్లే ఇలా జరుగుతోందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఆరోగ్యకర ఆహార అలవాట్లు ముఖ్యం

– డా.సీతారాం, కార్డియాలజిస్ట్, ఖమ్మం

మధుమేహం ఉన్నవారు తక్కువ మోతాదులో రోజుకు ఐదుసార్లు ఆహారం తీసుకోవాలి. లేనివారు మూడు సార్లు తినొచ్చు. రాత్రి భోజనం 9 గంటలలోపు మితంగా తీసుకోవాలి. చికెన్, చేపల కూరలు తినాలి. అయితే వేపుళ్లు ఎక్కువగా తినకూడదు. మటన్ తక్కువగా తినడం మేలు. యువత పిజ్జా, బర్గర్ వంటి బేకరీ పదార్థాలను అతిగా తీసుకోకూడదు. రోడ్ల వెంట చిరుతిళ్ల దుకాణాల్లో ఏదైనా తినేటప్పుడు ఆలోచించాలి. ఒకసారి వాడిన నూనెను చల్లార్చి మళ్లీ వినియోగిస్తే అందులో గుండెకు హాని కలిగించే కొవ్వు తయారవుతుంది. ఇవన్నీ పాటించకుంటే గుండెజబ్బులు, పక్షవాతం, కిడ్నీ సంబంధ వ్యాధులు సంక్రమించే ప్రమాదముంది. ఉప్పు తక్కువగా తీసుకోవడం, గడువు ముగిసిన పాత పచ్చళ్లు పక్కపెట్టడం, పళ్లు ఎక్కువగా తినడం, మద్యం తీసుకోకపోవడం ఆరోగ్యానికి మంచిది.

మేలుకోవాల్సిందే...

కొవిడ్ విజృంభణకు ముందు వంశపారంపర్యంగా, మానసిక ఒత్తిడి కారణంతో, లేదా మధుమేహం, రక్తపోటు, ధూమపానం, గంజాయి వంటి మత్తు పదర్థాలు వినియోగించే వారికి గుండె సంబంధ జబ్బులు సంక్రమించేవి. పోస్ట్ కొవిడ్ కారణంగా గుండెపోటు మరణాలు సంభవిస్తున్నట్లు వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వైరస్ సోకి కోలుకున్న వారికి అనంతర కాలంలో రక్తం గడ్డ కట్టే గుణం ఎక్కువగా పెరుగుతోందని చెబుతున్నారు. ముందస్తు పరీక్షలతో పొంచిఉన్న ముప్పును పసిగట్టవచ్చు. అమ్మ, నాన్న, చిన్నమ్మ, చిన్నాన్న, మామలో ఎవరికైనా గుండెపోటు వస్తే.. ఆ కుటుంబంలో 18 ఏళ్లు నిండినవారు బీపీ, షుగర్, కొలెస్ట్రాల్, పొప్రోటీన్–ఎ, హెూమో–16 వంటి పరీక్షలు ముందస్తు జాగ్రత్తగా చేయించుకోవాలి. దీంతో నిమిత్తం లేకుండా ముప్పై వయసు పైబడిన వారు ఆరోగ్య పరీక్షలు చేయించుకుని రుగ్మతలను నిర్ధారించుకోవడం మేలు.

కొవిడ్ వైరస్‌తో వెంటిలేటర్ చికిత్స తీసుకున్నవారు, చికిత్సలో స్టెరాయిడ్స్ ఎక్కువ వాడిన వారికి బీపీ, షుగర్ వచ్చే ప్రమాదముంది. ఇలాంటి వారూ క్రమం తప్పకుండా వైద్యులను సంప్రదించాలి.

వాకింగ్, జాగింగ్, సైక్లింగ్, రన్నింగ్‌లలో ఏదో ఒక్కటి వ్యాపకంగా మార్చుకోవడం గుండెను కాపాడుతుంది. అరగంట వ్యాయామం, ధ్యానం మానసిక ఒత్తిడిని దూరం చేసి ప్రశాంతతను కలిగిస్తుంది.జిమ్ అలవాటున్న వారు అతిగా బరువులు ఎత్తడం వంటివి చేసినప్పుడు ఛాతీలో ఇబ్బందికరంగా ఉన్నట్లు నిపిస్తుంది. వారు వెంటనే కార్డియాలజిస్టును సంప్రదించాలి.ఫిట్‌నెస్ శిక్షకుడు, లేదా వైద్యుల పర్యవేక్షణలో ఉండటం మేలు.

# డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు తగ్గుముఖం

కొత్తగూడెం : ఇంటర్మీడియట్ పూర్తిచేసిన విద్యార్థులు ప్రధానంగా డిగ్రీ కోర్సులనే ఎంపిక చేసుకునేవారు. విద్యార్థులే నేరుగా కోర్సులు ఎంపిక చేసుకునేందుకు ప్రభుత్వం 'డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ'(దోస్త్) వెబ్‌సైట్ ద్వారా అవకాశం కల్పిస్తోంది. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి మే 16న మొదటి దశ దరఖాస్తుల స్వీకరణ చేపట్టారు. ఈ నెల 20వ తేదీ వరకు మూడు దశల్లో సీట్ల భర్తీ ప్రక్రియ కొనసాగింది. ఖమ్మం ఎస్ఆర్అండ్‌బీ జీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మినహా ఇతర కళాశాలల్లో ఎక్కడా అనుకున్న స్థాయిలో ప్రవేశాలు జరగలేదు. ఉభయ జిల్లాలో పది ప్రభుత్వ డిగ్రీ కళాశాలున్నాయి. ఆయా కళాశాలల్లో 5,280కి గాను 2,624 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. ఖమ్మం ఎస్ఆర్ బీజీఎన్నార్‌లో 1,560కి 1,410, ఖమ్మం డిగ్రీ మహిళా కళాశాలలో 480కి 230, నేలకొండపల్లి డిగ్రీ కళాశాలలో 300కి 65, సత్తుపల్లి జలగం వెంగళరావు కళాశాలలో 480కి 105, మధిర డిగ్రీ కళాశాలలో 180కి 66 సీట్లు భర్తీ అయ్యాయి. చివరి అవకాశంగా ఆగస్టు 1 నుంచి 10వ తేదీ వరకు స్పెషల్ ఫేజ్ నిర్వహించడానికి అధికారులు



కార్యాచరణ రూపొందించారు.

చూపు.. నగరాల వైపు: ఇంటర్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు హైదరాబాద్, ఇతర నగరాల్లోని కళాశాలల్లో చేరేందుకు సుముఖత చూపుతున్నారు. ప్రత్యేక వసతి, వృత్తివిద్య బోధన మెరుగ్గా ఉండటమే ఇందుక్కారణం. మారుమూల ప్రాంతాల్లోని విద్యార్థులు సైతం సమీప ప్రభుత్వ డిగ్రీ, ప్రైవేటు కళాశాలల్లో చేరేందుకు అనాసక్తి కనబర్చుతున్నారు. స్థానికంగా చదవాలనుకునే వారిలో అత్యధికులు గురుకులాల వైపు మొగ్గుచూపుతున్నారు. ఎంపీసీ, బైపీసీ కోర్సులు చదివిన విద్యార్థులు ఇంజినీరింగ్, నర్సింగ్, ఫార్మసీ కోర్సులు చదివేందుకు ఆసక్తి చూపుతున్నారు.

# ఆదాయ ఫలం.. ఉపాధి ఊతం

ములుగు : అన్నదాతలకు ఆర్థిక ప్రయోజనం చేకూర్చేందుకు ప్రభుత్వం సంకల్పించింది. పంట పొలాల్లో పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తోంది. అదనపు ఆదాయ ఫలం చేతికందేలా రాయితీపై ఉపాధి పథకం కింద నిధులు కేటాయిస్తోంది. సన్న, చిన్నకారు, దళిత, గిరిజన రైతులకు మరింత వెన్నుదన్నుగా నిలిచేందుకు మొక్కలు, నిర్వహణ ఖర్చులు, ఎరువులు అందిస్తోంది. ఆసక్తి, అర్హులైన రైతులకు బిందు సేద్యం పరికరాలతో చేయూతనిస్తోంది. జిల్లాలో పండ్ల తోటల సాగును ప్రోత్సహించేలా లక్ష్యాన్ని నిర్దేశించి డీఆర్‌డీఏ, ఉద్యానవన, వ్యవసాయశాఖలు సమన్వయంతో పని చేసేలా దిశానిర్దేశం చేసింది. వ్యవసాయమే జీవనాధారమైన జిల్లాలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను 954 ఎకరాల్లో పండ్ల తోటలను పెంచాలని అధికారులు లక్ష్యం పెట్టుకున్నారు. వరి, మిర్చి, పత్తి, అపరాల పంటల సాగుతో వ్యయ భారాలకు గురవుతున్న కర్షకులకు అదనపు ఆదాయ ఫలాలను అందించాలని, పండ్ల తోటల పెంపకం దిశగా అడుగులు వేయించేందుకు కసరత్తు చేపట్టారు. ఈ ప్రాంతంలో ఉద్యాన పంటల



సాగు ఆశించిన స్థాయిలో చేపట్టకపోవడం, పూర్వపు సాగు గణాంకాలను క్రోడీకరిస్తూ అన్నదాతల ఆసక్తి, ఈ ప్రాంత నేలల స్వభావాన్ని ఆధారంగా పండ్ల తోటల సాగుకు ఎంపిక చేపట్టారు. రైతుల ఆసక్తి మేరకు సాగు లక్ష్యం పెరగనుంది.

నాలుగేళ్ల పాటు నిర్వహణ నిధులు

పండ్ల మొక్కల నిర్వహణకు ఉపాధిహామీ నిధులు వెచ్చించనున్నారు. గుంతలు తీయడం, మొక్కలు నాటడం వంటి పనులు కూలీలతో చేయిస్తారు. మొక్కలకు గాను మామిడికి రూ. 30, నిమ్మ రూ.25, నారింజ రూ.44, జామ రూ.31, సీతాఫలం రూ.26, సపోట రూ.27, మునగ రూ.15, కొబ్బరి రూ.26, దానిమ్మ రూ.24లను మొక్కకు చెల్లించనున్నారు. ఎరువులకు గాను ఒక్కో మొక్కకు రూ.50, నిర్వహణ ఖర్చు కింద ప్రతి నెల మొక్కకు రూ.10 చొప్పున మంజూరు చేయనున్నారు. మొక్కలు నాటిన ఏడాది నుంచి నాలుగేళ్ల పాటు నిర్వహణ ఖర్చులను ప్రభుత్వమే భరించనుంది. పెంపకం ఆధారంగా ఒక్కో ఎకరానికి రూ.లక్ష నుంచి రూ.మూడు లక్షలు మంజూరు చేయనుంది.

ఐదు ఎకరాల లోపు రైతులు అర్హులు

రాయితీ పండ్ల తోటల పెంపకానికి గరిష్ఠంగా ఐదు ఎకరాల లోపు సన్న, చిన్న కారు రైతులు అర్హులు. ఆ రైతు ఉపాధిహామీ జాబ్‌కార్డు పొంది, పట్టాదారు పాసుపుస్తకం కలిగి ఉండాలి. నీటి సదుపాయం ఉన్న వారికి ప్రాధాన్యం. ఈ సారి కొత్తగా రాయితీపై బిందు సేద్యం పరికరాలను అందించనున్నారు. ఎస్సీ, ఎస్టీలకు వందశాతం, ఇతర సామాజిక వర్గాలకు 90 శాతం రాయితీపై పరికరాలు పంపిణీ చేస్తారు.

10 రకాలకు అనుమతి

రాష్ట్ర వ్యాప్తంగా 13 రకాల పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం ప్రణాళిక చేసింది. ములుగు జిల్లాలో నేల స్వభావాన్ని బట్టి 10 రకాల పండ్ల మొక్కల పెంపకానికి అనుమతి ఇచ్చింది. మామిడి, నిమ్మ, నారింజ, జామ, సీతాఫలం, సపోట, మునగ, డ్రాగన్, దానిమ్మ, కొబ్బరి రకాల పంటలు సాగు చేయాలని నిర్ణయించారు. యాపిల్‌బేర్, అల్లనేరేడు, జీడిపప్పు సాగును మినహాయించారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలంలోనూ గరిష్ఠంగా వంద ఎకరాల్లో సేద్యం చేసేలా రైతులను సంసిద్ధం చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఆయా శాఖల ద్వారా క్షేత్రస్థాయిలో చైతన్యం కలిగిస్తున్నారు.

చక్కటి అవకాశం–కె.నాగపద్మజ, డీఆర్‌డీవో, ములుగు

చిన్న, సన్నకారు రైతులు పొలాల్లో పండ్ల మొక్కలు పెంచుకునేందుకు చక్కటి అవకాశం కల్పించింది. అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకుని అదనపు ఆదాయ ఫలాలు పొందాలి. లబ్ధిదారుల గుర్తింపునకు క్షేత్రస్థాయిలో కార్యాచరణ చేపట్టాం. ఆసక్తి ఉన్న రైతులు మండల పరిషత్ కార్యాలయాల్లో ఉపాధిహామీ జాబ్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం నకలు కాపీలతో దరఖాస్తులు ఈ నెలాఖరులోగా సమర్పించాలి. ఆగస్టు 15 నాటికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నాం. అదే నెలాఖరు వరకు మొక్కలు నాటడం, బిందు సేద్యం పరికరాలు బిగింపు పనులు పూర్తి చేయనున్నాం.

## వానలు సమృద్ధి.. సాగు వృద్ధి

వరంగల్ : వర్షపాతం లోటు ఉమ్మడి జిల్లా ప్రజలు, రైతులు ఇబ్బందులు పడ్డారు. ఎట్టకేలకు అల్పపీడన ప్రభావంతో విస్తారంగా కురిసిన వానలతో ఉమ్మడి జిల్లా లోటు వర్షపాతాన్ని అధిగమించింది. వరంగల్, జనగామ జిల్లాల్లో అధికంగా కురవగా మహబూబాబాద్, హనుమకొండ, ములుగు, భూపాలపల్లి జిల్లాలో సాధారణ వర్షపాతం నమోదైంది. నాలుగు జిల్లాల్లోని అన్ని మండలాల్లో సాధారణం మించి కురవగా..హనుమకొండ జిల్లా నడికూడ, మహబూబాబాద్ జిల్లా సీరోలు, నర్సింహులపేట, బయ్యారం మండలాల్లో ఇంకా లోటు కనిపిస్తోంది. ఈ రెండు, మూడు రోజుల్లో వర్షం పడితే అన్ని చోట్లా లోటు తీరుతుంది. ప్రస్తుత వానలతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న నీటి వనరుల్లోకి వరద చేరుతోంది. చెరువులు, కుంటలు మత్తళ్లు పోస్తున్నాయి. కొన్ని చోట్ల చిన్న నీటి వనరుల్లోకి ఇంకా నీళ్లు రాని పరిస్థితి ఉంది.సాగు పనులు ముమ్మరం: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు సుమారు 71,700 ఎకరాల విస్తీర్ణంలో వరి నాట్లు వేశారు. వాస్తవానికి సన్నరకాల సాగుకు సమయం అయిపోయింది. మధ్యకాలిక వరినార్లు పోసుకునే సమయం కూడా దాటింది. ఇక స్వల్పకాలిక రకాలను సాగు చేసుకునే అవకాశం మాత్రమే ఉంది. మధ్యకాలిక రకాలను సాగుచేయాలనుకునే రైతులు డ్రమ్‌సీడర్, వెదజల్లే పద్ధతిలో సాగుచేసుకోవచ్చని అధికారులు తెలిపారు. ప్రస్తుత వానలు నాట్లకు అనుకూలంగా ఉండడంతో కర్షకులు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. వచ్చే నెల వరకు ఉమ్మడి జిల్లాలో ఎంత విస్తీర్ణంలో సాగవుతుందో ఒక లెక్కకు రానుంది. పత్తి 4,56,342 ఎకరాల్లో సాగవుతుండగా ఈ వర్షాలు జీవం పోశాయి. మంచి అదను కావడంతో రైతులు అడుగు మందుకేస్తున్నారు. కొందరూ కలుపు మొక్కలను తొలగిస్తున్నారు. 35,206 ఎకరాల్లో మొక్కజొన్న, 3245 ఎకరాల్లో కంది సాగవుతోంది. కొద్ది రోజుల్లోనే మిర్చి నాట్లు వేసేందుకు అన్నదాతలు దుక్కులను సిద్ధం చేసుకుంటున్నారు.

## ఇలాగైతే సేవలు అందేదెలా!

మంథని : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు భరోసా కల్పించేందుకు ప్రభుత్వం ఇంటి అద్దె భత్యం విధానాన్ని అమలు చేస్తోంది. సంఘాల లావాదేవీల ఆధారంగా పాలకవర్గాల ఛైర్మన్లకు గౌరవ వేతనం ఇవ్వడంతో పాటు సిబ్బందిని కేటాయిస్తోంది. ఈ క్రమంలో వారం రోజుల కిందట ప్రభుత్వం వెల్లడించిన స్థాయి వర్గీకరణలో మంథని సహకార సంఘానికి అన్యాయం జరిగిందని పాలకవర్గం, సిబ్బంది నుంచి ఆవేదన వ్యక్తమవుతోంది. తాజాగా మంథని సంఘానికి బీ గ్రేడ్ కేటాయించారు. జిల్లాలోనే అతి పెద్ద సంఘమైన మంథని ప్యాక్స్‌కు బీ గ్రేడ్ ఇచ్చి, చిన్న సంఘాలైన సుల్తానాబాద్, చిన్నకల్వల సంఘాలకు ఏ ప్లస్ కేటాయించారని సిబ్బంది వాపోతున్నారు. గ్రేడ్ తగ్గడంతో పాలకవర్గానికి గౌరవ వేతనం తగ్గడంతో పాటు తక్కువ మంది ఉద్యోగులతో ఇబ్బందులు ఎదురవుతాయని అభిప్రాయపడుతున్నారు. నియోజకవర్గ కేంద్రంతో పాటు మున్సిపాలిటీగా ఉన్న మంథనిలోని సంఘం పరిధిలో 34 గ్రామ పంచాయతీలున్నాయి. ఏడాదికి రూ.135 కోట్ల లావాదేవీలు జరుగుతున్న సంఘానికి బీ గ్రేడ్ కేటాయించడం సరికాదన్న అభిప్రాయం వ్యక్తమ



వుతోంది. ప్రస్తుతం మంథని సంఘంలో 12 మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తుండగా, బీ గ్రేడ్ ప్రకారం అయిదుగురు మాత్రమే పని చేయాల్సి ఉంటుంది. ధాన్యం కొనుగోళ్లలో ఉమ్మడి జిల్లాలోనే మొదటి స్థానంలో నిలుస్తున్న మంథని సంఘానికి బీ గ్రేడ్ ఇవ్వడం అన్యాయమని, ఉన్నతాధికారులు పునః పరిశీలించి ఏ ప్లస్ కేటాయించాలని సంఘం ఛైర్మన్ కొత్త శ్రీనివాస్ కోరారు.

వ్యాపార లావాదేవీల ప్రకారమే..సంఘం వ్యాపార లావాదేవీలను బట్టే స్థాయి వర్గీకరణ ఉంటుంది. సంఘం ద్వారా ఇచ్చిన రుణాల రికవరీ, ఇతర వ్యాపార లావాదేవీలను దృష్టిలో ఉంచుకొని నిర్ణయిస్తారు. సుల్తానాబాద్ సంఘం నీటి శుద్ధి కేంద్రం, సూపర్ మార్కెట్, విత్తనశుద్ధి, రుణాలు రికవరీలో మెరుగ్గా ఉండటం వల్లే ఏ గ్రేడ్ ఇచ్చాం. మంథని సంఘం కేవలం ధాన్యం కొనుగోలులోనే ముందుంది. మిగతా వ్యాపార లావాదేవీల్లో రాణిస్తే ఏ గ్రేడ్ లభిస్తుంది.

మైఖేల్‌బోస్, జిల్లా సహకార అధికారి

## కంటికి వెలుగు

కరీంనగర్ : రెండోవిడత కంటి వెలుగు కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే అవసరమైన అధికారులు, ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమాలను చేపట్టింది. గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు ప్రజాప్రతిని ధులందరిని భాగస్వాములు చేసేందుకు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నారు. కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో జరిగే ఈ సమావేశానికి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, జడ్పీ ఛైర్ పర్సన్‌తో పాటు జడ్పీటీసీలు, ఎంపీపీ, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొనేలా ఆహ్వానం పంపించారు. ఈ సమావేశంలో కంటి వెలుగు కార్యక్రమంలో చేపట్టేందుకు తీసుకునే కార్యచరణను రూపొందించారు.

100 రోజుల పాటు శిబిరాలు

ఈ నెల 18 నుంచి ప్రారంభించే కంటి వెలుగు కార్యక్రమాన్ని వంద రోజుల పనిదినాలలో శిబిరాలు ఏర్పాటు చేస్తారు. శని, ఆదివారాలు మినహా మిగిలిన రోజులలో జిల్లావ్యాప్తంగా పరీక్షలు చేస్తారు. ఏ రోజు ఏ ప్రాంతంలో శిబిరాలు ఏర్పాటు చేస్తారనే విషయాన్ని ముందస్తుగా ప్రజలకు సమాచారం అందజేస్తారు. దగ్గరి చూపు, దూరం చూపు అవసరాలను బట్టీ కళ్లజోళ్లను పంపిణీ చేస్తారు. అత్యవసరమనే వారికి శస్త్ర చికిత్సలకు సిఫారసు చేస్తారు. 18 ఏళ్లు పైబడిన వారికి



పరీక్షలు చేయనున్నారు. చిన్న పిల్లలకు రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం ద్వారా పాఠశాలలో కొనసాగిస్తున్నారు.

50 బృందాలుకంటి పరీక్షలు నిర్వహించడానికి సుమారు 50 బృందాలు సిద్ధం చేస్తున్నారు. 48 వరకు గ్రామాలు, పట్టణాల్లో ఉంటారు. రెండు, మూడు బృందాలు అత్యవసరం కింద ఉండనున్నాయి. ఈ బృందంలో ఒక వైద్యుడు, కంటి పరీక్షలు చేపట్టే ఆప్తామెటిస్ట్, డేటా ఆపరేటర్, ఒక సూపర్‌వైజర్, ఇద్దరు ఎఎన్‌ఎంలు, ముగ్గురు ఆశా వర్కర్లు ఉంటారు.

ఒప్పంద పద్ధతిలో..

కంటి పరీక్షలు నిర్వహించేందుకు ఆరు నెలల కోసం కాంట్రాక్ట్ పద్ధతిపై 48 మంది ఆప్తామెటిస్ట్‌లను నియమించారు. ఇదివరకు నలుగురు పూర్తిస్థాయిలో ఉన్నారు. వీరితో పాటు కంటి పరీక్షల మిషన్లు తెప్పిస్తున్నారు. కొత్తగా 27 కొనుగోలు చేశారు. ఇవే కాకుండా సామగ్రి సమకూర్చుతున్నారు. దీని కోసం ప్రత్యేకాధికారిని కూడా నియమించనున్నారు. మొదటి విడతలో సుమారు ఆరు లక్షల మందికి పరీక్షలు నిర్వహించారు. మిగతా వారందరికీ రెండో విడతలో పరీక్షలు నిర్వహిస్తామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జువేరియా తెలిపారు. వార్డు, డివిజన్, గ్రామస్థాయి ప్రజాప్రతినిధులందరినీ భాగస్వాములు చేస్తామని వివరించారు. సెలవు రోజులలో పరీక్షలు నిర్వహించరని, జూన్ 15 వరకు శిబిరాలు ఉంటాయని తెలిపారు.

# కార్మిక క్షేత్రం.. వైద్య విద్యకు కేంద్రం




గోదావరిఖని : సింగరేణి సహకారంతో గోదావరిఖనిలో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటుతో రామగుండం పారిశ్రామిక ప్రాంతం మెడికల్ హబ్‌గా నిలవనుంది. వివిధ కారణాలతో కొత్తగా ఏర్పాటు చేసిన వైద్య కళాశాలలకంటే ఆలస్యంగా నిర్మాణం పనులు ప్రారంభమైనప్పటికీ వాటితో సమానంగా కళాశాల ప్రధాన భవన నిర్మాణాన్ని పూర్తి చేయడంలో అధికారులు, గుత్తేదారులు ప్రత్యేక శ్రద్ధ వహించారు. నల్ల బంగారానికి నిలయమైన కార్మిక క్షేత్రంలో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటునకు సింగరేణి యాజమాన్యం అందించిన సంపూర్ణ సహకారం ఈ ప్రాంత ప్రాధాన్యతను పెంచింది. వైద్య కళాశాలతో పాటు విద్యార్థుల వసతి గృహాలు, ప్రిన్సిపల్, ఆచార్యుల క్వార్టర్ల కోసం సుమారు 21 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వానికి అప్పగించిన సింగరేణి యాజమాన్యం భవన నిర్మాణం కోసం రూ.510 కోట్లు కేటాయించింది. దీంతో భవనాల నిర్మాణం పనులు చురుగ్గా సాగుతున్నాయి.

తాత్కాలిక భవనంలోకి అడుగు పెట్టకుండానే...

వివిధ కారణాలతో కళాశాల భవన నిర్మాణం పనుల్లో జాప్యం జరిగే అవకాశముందని భావించిన ప్రభుత్వం తాత్కాలిక ఏర్పాట్లు చేపట్టింది. గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తాత్కాలికంగా తరగతులు, ప్రయోగశాలలు నిర్వహించుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకున్నప్పటికీ నిర్ణీత వ్యవధిలోగా కళాశాల ప్రధాన భవన నిర్మాణం కావడంతో నేరుగా నూతన భవనంలోనే మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభించారు. వైద్య కళాశాల ఏర్పాటునకు స్థలం, నిధులు కేటాయించిన సింగరేణి యాజమాన్యం అనుబంధ ఆసుపత్రి పడకలు సరిపోకపోవడంతో సింగరేణి ఆసుపత్రిని సైతం వైద్య కళాశాలకు బోధనాసుపత్రిగా నిర్వహించేందుకు అనుమతి ఇచ్చారు. విద్యార్థినీ విద్యార్థుల వసతి కోసం సింగరేణి యాజమాన్యం భవనాలను కేటాయించింది. ప్రస్తుతం ఆయా భవనాల్లోనే వసతి గృహాలు కొనసాగుతుండగా సొంత భవన నిర్మాణాలు సైతం చురుగ్గా సాగుతున్నాయి. ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరం నుంచి మొదలుకొని నాలుగో సంవత్సరం వరకు పూర్తి స్థాయిలో తరగతులు, ప్రయోగశాలలు, సెమినార్ల నిర్వహణ కోసం మూడు బ్లాకులు నిర్మించాల్సి ఉండగా రెండు బ్లాకుల నిర్మాణాలు పూర్తయి వినియోగంలోకి వచ్చాయి. మరో బ్లాకు నిర్మాణం సాగుతోంది. కళాశాల నిర్వహణలో కీలకమైన ప్రిన్సిపల్‌తో పాటు ఆచార్యులు, సహ ఆచార్యుల నియామకాలు ఏడాది క్రితమే పూర్తి కాగా మొదటి సంవత్సరంలో 150 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పించారు.వేర్వేరుగా వసతి కళాశాల ప్రధాన భవనంలోని ఒక బ్లాకుతో పాటు విద్యార్థినీ, విద్యార్థులకు వేర్వేరుగా వసతి గృహాలు, డైనింగ్ హాల్, ప్రిన్సిపల్ క్వార్టరు, అతిథి గృహం, 70 మంది సిబ్బందికి క్వార్టర్ల నిర్మాణం పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఐదారు నెలల్లో కొన్ని భవనాలు వినియోగంలోకి వచ్చే అవకాశం ఉంది. ఒక్కో అంతస్తులో మూడు పడకగదుల క్వార్టర్లు మూడు, రెండు పడక గదుల క్వార్టర్లు నాలుగు చొప్పున మొత్తం ఏడు క్వార్టర్లతో పది అంతస్తుల్లో నిర్మాణాలు చేపడుతున్నారు. ఎంబీబీఎస్ విద్యార్థులతో పాటు పీజీ కోర్సుల్లో చేరే వారి కోసం ప్రత్యేకంగా వసతి గృహాల నిర్మాణం చేపడుతున్నారు. వైద్య విద్యార్థినుల నివాసం కోసం ఏడు అంతస్తులతో, రెసిడెన్షియల్ కోసం మరో నాలుగు అంతస్తులతో భవన నిర్మాణాలు సాగుతున్నాయి. విద్యార్థుల నివాసం కోసం నాలుగు అంతస్తులతో, రెసిడెన్షియల్ కోసం రెండు అంతస్తులతో నిర్మాణాలు సాగుతున్నాయి. ప్రిన్సిపల్ నివాసంతో పాటు అతిథి గృహం నిమిత్తం రెండంతస్తుల భవన నిర్మాణం చేపడుతున్నారు. ఆయా నిర్మాణాలు పూర్తియితే మెరుగైన సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి.

# స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరిసిన జగిత్యాల



జగిత్యాల : పరిశుభ్ర గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వ నిర్వహిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జగిత్యాల జిల్లా మెరిసింది. భారత్ మిషన్ గ్రామీణ్(స్వచ్ఛ సర్వేక్షణ్) కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం పల్లె ప్రగతి పేరుతో కార్యక్రమాన్ని కొనసాగిస్తుంది. ఫలితంగా దేశవ్యాప్తంగా 709 జిల్లాల్లో త్రీస్టార్ విభాగంలో జగిత్యాల జిల్లా రెండో స్థానంలో నిలిచింది. గ్రామీణ ప్రాంతాలను ప్రోత్సహించేందుకు కేంద్రం స్వచ్ఛ భారత్ ర్యాంకులను ప్రకటిస్తుండగా జిల్లా ర్యాంకు సాధించింది. ప్రస్తుతం జిల్లాలోని 380 పంచాయతీ పరిధిలోని 495 గ్రామాల్లో శతశాతం మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టి వినియోగించుకోవడం, తడి, పొడి చెత్త వేరు చేసి కంపోస్టు షెడ్లలో ఎరువుల తయారీ, ఇంకుడు గుంతల నిర్మాణాలు, తదితర అంశాలను ప్రామాణికంగా తీసుకుని త్రీస్టార్ విభాగంలో ఎంపిక చేశారు.

గ్రామాల్లో సమగ్ర అధ్యయనం

గతేడాది ఎంపిక చేసిన ఆదర్శ గ్రామాల్లో సమగ్ర అధ్యయనం చేసేందుకు ఓడీఎఫ్ ప్లస్ కింద మండలాల వారీగా ప్రత్యేక బృందాలను నియమించి సర్వే చేపట్టారు. జిల్లాలోని 18 మండలాల్లో 122 గ్రామాలను ఎంపిక చేసి, ఆయా గ్రామాల్లోని 50,970 నివాసాల్లోని కుటుంబాల నుంచి వివరాలు సేకరించారు. ఆయా వివరాలను ప్రత్యేక పోర్టల్‌లో నివేదించారు. దీని ద్వారా దేశవ్యాప్తంగా ప్రత్యేక బృందాలు జిల్లాల వారీగా ప్రతీ పంచాయతీ పరిధిలో బహిరంగ మలమూత్ర విసర్జన రహిత గ్రామంతోపాటు ఇంకుడు గుంతలు, వాటిని వినియోగించడంతోపాటు చెత్త సేకరణ, వ్యర్థాల నిర్వహణ, నిర్దేశించే విధంగా ఉన్నాయన్న దానిపై పరిశీలించారు. ప్రతి ఇంటికి మరుగు దొడ్డితోపాటు ఇంకుడు గుంత ఉన్న వాటిని గతంలో ఓడీఎఫ్ ప్లస్ ఆదర్శ గ్రామాలుగా ఎంపిక చేయగా ఆయా గ్రామాల్లో పరిస్థితిపై కేంద్ర బృందం సభ్యులు అధ్యయనం చేయడంతో త్రీస్టార్ లభించింది.

మరింత మెరుగుపడితేనే..

ఎంపిక చేసిన గ్రామాలు కాకుండా ప్రతి పల్లెలో రూ.లక్షలతో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లు(కంపోస్టు) వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరముంది. గతంలో ప్రభుత్వం వర్షాభావ పరిస్థితులు ఏర్పడిన సమయంలో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ఇంటింటా ఇంకుడుగుంత తప్పని సరిచేసింది. ఇటీవల వాటిపై శ్రద్ధ చూపక పోవడం, గతంలో నిర్మించుకున్న వారికి బిల్లులు చెల్లించకపోవడంతో నిర్లక్ష్యం వహిస్తున్నారు. అలా కాకుండా ప్రతి ఇంట ఇంకుడుగుంత నిర్మించుకునేలా ప్రోత్సహించాలి. నూతనంగా ఇళ్లు నిర్మించుకున్న వారికి మరుగుదొడ్డి ఉండేలా ప్రత్యేకంగా మంజూరు అవకాశం కల్పిస్తే పరిశుభ్ర గ్రామాలుగా తీర్చిదిద్దుకోవచ్చు.

పల్లె ప్రగతితో కలిసొస్తుంది!

గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పల్లె ప్రగతి స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకులకు కలిసివస్తోంది. చెత్త సేకరణకు ప్రతి పంచాయతీలో ట్రాక్టర్‌ను కొనుగోలు చేసి నిత్యం ఇంటింటా తడి, పొడి చెత్త సేకరణ చేపట్టింది. సేకరించిన చెత్తను ప్రత్యేకంగా నిర్మించిన డంపింగ్ యార్డుకు తరలించి పక్కనే ఉన్న కంపోస్టు షెడ్లలో తడి, పొడి చెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువును తయారు చేస్తున్నారు. తయారు చేసిన ఎరువును గ్రామంలో నాటిన హరితహారం మొక్కలకు వినియోగిస్తున్నారు. అంతేకాకుండా అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలలను మెరుగుపరచడంతోపాటు ప్రత్యేకంగా స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తూ వాల్ పేయింటింగ్ ద్వారా పల్లెల్లో ప్రగతి కనిపిస్తోంది.

5 స్టార్‌కు కృషి చేస్తాం లక్ష్మీనారాయణ, డీఆర్‌డీవో, జగిత్యాల

జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేయడంతో త్రీస్టార్ ర్యాంకు లభించింది. దేశవ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో జగిత్యాల జిల్లాకు త్రీస్టార్ రావడం సంతోషంగా ఉంది. లోపాలను సరిచేసుకుని, గ్రామాలను మరింత మెరుగుపరిచి ఆక్టోబరు నాటికి 5 స్టార్ వచ్చేలా కృషి చేస్తాం.

# కొత్త వారికి బంద్

వరంగల్ : రైతులకు పెట్టుబడి సాయం కష్టాలను దూరం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని 2018 వానాకాలం సాగు నుంచి అమలు చేస్తోంది. పట్టాదారు పాసుపుస్తకాలు కలిగిన వారికి ఏటా రెండు సీజన్లలో ఎకరాకు రూ.5వేల చొప్పున అందిస్తోంది. ఈసారి కొత్తగా పాసుపుస్తకాలు పొందిన కర్షకులకు సాయం అందటం లేదు. ప్రతి సీజన్‌లో కొత్త రైతుల వెంటపడి మరీ దరఖాస్తు చేయించిన వ్యవసాయాధికారులు ఈసారి ముఖం చాటేస్తున్నారు. కొత్తవారి వివరాలు అధికారుల వద్దకు చేరినా ప్రభుత్వ స్థాయిలో అనుమతి రాకపోవడంతో 'రైతుబంధు' అందటం కష్టమేనన్న భావన వ్యక్తమవుతోంది.

నిలిచిన లాగిన్ సౌకర్యం గత వానాకాలం సీజన్‌లో జూన్ 28 నుంచి పెట్టుబడి సాయం అందించారు. జూన్ 20 వరకు పాసుపుస్తకాలు కలిగిన లేదా రిజిస్ట్రేషన్లు అయిన రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి ప్రభుత్వం సాయం అందించింది. జులై 20 తరువాత కొనుగోలు, వారసత్వం కింద రిజిస్ట్రేషన్‌లు చేయించుకున్న రైతులు ఉమ్మడి జిల్లాలో 24,497 మంది ఉన్నారు. వీరంతా మండల స్థాయిలో రైతుబంధుకు దరఖాస్తు చేసుకున్నారు. వీరి వివరాలను ఏవో, ఏఈవోలు లాగిన్‌లో నమోదు చేస్తే ఇప్పటికే పెట్టుబడి సాయం జమయ్యేది. కానీ ఈసారి కొత్త రైతుల వివరాల నమోదుకు అవసరమైన లాగిన్ సౌకర్యాన్ని ఉన్నతాధికారులు నిలిపేశారని సమాచారం.

గోప్యత పాటిస్తున్న అధికారులు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 8,62,654 మందికి రైతుబంధు అందుతోంది. నిబంధనల ప్రకారం మరో 24,497 మందికి సాయం అందాల్సి ఉంది. గత సీజన్ నుంచి ఇప్పటివరకు క్రయవిక్రయాలు, వారసత్వంగా భూములు దక్కించుకున్న కొత్త రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండా రాష్ట్ర స్థాయిలో అధికారులు చర్యలు తీసుకున్నారు. వ్యవసాయశాఖ అధికారులు ఈ విషయాన్ని గోప్యంగా ఉంచుతున్నారు.

## కార్మికుల పిల్లలకు చేయూత

మెట్‌పల్లి : కార్మికుల పిల్లల చదువుకు భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా విద్యాప్రోత్సాహకం కింద ఉపకార వేతనాలు మంజూరు చేస్తోంది. ఇందులో భాగంగా 2022-23 విద్యా సంవత్సరానికి ఉపకార వేతనాలు అందించడానికి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. ఈ నెల 1 నుంచి ఫిబ్రవరి 15 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. విద్యార్థులు నేరుగా కార్మికశాఖ కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుంది.

ప్రోత్సాహకం ఇలా..

పదోతరగతి, ఐటీఐ చదువుతున్న విద్యార్థులకు రూ.1000, పాలిటెక్నిక్ రూ.1500, ఇంజినీరింగ్, మెడిసిన్, న్యాయవిద్య, బీఎస్సీ(అగ్రికల్చర్) రూ.2000, బీఎస్సీ(హార్టికల్చర్), బి.ఎ.ఎం.ఎస్, బి.డి.ఎస్, డి.ఎం.ఎల్.టి, ఎం.ఎల్.టి, బి.వి.ఎస్.సి, బి.ఫార్మసి, బి.సి.ఎ, ఎం.సి.ఎ, బి.బి.ఎ, ఎం.బి.ఎ, డి.హెచ్.ఎం.ఎస్ చదువుతున్న విద్యార్థులకు రూ.2000 వంతున ఉపకారవేతనం అందిస్తారు. వికలాంగులైన విద్యార్థులకు సంవత్సరానికి రూ.4000 వంతున మంజూరు చేస్తారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖల ద్వారా పొందుతున్న ఉపకార వేతనాలతో అదనంగా కార్మిక సంక్షేమ మండలి నుంచి పొందవచ్చు. దుకాణాలు, సంస్థలు, కర్మాగారాలు, మోటారు రవాణా సంస్థలు, సహకారం సంఘాలు, ధర్మాదాయ ఇతర ట్రస్టుల్లో పనిచేస్తూ కార్మిక సంక్షేమ నిధికి జమచేసే కార్మికుల పిల్లలు ఉపకార



వేతనాలు పొందడానికి అర్హులు. కార్మికుని నెల వేతనం రూ.16 వేలు మించరాదు.

కరవైన అవగాహనఈ పథకంపై కార్మికులు, వారి పిల్లల్లో అవగాహన కరవైంది. గతేడాది జిల్లాలో ఒక్క విద్యార్థి కూడా దరఖాస్తు చేసుకోలేదని అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాలో వందలాది మంది విద్యార్థులు ఆయా కోర్సుల్లో చదువుతున్నా పథకంపై అవగాహనలేక ఉపకార వేతనం పొందలేక పోతున్నారు. అధికారులు చొరవ చూపక పోవడంతో విద్యార్థులు ఉపకార వేతనాలు కోల్పోవాల్సి వస్తోంది. ఈ ఏడాదైనా అధికారులు దృష్టి సారించి చైతన్యం కల్పించి అర్హులైన విద్యార్థులకు ఉపకార వేతనం అందేలా చూడాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.విస్తృత ప్రచారం రాజేశ్వరమ్మ, కార్మిక శాఖ జిల్లా సహాయ కమిషనర్, జగిత్యాల

ఈ ఏడాది ప్రత్యేక దృష్టి సారిస్తాం. విద్యాప్రోత్సాహక పథకంపై విస్తృత ప్రచారం చేస్తున్నాం. అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నాం. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కళాశాలల ప్రిన్సిపల్స్, యాజమాన్యాలు విద్యార్థులు ఉపకార వేతనం పొందేలా చొరవ చూపాలి.

## ఎత్తిపోతల పథకానికి మోక్షమెన్నడో..!

ధర్మపురి : ధర్మపురి మండలంలోని దమ్మన్నపేట గోదావరి ఎత్తిపోతల పథకానికి మోక్షం లభించడం లేదు. ప్రారంభోత్సవానికి సిద్ధమైన సమయంలో వరదలు రావడంతో భారీగా నష్టం వాటిల్లింది. మరమ్మతుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఎత్తిపోతల పథకానికి రూ.70 లక్షల నిధులు మంజూరవగా రెండేళ్లుగా నత్తనడకన సాగుతున్నాయి. ఎస్సారెస్పీ కాలువ చివరి గ్రామమైన దమ్మన్నపేటకు మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రత్యేక చొరవతో ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేశారు. గుత్తేదారు, అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా ఏళ్లతరబడి నత్తనడకన పనులు జరిగాయి. 2,500 ఎకరాలకు సాగు నీరందించే లక్ష్యంతో నిర్మించిన పథకం ప్రారంభోత్సవానికి సిద్ధంకాగా గత జూలై నెలలో గోదావరినదికి వరదలు వచ్చాయి. మోటార్లు, జనరేటర్, ఇతర పరికరాలు, విద్యుత్తు స్తంభాలు ధ్వంసమయ్యాయి. పరికరాలు వరదనీటిలో మునగడంతో భారీ నష్టం వాటిల్లింది. నిధులు మంజూరు కాకపోవడంతో మరమ్మతులకు నోచుకోవడం లేదు. యాసంగిలో పంటలకు నీరందించేలా ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించేందుకు పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

మరమ్మతులు నిర్వహిస్తే



శ్రీనివాస్, రైతు దమ్మన్నపేట

మా గ్రామంలో గోదావరినది కిందే పంటలను సాగు చేస్తున్నాం. ఈ ఎత్తిపోతల పథకం పూర్తయితే సాగు నీటి సౌకర్యం కలుగుతుంది. వరదల్లో ఎత్తిపోతల పథకం మోటార్లు మునిగిపోయాయి. వెంటనే వాటికి మరమ్మతు చేసి ప్రారంభించాలి. సాగునీటికి ఇక్కట్లు లేకుండా చర్యలు చేపట్టాలి.

తక్షణ చర్యలు అవసరంరవి, రైతు, దమ్మన్నపేటదమ్మన్నపేట గ్రామంలో ఎస్సారెస్పీ కాలువ ద్వారా ఏనాడూ సాగు నీరందిన దాఖలాలు లేవు. సాగు నీటి కోసం రైతులు యాసంగిలో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కనీసం ఈ ఎత్తిపోతల పథకం ద్వారా సాగు నీరందుతుందని ఆశించినా ఫలితం లేదు. అధికారులు స్పందించి మరమ్మతుల నిర్వహణకు చర్యలు చేపట్టాలి.

నిధులు రాగానే పనులు

నారాయణ రెడ్డి, నీటిపారుదల శాఖ డీఈ

ఎత్తిపోతల పథకాన్ని నీటిపారుదల శాఖ పరిధిలోకి ఇటీవలే తీసుకున్నాం. మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించాము. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.




## భరత్‌ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే.. సీఎం చేస్తాం: నోరుజారిన మంత్రి పెద్దిరెడ్డి

ఎమ్మెల్సీ భరత్‌ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే.. ముఖ్యమంత్రిని చేస్తామని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నోరు జారారు. చిత్తూరు జిల్లా కుప్పం పల్లెబాట కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుప్పం పర్యటన భాగంగా ఎమ్మెల్సీ భరత్‌ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే మంత్రిని చేస్తామని సీఎం జగన్ హామీ ఇచ్చారని చెప్పబోయి... ముఖ్యమంత్రిని చేస్తారని మంత్రి నోరు జారారు. ప్రస్తుతం ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ మారింది.




దిల్లీ: మణిపుర్ అల్లర్ల అంశంపై పార్లమెంట్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీతో ఎలాగైనా మాట్లాడించాలని ప్రయత్నాలు చేస్తున్న విపక్ష కూటమి 'ఇండియా' తాజాగా అవిశ్వాస తీర్మాన అస్త్రంతో సిద్ధమైంది. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా లోక్‌సభలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు కాంగ్రెస్, భారాస బుధవారం స్పీకర్‌కు నోటీసులిచ్చాయి. అయితే, ఈ 'అవిశ్వాసాన్ని' ప్రధాని మోదీ నాలుగేళ్ల క్రితమే ఊహించారు. ఇందుకు సంబంధించిన పాత వీడియో ఒకటి తాజాగా బయటికొచ్చింది. గత సార్వత్రిక ఎన్నికలకు ముందు 2019 ఫిబ్రవరిలో జరిగిన బడ్జెట్ సమావేశాల్లో మోదీ దీని గురించి ప్రస్తావించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. "2023లోనూ నాపై అవిశ్వాసం తీసుకొచ్చేలా మీకు అవకాశం రావాలి. అందుకు మీరు సిద్ధమవ్వాలని కోరుకుంటున్నా" అని మోదీ అనడంతో అధికార పక్ష సభ్యులు నవ్వులు చిందించారు. 2019 ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు ఓటమి తప్పదని ఎద్దేవా చేస్తూ నాడు మోదీ ఇలా వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. "ఒకప్పుడు లోక్‌సభలో 400కు పైగా స్థానాలు సాధించిన కాంగ్రెస్ 2014లో దాదాపు 40 స్థానాలకు పరిమితమైంది. వారి అహంకారం వల్ల జరిగిన పరిణామం అది. కానీ, మా సేవాభావం వల్లే భాజపా రెండు స్థానాల నుంచి ఒంటరిగా అధికారంలోకి వచ్చే స్థాయికి ఎదిగింది" అని మోదీ ప్రతిపక్షంపై విమర్శలు గుప్పించారు. తాజాగా, మణిపుర్ విషయంలో కేంద్ర ప్రభుత్వంపై విపక్షాల కూటమి అవిశ్వాస తీర్మానానికి సిద్ధమవడంతో ఆ వీడియోను దూరదర్శన్ (డీడీ న్యూస్) ట్విటర్‌లో పోస్ట్ చేసింది. ప్రస్తుతం ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

## ఎన్ని ఇళ్లు పూర్తి చేశారు?.. వైసీపీ ప్రభుత్వానికి పురంధేశ్వరి సూటి ప్రశ్న



రాజమండ్రి: రాష్ట్రంలో ఇళ్ల నిర్మాణంపై జగన్ ప్రభుత్వాన్ని ఏపీ బీజేపీ చీఫ్ దగ్గుబాటి పురంధేశ్వరి సూటిగా ప్రశ్నించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ఏపీకి కేంద్రం 22 లక్షల ఇళ్ళు ఇచ్చిందని.. రాజమండ్రికి లక్షా 86 వేల ఇళ్లు కేటాయిస్తే వైసీపీ ప్రభుత్వం ఎన్ని ఇళ్లు పూర్తిచేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఏపీలో జాతీయ రహదారుల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. పంచాయతీల నిధులను వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించటం శోచనీయమన్నారు. సర్పంచులను వైసీపీ ప్రభుత్వం మోసం చేస్తోందని ఆరోపించారు. పార్టీలకతీతంగా బీజేపీ దగ్గరకు వచ్చిన సర్పంచులకు బీజేపీ అండగా ఉంటుందని ఏపీ బీజేపీ చీఫ్ భరోసా ఇచ్చారు. ఆవ భూముల కొనుగోళ్ళలో వైసీపీ నేతలు దోచుకున్నారని మండిపడ్డారు. వైసీపీ నేతలే ఇసుక, మట్టి మాఫియాలుగా మారారన్నారు. కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వకపోటం వల్ల కాంట్రాక్టర్లు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులకు మూడు వేల కోట్ల ధరలస్థిరీకరణ నిధి ఎందుకు ఏర్పాటు చేయలేదో జగన్ చెప్పాలని డిమాండ్ చేశారు. జగన్ ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. ఏపీలో ప్రజలకు మేలు చేయలేని స్థితిలో జగన్ ఉన్నారన్నారు. రాష్ట్రంలో సర్పంచులకు మద్దతుగా ఆగస్టు 10న జిల్లా స్థాయిలో, ఆగస్టు 17న రాష్ట్ర స్థాయిలో ఆందోళన చేపట్టనున్నట్లు ప్రకటించారు. పోలవరం నిర్మాణానికి కేంద్రం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. పునరావాస ప్యాకేజీ విషయంలో ఏపీ ప్రభుత్వం సరైన గణాంకాలు కేంద్రానికి ఇవ్వటం లేదన్నారు. జనసేనతో పొత్తు కొనసాగుతుందని దగ్గుబాటి పురంధేశ్వరి మరోసారి స్పష్టం చేశారు.

## ఇరిగేషన్ శాఖను వైసీపీ భ్రష్టు పట్టించింది.. రాయలసీమ ప్రాజెక్టులపై చంద్రబాబు



అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు రాయలసీమ ప్రాజెక్ట్స్ గురించి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ప్రజలకు తెలియజేశారు. బుధవారం మీడియాతో మాట్లాడిన చంద్రబాబు.. నీటి కోసం దేశాల మధ్య, రాష్ట్రాల మధ్య యుద్ధాలు జరిగాయన్నారు. రాయలసీమ అభివృద్ధి ఎన్టీఆర్ తెచ్చిన తెలుగు గంగ ప్రాజెక్ట్‌తోనే ప్రారంభమైందన్నారు. కృష్ణ, గోదావరి నదుల అనుసంధానం వల్ల రాష్ట్రానికి మేలు కలుగుతుందని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులపై తెలుగుదేశం హయాంలో రూ.68,293 కోట్లు ఖర్చు పెడితే.. వైసీపీ ప్రభుత్వం కేవలం రూ.22,165 కోట్లు మాత్రమే ఖర్చు చేశారన్నారు. ఇరిగేషన్ శాఖను వైసీపీ భ్రష్టు పట్టించిందని టీడీపీ చీఫ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాయలసీమ ప్రజలకు హోప్ కలిగించిన పార్టీ టీడీపీ అని అన్నారు. అనంత లాంటి జిల్లాల్లో పదేళ్లలో ఎనిమిదేళ్లు వేరుశెనగ పంటలు ఎండిపోయిన పరిస్థితులు ఉండేవన్నారు. కరవులో ఉన్న సీమ ప్రజలకు తెలుగు గంగను ఎన్టీఆర్ ప్రారంభించారని గుర్తుచేశారు. హంద్రీ – నీవా, గాలేరు నగరి ప్రాజెక్టులకు అంకురార్పణ చేశారని తెలిపారు. ఆ తర్వాత పట్టిసీమ ద్వారా సీమకు నీటిని తరలించామని చెప్పారు. నదుల అనుసంధానం ప్రాజెక్టులు చేపట్టాలని అప్పటి ప్రధాని వాజ్ పేయిని కోరానని.. గంగా – కావేరీ కలపాలని సూచించామన్నారు. ఏపీ విభజన తర్వాత పోలవరం ద్వారా కృష్ణా – గోదావరి నదుల అనుసంధానం కోసం ప్రయత్నించామని తెలిపారు. దీనికి అనుగుణంగా వివిధ ప్రాజెక్టులను రూపొందించి వాటిల్లో కొన్నింటికి టెండర్లు కూడా టీడీపీ హయాంలో పిలిచామన్నారు. నదుల అనుసంధానం ద్వారా ఏపీలో ప్రతీ ఎకరాకు నీరందించే ప్రయత్నం చేశామన్నారు. టీడీపీ హయాంలో మొత్తం బడ్జెట్టులో 9.63 శాతం ఇరిగేషన్ కోసం కేటాయింపులున్నాయని.. కాని జగన్ హయాంలో మొత్తం బడ్జెట్టులో 2.35 శాతం మాత్రమే ఇరిగేషన్ కోసం ఖర్చు పెట్టిందని చంద్రబాబు నాయుడు వెల్లడించారు.

## పోలవరం, ఇతర ప్రాధాన్య ప్రాజెక్ట్‌లపై ఏపీ సీఎస్ సమీక్ష



అమరావతి: పోలవరం ప్రాజెక్టు, ఇతర ప్రాధాన్య ప్రాజెక్టులపై వెలగపూడి సచివాలయంలో సీఎస్ కె.ఎస్.జవహర్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టుల వారీగా ఇప్పటి వరకూ పూర్తి చేసిన పనుల ప్రగతి, ఇంకా పూర్తి చేయాల్సిన పనులు, నిర్వాసితులకు అమలు చేయాల్సిన పునరావాస ప్రాజెక్టులపైన చర్చించారు. పోలవరం ప్రాజెక్టు పనులు,పునరావాస ఫ్యాకేజికి ఇప్పటి వరకూ చేపట్టిన పనులనుపై సీఎస్ సమీక్ష జరిపారు. నిర్దేశిత గడువు ప్రకారం పనులు పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎస్ ఆదేశించారు. పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు, ఔకు టన్నల్, గొట్టా బ్యారేజి నుంచి హీర మండలం ఇరిగేషన్ ప్రాజెక్టుల పైన సీఎస్ సమీక్ష చేశారు. వంశధార – నాగావళి నదుల అనుసంధానం, గొట్టా బ్యారేజి రిజర్వాయర్ ప్రాజెక్టు, హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్–2 తదితర ప్రాజెక్టుల ప్రగతిపైన చర్చించారు. ఈ ఐదు ప్రాజెక్టులను ఈ ఏడాదిలో పూర్తి చేసి ప్రారంభించేందుకు వీలుగా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎస్ జవహర్ రెడ్డి ఆదేశించారు.

## భారత్ నియంత్రణ రేఖ దాటడానికి సిద్ధంగా ఉంది: రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్



భారత్ గౌరవ ప్రతిష్ఠలను కాపాడుకోవడానికి నియంత్రణ రేఖను దాటడానికి సిద్ధంగా ఉందని.. ప్రజలు కూడా సైన్యానికి మద్దతు ఇచ్చేందుకు సిద్ధంగా ఉండాలని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు. ఆయన ద్రాస్‌లోని కార్గిల్ యద్ధ స్మారకం వద్ద జరిగిన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. నేడు దేశవ్యాప్తంగా కార్గిల్ విజయ్ దివస్ నిర్వహిస్తున్నారు. "మనకు పాకిస్థాన్ వెన్నుపోటు పొడిచింది. భారత్ యుద్ధం చేయాల్సి వచ్చింది. దేశం కోసం ప్రాణాలను పణంగా పెట్టిన సైనికులకు వందనం చేస్తున్నా. దేశం యుద్ధాన్ని ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొన్న ప్రతిసారి ప్రజలు పరోక్షంగా మద్దతుగా నిలిచారు. యుద్ధ రంగంలో అవసరమైన చోట సైనికులకు నేరుగా మద్దతు ఇచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని నేను కోరుతున్నాను. దేశ గౌరవ ప్రతిష్ఠల కోసం మేము ఎక్కడి వరకైనా వెళ్లేందుకు సిద్ధమే. అవసరమైతే నియంత్రణ రేఖనూ దాటతాం. అందుకు మేము సిద్ధంగా ఉన్నాం" అని వ్యాఖ్యానించారు. సైన్యం సరిహద్దులను కంటికి రెప్పలా కాపాడుతున్నంత సేపు శత్రువులకు ఇటువైపు కన్నెత్తి చూసే ధైర్యం ఉండదని రాజ్‌నాథ్ అభివర్ణించారు. కేవలం కార్గిల్ యుద్ధంలోనే కాదు.. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి పలు మార్లు సైన్యం తమ ధైర్య సాహసాలతో దేశం గర్వించేట్లు చేసిందన్నారు. మరోవైపు రాష్ట్రపతి ద్రౌపది ముర్మ, ప్రధాని నరేంద్ర మోదీ ట్విటర్ వేదికగా కార్గిల్ అమరవీరులకు నివాళులర్పించారు. "సాయుధ దళాల అసాధారణ ధైర్య సాహసాలను ప్రజలు చిరకాలం గుర్తుంచుకొంటారు. భవిష్యత్తు తరాలకు వారి గాథలు స్ఫూర్తినిస్తాయి" అని రాష్ట్రపతి పేర్కొన్నారు. "కార్గిల్ విజయ్ దివస్ భారత వీరుల ధైర్యగాథను గుర్తుకు తెస్తుంది. వారు ప్రజలకు స్ఫూర్తిదాయకంగా నిలిచారు. నేడు చాలా ప్రత్యేకమైన రోజు. వారికి హృదయ పూర్వక నివాళి" అని ప్రధాని తన సందేశంలో పేర్కొన్నారు.

## మదనపల్లె మార్కెట్‌లో రికార్డు స్థాయికి టమాటా ధర



మదనపల్లె : మదనపల్లె మార్కెట్‌లో టమాటా ధరలు బెంబేలెత్తిస్తున్నాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా వర్షాలు కురుస్తుండటంతో టమాటా పంట దిగుబడి తగ్గింది. మదనపల్లె మార్కెట్ పరిధిలో బుధవారం రికార్డు స్థాయిలో కిలో నాణ్యమైన టమాటా రూ.168 పలికింది. మార్కెట్‌కు రైతులు కేవలం 361 టన్నులు మాత్రమే తీసుకువచ్చారు. మార్కెట్‌లో ఏ గ్రేడ్ కిలో రూ.140 నుంచి రూ.168, బీ గ్రేడ్ రూ.118 నుంచి రూ.138 వరకు.. సగటున కిలో రూ.132 నుంచి రూ.156 వరకు పలికిందని మార్కెట్ యార్డు కార్యదర్శి అభిలాష్ తెలిపారు. మంగళవారం రూ.140 పలికిన ధర.. ప్రస్తుతం రూ.160కి పైగా పలకడంతో వినియోగదారుల్లో గుబులు మొదలైంది.

## తరచూ పెళ్లాల గురించే జగన్ మాటలు.. అది తప్పైతే.. బాబాయి హత్య తప్పు కాదా?



సీఎం జగన్మోహన్ రెడ్డి తరచూ పెళ్లాల గురించే మాట్లాడుతున్నారని సీపీఐ నారాయణ సెటైర్లు వేశారు. మూడు పెళ్లిళ్లు తప్పు అని... బాబాయిని హత్య చేయడం తప్పు కాదా? అని ప్రశ్నించారు. హత్యలు ప్రమాదమా... మూడు పెళ్లిళ్లు ప్రమాదమా? అనేది తేల్చాలన్నారు. బాబాయిని చంపడం తప్పు కాదని చెబుతారా? అని నిలదీశారు. పవన్ విడాకులు తీసుకుని పెళ్లిళ్లు చేసుకుంటే జగన్‌కు ఎందుకని నారాయణ ప్రశ్నించారు. సీఎం తన హోదాను మరచి దిగజారి వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. రాజకీయ పరమైన అంశాలతో ఎవరినైనా విమర్శించ వచ్చుని.. తరచూ వ్యక్తిగత దూషణలతో నిందలు వేయడం ఏమిటని ప్రశ్నించారు. రాజకీయంగా పస లేనందువల్లే జగన్ వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని సీపీఐ నారాయణ పేర్కొన్నారు.

## పార్లమెంటును స్తంభింపజేయడాన్ని వైసీపీ సమర్థించదు



ఢిల్లీ : పార్లమెంట్‌ను స్తంభింపజేయడాన్ని వైఎస్సార్సీపీ సమర్థించదని ఆ పార్టీ ఎంపీ విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. మణిపూర్ అంశం మీద హోం మంత్రి అమిత్ షా చర్చకు సిద్ధమని, సమాధానం చెబుతానని అన్నారన్నారు. మణిపూర్ దేశ అంతర్గత భద్రతకు సంబంధించిన అంశమని.. ఇది పూర్తిగా కేంద్ర హోం శాఖ పరిధిలో ఉంటుందన్నారు. ఇలాంటప్పుడు ఉభయ సభలను నిలిపివేయడం వల్ల ఏమీ ఉపయోగం లేదని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. మణిపూర్ అంశంపై విపక్షాలు ప్రధాని మోదీ సమాధానం ఇవ్వాల్సిందేనన్న డిమాండ్‌పై పార్లమెంటును స్తంభింపజేశాయి. నిన్న అంటే 4వ రోజు కూడా ఉభయ సభలను వాయిదా వేయాల్సి వచ్చింది. రాజ్యసభలో విపక్ష నేత ఖర్గే మైక్‌ను చైర్మన్ కట్ చేయడంతో నిరసనగా ఇండియా కూటమి పార్టీలన్నీ వాకౌట్ చేశాయి. ఆప్ నేత సంజయ్‌సింగ్‌ను సెషన్ అంతటికీ సస్పెండ్ చేయడంపై విపక్షాలన్నీ సోమవారం రాత్రంతా పార్లమెంటు ఆవరణలోని గాంధీ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించాయి. కాగా, ప్రతిష్ఠంభనను తొలగించేందుకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా చొరవ చూపారు. అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లతో సమావేశం నిర్వహించారు. రాజ్యసభ చైర్మన్ ధన్‌ఖడ్ సైతం ఇదే ప్రయత్నం చేశారు. ఎన్సీపీ వ్యవస్థాపకుడు శరద్ పవార్ సహా పలువురు విపక్ష సభ్యులతో ఆయన సమావేశమయ్యారు. ఇవేవీ ఫలించలేదు. ఇక గందరగోళం మధ్యే రాష్ట్రాల బహుళ సహకార సంఘాల సవరణ, ఇతర బిల్లులను ఆమోదించారు.




ఇంఫాల్: తెగల మధ్య వైరం కారణంగా మణిపూర్‌లో రెండు నెలలకుపైగా ఘర్షణ వాతావరణం నెలకొంది. రాష్ట్రంలో శాంతి నెలకొల్పేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడంలేదు. ఈ క్రమంలోనే మరో కొత్త అంశం మణిపూర్ ప్రభుత్వాన్ని ఆందోళనకు గురి చేస్తోంది. సుమారు 700 మందికి పైగా మయన్మార్ వాసులు మణిపూర్‌లోకి ప్రవేశించినట్లు సమాచారం. వీరిలో మహిళలు, చిన్నారులు ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అస్సాం రైఫిల్స్ సెక్టార్ 28 అందించిన సమాచారం ప్రకారం 718 మంది మయన్మార్ వాసులు జులై 23–24 తేదీల్లో మణిపూర్‌లోని చందేల్ జిల్లాలోకి ప్రవేశించారు. వీరిలో 301 మంది పిల్లలు, 208 మహిళలు, 209 మంది పురుషులు ఉన్నారు. వీరంతా సరైన ప్రయాణ పత్రాలు లేకుండా రాష్ట్రంలోకి ప్రవేశించారని వెల్లడించింది.

**గుండె బరువై..ఆశ్రయం కరవై..** "సరైన ప్రయాణ పత్రాలు లేకుండా మయన్మార్ నుంచి భారత్‌లోకి ప్రవేశించిన వారిని వెనక్కి పంపేయాలని అస్సాం రైఫిల్స్‌కు సూచించాం. వీసా, అధీకృత ప్రయాణ పత్రాలు లేకుండా మయన్మార్ నుంచి ఎవరిని మణిపూర్‌లో అనుమతించవద్దని కేంద్ర హోం శాఖ నుంచి స్పష్టమైన ఆదేశాలున్నాయి. రాష్ట్రంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో మయన్మార్ వాసులను మణిపూర్‌లోకి అనుమతించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అస్సాం రైఫిల్స్‌కు తెలియజేశాం" అని మణిపూర్ చీఫ్ సెక్రటరీ డా. వినీత్ జోషి తెలిపారు. మణిపూర్‌లో ఆందోళనకారులకు మయన్మార్ నుంచి ఆయుధాలు సరఫరా అవుతున్నట్లు గత నెలలో ఇంటెలిజెన్స్ వర్గాలు గుర్తించాయి. గత నెలలో మయన్మార్ నుంచి మణిపూర్‌కు ఆయుధాలు సరఫరా చేస్తున్న నలుగురిని భద్రతా దళాలు అరెస్టు చేశాయి. ఈ క్రమంలో మయన్మార్ వాసులు మణిపూర్‌లోకి ప్రవేశించడంపై మణిపూర్ ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది.

# రంగమ్మత్త రచ్చ రంబోలా..!

టాలీవుడ్ హాట్ యాంకర్ గా సూపర్ క్రేజ్ తెచ్చుకున్న అనసూయ తన టాలెంట్ తో కెరీర్ బిల్డ్ చేసుకుంటూ వచ్చింది. జబర్దస్త్ షోలో దాదాపు ఎనిమిది ఏళ్ల దాకా యాంకరింగ్ చేసి సూపర్ పాపులారిటీ సంపాదించిన అనసూయ సినిమాల్లో కూడా ప్రాధాన్యత ఉన్న పాత్రలనే చేస్తూ మెప్పిస్తుంది. క్షణం సినిమా నుంచి వెండితెర మీద అనసూయ హవా కొనసాగుతుంది. ఇక రామ్ చరణ్ రంగస్థలం సినిమాలో రంగమ్మత్త పాత్రలో ఆమె అదరగొట్టేసింది. సుకుమార్ సినిమా అంటే అనసూయ కి ఒక పాత్ర ఉండేలా చూస్తున్నాడు. రంగస్థలంలో రంగమ్మత్త పాత్ర క్లిక్ అయ్యిందని పుష్ప లో దాక్షాయణి పాత్ర ఇచ్చాడు. పుష్ప 1 లో దాక్షాయణి గా అనసూయ సూపర్ అనిపించేసింది. సోలో సినిమా ప్రయత్నాలు ఓ పక్క స్టార్ సినిమాల్లో ఐడెంటిటీ తెచ్చే పాత్రలు మరోపక్క ఇలా పర్ఫెక్ట్ ప్లానింగ్ తో అనసూయ



దూసుకెళ్తుంది. అయితే వీటన్నిటికన్నా అమ్మడు ఫోటో షూట్స్ తో కూడా తన గ్రాఫ్ పెంచుకుంటుంది. అనసూయ ఇన్ స్టాగ్రాం ఓపెన్ చేస్తే చాలు తన ఫోటో షూట్స్ తో ఫాలోవర్స్ ని ఎట్రాక్ట్ చేస్తుంది అమ్మడు. ప్రస్తుతం వెకేషన్ మోడ్ లో ఉన్న అనసూయ ఫ్యామిలీతో కాలిఫోర్నియాలో ఎంజాయ్ చేస్తుంది. అక్కడ భర్త పిల్లలతో దిగిన ఫోటోస్ తో పాటుగా తను సెపరేట్ గా చేసిన ఫోటో షూట్ పిక్స్ కూడా ఇన్ స్టాలో షేర్ చేసింది. వైట్ అండ్ వైట్ టాప్ స్కట్ లో అలా హెయిర్ లూజ్ గా వదిలేసి థై షో చేస్తున్న అనసూయను చూస్తే ఎంతటి వారైనా సరే ఆమె వల్లో పడిపోవాల్సిందే. అనసూయ షేర్ చేస్తున్న ఫోటోస్ సోషల్ మీడియాలో వైరల్ గా మారుతుంటాయి. అందుకే అమ్మడికి ఇన్ స్టా లో 1.4 మిలియన్ ఫాలోవర్స్ ఉన్నారు. ఇక అమ్మడి సినిమాల అప్డేట్ కి వస్తే అనసూయ ప్రస్తుతం పుష్ప 2 తో పాటుగా మరో రెండు సినిమాల్లో నటిస్తుంది. క్రిష్ తో వెబ్ సీరీస్ ఒకటి ప్లానింగ్ లో ఉందని వార్తలు వచ్చినా అది ఇంతవరకు సెట్స్ మీదకు వెళ్లలేదు. ఆ వెబ్ సీరీస్ కోసం అనసూయకు భారీ రెమ్యునరేషన్ ఇస్తున్నారని తెలుస్తుంది. రీసెంట్ గా వచ్చిన విమానం సినిమాలో మరోసారి తన పాత్రతో మెప్పించింది అనసూయ. పెళ్లై ఇద్దరు పిల్లలు ఉన్నా యువ హీరోయిన్స్ కు ఈక్వల్ గా తన గ్లామర్ తో తన టాలెంట్ తో ఆడియన్స్ ని మెప్పించాలని చూస్తుంది అనసూయ.

# ఈ పుకార్లతో పిల్లలు ఎంతగా ఆందోళనకు గురవుతున్నారో!

సీనియర్ యాంకర్ సుమ –రాజీవ్ కనకాల జంట విడాకుల గురించి చాలా కాలంగా పుకార్లు షికార్ చేస్తున్న సంగతి తెలిసిందే. రాజీవ్ వీటిని ఖండించినా పుంఖానుపుంఖాలుగా ఇలాంటి పుకార్లు వ్యాపిస్తూనే ఉన్నాయి. నిజానికి సుమ ఇలాంటి వాటిని అస్సలు పట్టించుకోరు. కానీ రాజీవ్ కనకాల ఈ పుకార్ల గురించి సీరియస్ గానే పట్టించుకుంటానని అన్నారు. అంతకుముందు జరిగిన సంఘటనల గురించి ఆయన ఇప్పుడు ఓ ఇంటర్వ్యూలో ఓపెనయ్యారు. ఒకానొక సమయంలో ఓ మూవీ కోసం తీవ్రమైన వేడిలో షూటింగ్



చేసి ఎంతో అలసిపోయాను.. నా చర్మం మెరుపును కోల్పోయింది. మేము పార్టీలకు హాజరైనప్పుడు.. నేను ఎందుకు పాలిపోయి నీరసంగా ఉన్నాను? అని సుమను అడిగేవారు. వారు నా వృత్తిపరమైన నిబద్ధతను అర్థం చేసుకోలేదు.. వైవాహిక జీవితంలో అంతా బాగానే ఉందా..? అని ప్రశ్నించడం ద్వారా మమ్మల్ని ఇబ్బంది పెట్టడానికి ప్రయత్నించారు! అని రాజీవ్ చెప్పారు. ఈ విడాకుల పుకార్లను ఎవరు ప్రారంభించారు? ఎందుకిలా చేస్తున్నారు? అని నేను మదనపడ్డాను. సుమ దానిని తేలికగా తీసుకుంది. కానీ నాకు ఆందోళన కలిగించింది. ఈ పుకార్లు చదివి నా కుటుంబం కూడా అయోమయంలో పడింది. అమెరికాలోని మా కుటుంబ సభ్యులు కూడా దాని గురించి ఆందోళన చెందారు. అంతా బాగానే ఉందా? అని మమ్మల్ని అడిగేవారు.

నేను దీంతో ఎంతో కదిలిపోయాను. మేం కలిసే ఉన్నాం అని చెప్పేందుకు సుమ షోలకు కూడా వెళ్లాల్సి వచ్చింది... మేము కలిసే ఉన్నాం అని వివరణ ఇచ్చారు కనకాల. ఇలాంటి పుకార్లతో తమ పిల్లలు ఎంతగా ఇబ్బందులకు గురవుతున్నారోనని ఆందోళన చెందినట్టు రాజీవ్ కనకాల వెల్లడించారు.




# స్విమ్మింగ్ పూల్ లో అందాలతో కవ్వింత



రకుల్ ప్రీత్ సింగ్ మరో ఫోటోను షేర్ చేసి ఫాలోవర్స్ ను నెటిజన్స్ ను కవ్విస్తోంది. ఈ మధ్య కాలంలో ఈ అమ్మడి సినిమాల జోరు తగ్గింది. అయితేనేం ఇలా హాట్ ఫోటో షూట్స్ తో రెచ్చి పోతూనే ఉంది. ఈ ఫోటో షూట్స్ చూస్తే కచ్చితంగా ముందు ముందు ఈ అమ్మడిని ఫిల్మ్ మేకర్స్ తమ సినిమాల్లోకి తీసుకోవడం.. దాంతో బిజీ అవ్వడం ఖాయం అన్నట్లుగా మాట్లాడుకుంటున్నారు. తాజాగా ఈ అమ్మడు ఇలా స్విమ్మింగ్ పూల్ వద్ద చిల్ అవుతూ చిరు మందహాసంతో ఆకట్టుకుంటూ ఉంది. అందాలతో కవ్విస్తూ నా అందం ముందు ఇతరులు దిగదుడుపు అన్నట్లుగా అందంగా కనిపిస్తూ కన్నుల విందు చేస్తుంది. దుబాయ్ లోని తీసుకున్న ఈ ఫోటోను సోషల్ మీడియా ద్వారా షేర్ చేసి తన ఫాలోవర్స్ కు కిక్ ఇచ్చింది అనడంలో సందేహం లేదు. సినిమాల్లో చేసినా.. చేయకున్నా కూడా ఎప్పుడు వార్తల్లో నిలుస్తున్న ఈ అమ్మడు ఈసారి తన అందాలను మరింతగా చూపిస్తూ ఉంది. స్విమ్మింగ్ పూల్ లో అందాల కవ్వింత తో గతంలో పలు సార్లు ఫోటో షూట్ చేసిన ఈ అమ్మడు ఈసారి మాత్రం సగం నీళ్లలో ఉండి సగం పైకి కనిపిస్తూ ఉంది. ఇక రకుల్ సినిమాల విషయానికి వస్తే.. సౌత్ లో ముఖ్యంగా తెలుగు.. తమిళ సినీ ఇండస్ట్రీలో ఈ అమ్మడు దాదాపు అందరు స్టార్ హీరోలకు జోడీగా నటించింది. తెలుగు లో ఒకానొక సమయంలో మహేష్ బాబుతో సినిమాకు డేట్లు ఇవ్వలేనంత బిజీగా రకుల్ సినిమాలు చేసింది. కానీ వరుసగా నిరాశ పరచడంతో పాటు అందరు హీరోలతో కూడా సినిమాలు చేసిన కారణంగా కొత్త ఆఫర్లు రావడం లేదు. ఆ మధ్య బాలీవుడ్ లో బిజీగా అనిపించినా కూడా ప్రస్తుతానికి అక్కడ కూడా వరుస సినిమాలు లేవనే చెప్పాలి. సోషల్ మీడియాలో ఇలాగే యాక్టీవ్ గా ఉంటూ.. ఇలాంటి హాట్ ఫోటోలు వీడియోలు షేర్ చేస్తూ ఉంటే అభిమానులు.. సినీ జనాలు మరోసారి రకుల్ కు ఛాన్స్ ఇవ్వాలి అనుకోవచ్చు. కనుక ఇప్పుడు కాకున్నా మరో రెండేళ్ల తర్వాత అయినా రకుల్ ఏదో ఒక భాషలో బిజీ అవ్వడం ఖాయం అనిపిస్తుంది.

# అయ్యో.. ఫోటో స్టూడియో దెబ్బడిపోయింది.. మళ్ళీ 'బేబీ'నే




పీరియాడిక్ కథలతో చిన్న చిత్రాలను నిర్మించడం చాలా అరుదుగా జరుగుతుంటుంది. కథకు తగ్గట్టుగా ఆ వాతావరణాన్ని సృష్టించి షూట్ చేయడం అంత ఈజీ కాదు. కానీ ఈ ప్రయత్నంతో రీసెంట్?గా 'అన్నపూర్ణ ఫొటోస్టూడియో' చిత్రం వచ్చింది. 1980 కాలాన్ని గుర్తు చేస్తూ.. ఆ సమయంలో సాగే ఓ ప్రేమ కథతో ఇది రూపొందిందీ చిత్రం. రెట్రో కామెడీ కమ్? క్రైమ్ డ్రామాగా తీశారు. అయితే ఇలాంటి చిన్న సినిమాలను సాధారణంగా ఓటీటీలో అయితే ఆదరిస్తారన్న సంగతి తెలిసిందే. ప్రత్యేకంగా థియేటర్లకు పరుగులు పెట్టి చూసే ప్రేక్షకులు ఉండరు.

కాదు అప్పటికీ చూడాలంటే.. ఆ చిత్రం ఇంకేదో అద్భుతం చేయాలి. అలాగే అదృష్టం కూడా కలిసి రావాలి. కానీ ఇవేమీ కాదు కదా.. కనీసం బాగుంది అన్న టాక్?ను కూడా తెచ్చుకోలేకపోయింది. వాస్తవానికి ఈ సినిమా.. ప్రచార చిత్రాలతో బాగానే ఆసక్తిని క్రియేట్? చేసిందే అని అనిపించుకుంది. పైగా ఈ చిత్రంలో.. విభిన్నమైన కథలతో మెప్పిస్తున్న చైతన్యరావ్ కథానాయకుడిగా నటించడం, 'పెళ్లిచూపులు', 'డియర్ కామ్రేడ్' వంటి హిట్? చిత్రాల నిర్మాణంలో భాగమై రావడం.. వంటి అంశాలు కూడా సినిమాకు బాగా కలిసొస్తాయని అనుకున్నారు. కానీ సీన్ రివర్స్ అయింది. సినిమా చతికిలపడిపోయింది. 'ఓ పిట్ట కథ' సినిమాతో దర్శకుడిగా పరిచయమైన చెందు ముద్దు రెండో ప్రయత్నం బోల్తా కొట్టినట్లైంది. ఈ ఫోటో స్టూడియో ఆడియెన్స్?ను ఇంప్రెస్? చేయలేకపోయింది. సినిమా రిలీజై రెండు రోజులైనా ప్రేక్షకులు ఎవరూ చూడటానికి ఆసక్తి చూపట్లేదని తెలుస్తోంది. వీకెండ్ వచ్చినా ఎవరూ పట్టించుకోకపోయేసరికి మల్టీప్లెక్సుల్లో షోలను క్యాన్సిల్ చేశరాని సమాచారం అందింది. హాఫ్ బాయిల్డ్? టాక్? రివ్యూ బయటికి రావడం వల్ల.. వీకెండ్?లోనూ ఎవరూ సినిమాకు రావట్లేదట. ఈ ఒక్క సినిమానే కాదు ఈ వారం వచ్చిన చిన్న సినిమాల పరిస్థితి అన్ని ఇంతేనట. బిచ్చగాడు 2 ఫేమ్? విజయ్ ఆంటోనీ 'హత్య' కూడా ఆకట్టుకోలేకపోయిందని అంటున్నారు. అయితే ఇంగ్లీష్ చిత్రాలు ఓపెన్ హెయిమర్, బార్బీలు బాగానే ఉన్నాయ. కానీ తెలుగు ప్రేక్షకులకు నేటివిటీకీ ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి... గత వారం రిలీజై ఆకట్టుకున్న 'బేబీ'కే ఆసక్తి చూపుతున్నారట. దీంతో తిరిగి బేబీనే ఊపందుకుందట.

# 'బేబీ' వల్ల కిర్రాక్ సీతకి బెదిరింపులు

ఆనంద్ దేవరకొండ... వైష్ణవి చైతన్య ముఖ్య పాత్రల్లో రూపొందిన బేబీ సినిమా చిన్న సినిమాగా రిలీజ్ అయి పెద్ద విజయాన్ని సొంతం చేసుకుంది. రూ.50 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన ఈ సినిమా ఇంకా మంచి షేర్ ను రాబడుతూనే ఉంది. రెండవ వారంలో కూడా ఈ స్థాయి వసూళ్లు చూసి బాక్సాఫీస్ వర్గాల వారు కూడా అవాక్కవుతూ ఉంటారు. ఇంతటి విజయాన్ని సొంతం చేసుకున్న బేబీ సినిమాలో నటించిన ప్రతి ఒక్కరు కూడా మంచి పేరును సొంతం చేసుకున్నారు. సినిమాలో నెగిటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో.. హీరోయిన్ వైష్ణవి ఫ్రెండ్ గా నటించిన కిర్రాక్ సీత గురించి ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వైష్ణవి చెడ్డ దారిలో నడవడానికి పూర్తి కారణం సీత అన్నట్లుగా చూపించారు. సినిమాలో చూపించినట్లుగానే



నిజ జీవితంలో కిర్రాక్ సీత వ్యవహరిస్తుంది అంటూ సోషల్ మీడియాలో బండ బూతులు తిడుతున్నారట. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో కిర్రాక్ సీత మాట్లాడుతూ.. తన గురించి అత్యంత నీచంగా దారుణంగా కామెంట్స్ చేస్తున్నారు. చెప్పడానికి కూడా సాధ్యం కాని భాష ని వాడుతూ బూతులు తిడుతున్నారు అంది. తనను బెదిరిస్తున్నారు. నా అడ్రస్ కోసం కొందరు వెతుకుతున్నట్లుగా కూడా తెలిసింది. బేబీ సినిమా లో నేను పోషించిన పాత్రకు నా రియల్ లైఫ్ క్యారెక్టర్ కి ఎలాంటి సంబంధం లేదు. కొందరు నన్ను సినిమా లో చూసి తప్పుగా అర్థం చేసుకుని ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారు అంటూ ఆమె పేర్కొంది. బేబీ సినిమా సక్సెస్ తో తన కెరీర్ కి మంచి బ్రేక్ దక్కినట్టుగా భావిస్తున్నట్లు పేర్కొంది. ముందు ముందు మరిన్ని మంచి పాత్రలు వస్తాయని ఆశిస్తున్నాను. అంతే కాకుండా లీడ్ రోల్స్ లో నటించే అవకాశం వస్తే తప్పకుండా నటించేందుకు సిద్ధంగా ఉన్నట్లు కిర్రాక్ సీత పేర్కొంది.

# తడిచిన అందాలతో వింక్ బ్యూటీ హెయలు..!

ఒకప్పటి నేషనల్ క్రష్ ప్రియా ప్రకాశ్ వారియర్. ఈ బ్యూటీ కేవలం ఒక్క వీడియోతో పాపులర్ అయిపోయింది. ఓ మూవీలో ఈ బ్యూటీ కన్ను కొట్టిన వీడియో వైరల్ గా మారడంతో ఓవర్ నైట్ స్టార్ అయిపోయింది. దీంతో, ఆమెకు సోషల్ మీడియాలో క్రేజ్ బాగా పెరిగిపోయింది. ఈ క్రేజ్ తోనే ఆమెకు సినిమాల్లో ఆఫర్లు క్యూ కట్టాయి. అయితే, సరిగా కథలను ఎంచుకోకపోవడంతో ఒక్కసారిగా బోల్తా పడిపోయింది. మూవీల్లో వరసగా ఛాన్సులు రాకపోయినా, ఆమె సోషల్ మీడియాలో మాత్రం అదరగొడుతూ ఉంటుంది. ఎప్పటికప్పుడు ఫోటోలను షేర్ చేస్తూ ఆకట్టుకుంటూ ఉంటుంది. తాజాగా పసుపు



రంగు డ్రెస్ లో ఫోటోలకు ఫోజులు ఇచ్చింది. సముద్రం నీటిలో తడుస్తూ, తన అందాలతో మరింత కనువిందు చేసింది. పసుపు రంగు బికినీతో ట్రీట్ ఇచ్చింది. నీటిలో తడవడంతో ఆమె అందాలు మరింత స్పష్టంగా కనపడుతున్నాయి. తన నడుము దగ్గర నుంచి, థైస్ అందాలను కూడా ఆరబోసింది. అంతేకాదు, క్లీవేజ్ షోతో మెస్మరైజ్ చేసింది. ఆమె ఫోటోలకు ఇప్పుడు నెటిజన్లు మెస్మరైజ్ అయిపోతారు. హాట్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు. కాగా, కొన్ని ఫోటోల్లో ఆమెతో పాటు ఆమె ఫ్రెండ్స్ కూడా ఉన్నారు. వారు కూడా క్లీవేజ్ షో చేయడం గమనార్హం. ఇక ప్రియా వారియర్ తెలుగులో రెండు చిత్రాల్లో నటించింది. ముందు నితిన్ సరసన 'చెక్' చిత్రంలో నటించింది. ఆ తర్వాత యంగ్ హీరో తేజ సజ్జ సరసన 'ఇష్క్ : నాట్ ఏ లవ్ స్టోరీ'లో నటించింది. అయితే ఈ రెండు చిత్రాలు ప్రియాకు సక్సెస్ ను అందించలేకపోయాయి. కాగా, తెలుగు, తమిళంలోనూ నటించింది. కాగా, ఇప్పుడు తెలుగులోకి బ్రో చిత్రంతో రీఎంట్రీ ఇస్తుంది. పవన్ కళ్యాణ్, సాయిధరమ్ తేజ్ హీరోలుగా ఈ చిత్రం రూపొందుతున్న విషయం తెలిసిందే. ఈ నెల 28న విడుదల కానుంది. ఇందులో హీరోని ప్రేమించే అమ్మాయి పాత్రలో కనిపిస్తుందని సమాచారం. మూవీ విడుదల అయితే కానీ, క్లారిటీ రాదు.




## రాగల మూడు రోజులు ఇదే పరిస్థితి.. తెలంగాణలో వర్షాలపై వాతావరణశాఖ హెచ్చరికలు

హైదరాబాద్: తెలంగాణలో రాగల మూడు రోజుల పాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు పడనున్నట్లు హైదరాబాద్ వాతావరణ శాఖ పేర్కొంది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని.. బలమైన గాలులు కూడా వీస్తాయని వాతావరణశాఖ వెల్లడించింది. తెలంగాణలో వర్షాలపై బుధవారం వాతవారణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. నిన్నటి (మంగళవారం) తీవ్ర అల్పపీడనం ఈ రోజు కూడా ఉత్తర ఆంధ్రప్రదేశ్ – దక్షిణ ఒడిస్సా తీరాల్లోని, పశ్చిమ మధ్య, పరిసరాల్లోని వాయువ్య బంగాళాఖాతంలో స్థిరంగా ఉందని తెలిపింది. తీవ్ర అల్పపీడనానికి అనుబంధంగా ఉన్న ఆవర్తనం సగటు సముద్ర మట్టం నుంచి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు స్థిరంగా కొనసాగుతోందని వెల్లడించింది. తీవ్ర అల్పపీడనం వాయువ్య దిశగా నెమ్మదిగా కదులుతూ ఉత్తర ఆంధ్రప్రదేశ్ – దక్షిణ ఒడిస్సా తీరాలను చేరుకునే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. రుతుపవన ద్రోణి ఈ రోజు (బుధవార) జైసల్మేర్, కోట, రైజన్, మాండ్ల, దుర్గ్, పశ్చిమ మధ్య, ఆనుకుని ఉన్న వాయువ్య బంగాళాఖాతం మీదుగా ఉత్తర ఆంధ్రప్రదేశ్ – దక్షిణ ఒడిశా తీరాల మీదుగా ఉన్న అల్పపీడన ప్రాంత కేంద్రం గుండా వెళుతోందని తెలిపింది. అక్కడి నుంచి తూర్పు – ఆగ్నేయ దిశగా తూర్పు మధ్య బంగాళాఖాతం వరకు సగటు సముద్ర మట్టానికి 1.5 కి.మీ ఎత్తు వరకు విస్తరించి ఉందని వెల్లడించారు. అల్పపీడనం ప్రభావంతో తెలంగాణలో రాగల మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు ప్రకటించింది. అలాగే ఈ రోజు, రేపు రాష్ట్రంలోని కొన్ని చోట్ల భారీ వర్షాలు.. అలాగే మరికొన్ని చోట్ల భారీ నుంచి అతి భారీ, అత్యంత భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నట్లు హెచ్చరికలు జారీ చేసింది. ఈనెల 28న కూడా తెలంగాణలోని పలు జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు పడనున్నట్లు వాతావరణ శాఖ పేర్కొంది. తెలంగాణకు రెండు రోజులు పాటు రెడ్ అలర్ట్ జారీ చేసింది. రాగల 3 రోజులు తెలంగాణ రాష్ట్రంలో ఉరుములు, మెరుపులతో పాటు ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని, దాదాపు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది.

## భారీ వర్షాలతో అలర్ట్.. 24 గంటలూ అందుబాటులో ఉండనున్న కంట్రోల్ రూంలు : ఎమ్మెల్సీ కవిత



ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు సహాయసహకారాలు అందించేందుకు ప్రభుత్వ యంత్రాంగం అన్నిరకాలుగా అప్రమత్తంగా ఉందని ఎమ్మెల్సీ కవిత తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంలు ప్రజలకు 24 గంటలూ అందుబాటులో ఉంటాయని ట్విట్టర్ ద్వారా తెలిపింది..

ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా కంట్రోల్ రూం ద్వారా అధికారులను సంప్రదించగలరని కోరారు. తాను కూడా కార్యాలయంలో నిరంతరం అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లోని బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు మంత్రి ప్రశాంత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయిలో పర్యటించి వరద పరిస్థితులను సమీక్షిస్తున్నారని అన్నారు. లోతట్టు ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించి, ప్రజలకు సహాయక చర్యలు పర్యవేక్షిస్తూ భరోసా నింపుతూ ఉన్నారని తెలిపారు. ప్రజలకు కనీస అవసరాలకు ఎలాంటి లోటు రాకుండా ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. లోతట్టు ప్రాంత ప్రజలకు సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు రిలీఫ్ క్యాంపులు కూడా ఏర్పాటు చేశారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చెప్పారు.

## మేము ఇండియా పక్షంతో లేము.. కేజ్రీ కోరారనే..




ఢిల్లీ : మణిపూర్ అంశంపై మాట్లాడేందుకు ప్రధాని ఎందుకు సంశయిస్తున్నారో అర్థం కావడం లేదని బీఆర్ఎస్ ఎంపీ రంజిత్ రెడ్డి పేర్కొన్నారు. మణిపూర్ అంశంలో ప్రపంచం మొత్తం భారత్ వైపు చూస్తోందన్నారు. బీఆర్ఎస్ అవిశ్వాస తీర్మానానికి ఎంఐఎం మద్దతు ఇచ్చిందన్నారు. విపక్షాలు వాయిదా తీర్మానం ఇస్తే తాను మాట్లాడాలా? అనే ధోరణిలో ప్రధాని ఉన్నారని రంజిత్ రెడ్డి విమర్శించారు. మణిపూర్ హింసపై ప్రధాని మౌనం వీడాలన్నారు. అవిశ్వాస తీర్మానంపై ప్రశ్నత్తరాల తర్వాత తీసుకుంటామనడం హాస్యాస్పదమన్నారు. అవిశ్వాస తీర్మానం చర్చకు వస్తే దేశంలో ఏం జరుగుతుందో అందరికీ తెలుస్తుందన్నారు. దేశంలోని అంశాలతోపాటు తెలంగాణ అంశాలను లేవనేత్తుతామని పేర్కొన్నారు. కాంగ్రెస్ బీఆర్ఎస్ ప్రధాన ప్రతిపక్షమని.. తాము ఇండియా పక్షంతో లేమన్నారు. కాంగ్రెస్‌తో కలిసి వేళ్లే ప్రసక్తే లేదన్నారు. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ కోరినందుకే ఆర్డినెన్స్‌కి వ్యతిరేకంగా ఆప్‌కు మద్దతు ఇస్తున్నామని రంజిత్ రెడ్డి పేర్కొన్నారు. రాజకీయమే కావాలనేలా ప్రధాని వ్యవహారశైలి ఉందన్నారు. ప్రధాని మోదీ పట్టుదలకు పోతున్నారని.. ఢిల్లీ ఆర్డినెన్స్ ముఖ్యం కాదని రంజిత్ రెడ్డి పేర్కొన్నారు.

## ఫుల్‌ట్యాంక్ లెవెల్ దాటేసింది.. నిండుకుండలా హుస్సేన్‌సాగర్



హైదరాబాద్: భారీగా వరద నీరు వచ్చి చేరడంతో హుస్సేన్ సాగర్ నిండుకుండలా మారింది. భాగ్యనగరంలో ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో ఎగువ ప్రాంతాల నుంచి హుస్సేన్ సాగర్‌కు వరద పోటెత్తుతోంది. బంజారా, పికెట్, కూకట్‌పల్లి నాలాల నుంచి హుస్సేన్‌సాగర్‌లోకి వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో హుస్సేన్‌సాగర్ నీటిమట్టం ఫుల్ ట్యాంక్ లెవల్‌ను దాటేసింది. హుస్సేన్‌సాగర్ ఫుల్ ట్యాంక్ లెవెల్ 513.41 మీటర్లు కాగా.. ప్రస్తుతం అంతేలా అంటే 513.47 మీటర్లుగా నీటి మట్టం కొనసాగుతోంది. నీటిమట్టం ఫుల్‌ట్యాంక్ లెవల్ దాటంతో అధికారులు తూముల ద్వారా హుస్సేన్‌సాగర్ నుంచి నీటిని మూసీలోకి విడుదల చేస్తున్నారు. దీంతో మూసి పరివాహక ప్రాంత ప్రజలను జీహెచ్ఎంసీ అధికారులు అప్రమత్తం చేశారు. మరోవైపు జంట జలాశయాలకు వరద పోటు అధికంగా ఉంది. ఉస్మాన్‌సాగర్ ఇన్ ఫ్లో 1700 క్యూసెక్కులుగా ఉండగా... హిమాయత్‌సాగర్‌కు 1500 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ఉస్మాన్‌సాగర్ పూర్తిస్థాయి నీటి మట్టం 1790 అడుగులు కాగా.. ప్రస్తుత నీటిమట్టం 1787.10 అడుగులకు చేరింది. అలాగే హిమాయత్‌సాగర్ పూర్తిస్థాయి నీటి మట్టం 1761.75 అడుగులకు గాను.. ప్రస్తుత నీటిమట్టం 1761.50 అడుగులుగా కొనసాగుతోంది.

## సోషల్ మీడియాలో చురుగ్గా ఉందని సోదరి హత్య




ఇల్లెందు : చెల్లెలు సోషల్ మీడియాలో వీడియోలు పెడుతోందని ఆగ్రహించిన సోదరుడు ఆమెను రోకలిబండతో మోది హత్య చేసిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం రాజీవ్‌నగర్‌లో సోమవారం జరిగింది. రాయి తగిలి చనిపోయిందని నమ్మించే ప్రయత్నం చేయగా.. గ్రామస్థులకు అనుమానం వచ్చి పోలీసులను పిలవడంతో అసలు విషయం బయటపడింది. సీఐ కరుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజీవ్‌నగర్‌కు చెందిన అజ్మీర సింధు(21) అలియాస్ సంఘవికి తల్లి, సోదరుడు హరిలాల్ ఉన్నారు. మహబూబాబాద్‌లో ఏఎన్ఎం అప్రెంటిస్ చేస్తున్న సింధు సోషల్ మీడియాలో చురుగ్గా ఉండేవారు. ఇది నచ్చని హరిలాల్ ఆమెతో తరచూ గొడవపడేవాడు. ఇదే విషయమై సోమవారం రాత్రి కూడా ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో హరిలాల్ రోకలిబండ తీసుకొని ఆమె తలపై కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే ఖమ్మం ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పారు. మెరుగైన చికిత్స కోసం వరంగల్ తీసుకెళ్తుండగా మృతిచెందారు. మంగళవారం ఉదయం కుటుంబసభ్యులు హడావుడిగా అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తుండటంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు చేరుకొని విచారణ చేపట్టడంతో దాడి విషయం వెలుగులోకి వచ్చింది. అప్పటికే హరిలాల్ పరారయ్యాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ పేర్కొన్నారు.




భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం వద్ద గోదావరికి వరద పోటెత్తుతోంది. గంటగంటకు గోదావరి నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఇవాళ మధ్యాహ్నం 3 గంటల వరకు 44.4 అడుగుల మేర నీరు చేరినట్లు అధికారులు తెలిపారు. దీంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. గోదావరి నీటిమట్టం మరో నాలుగు అడుగులు పెరిగి 48 అడుగులకు చేరితే రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. భద్రాచలం వద్ద గోదావరి నుంచి 9,92,794 క్యూసెక్కుల వరద దిగువకు ప్రవహిస్తోంది.

మొదటి ప్రమాద హెచ్చరిక జారీ నేపథ్యంలో అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని సూచించారు.

**తాలిపేరు ప్రాజెక్టులోకి భారీగా వరద :** మరోవైపు, తాలిపేరు ప్రాజెక్టులోకి వరద నీరు భారీగా వచ్చి చేరుతుండటంతో.. దిగువప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ప్రియాంక సూచించారు. తాలిపేరు నుంచి దిగువకు 2 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. లోతట్టుప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ముంపుప్రాంత గ్రామాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలన్నారు. అలాగే, భద్రాచలం–చర్ల రోడ్డుపై రాకపోకలు నియంత్రించాలని స్పష్టం చేశారు.

## కేటీఆర్ పుట్టినరోజు మోజులో పడి ప్రజలను మరిచిపోయారు... సర్కార్‌పై రేవంత్ ఫైర్



హైదరాబాద్: నగరంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి మండిపడ్డారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో గత వారం రోజులుగా వరదలతో ప్రజలు అతలాకుతలం అవుతుంటే ప్రజలను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని విమర్శించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కానీ, మునిసిపల్ మంత్రి కేటీఆర్ గానీ ఎలాంటి జాగ్రత్త చర్యలు తీసుకోవడం లేదన్నారు. కేటీఆర్ పుట్టిన రోజు మోజులో ఉండి ప్రజలను మరచిపోయారని యెద్దేవా చేశారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం కనీసం సమీక్ష చేయడంలేదని మండిపడ్డారు. వారం రోజులుగా భారీ వర్షాలతో రాష్ట్రం మొత్తం అల్లకల్లోలంగా మారిందన్నారు. తీవ్ర వర్షాలతో వాతావరణ శాఖ ఇప్పటికే రాష్ట్రంలో అలెర్ట్ ప్రకటించిందని... అయిన కూడా ప్రభుత్వం ఎలాంటి జాగ్రత్త చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు నానా యాతన పడుతున్నారని.. గంటలకొద్దీ రోడ్లపైనే ప్రజలు కష్టాలు పడుతున్నారని తెలిపారు. హైదరాబాద్ విశ్వనగరంగా అభివర్ణించారని.. హైదరాబాద్ డల్లాస్, ఓల్డ్ సిటీ ఇస్తాంబుల్ చేస్తామని ప్రగల్భాలు పలికిన కేసీఆర్, కేటీఆర్ హైదరాబాద్ నరక కూపంగా మార్చారని టీపీసీసీ చీఫ్ వ్యాఖ్యలు చేశారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. నాలాలు, వరద ప్రాంతాలకు వెళ్లకూడదని సూచించారు. పాతభవనాలు, గోడలు, పాడు బడ్డ ఇళ్ల వద్ద జాగ్రత్తగా ఉండాలని.. పిల్లలను బయటకు పంపవద్దని తెలిపారు. రాష్ట్రంలో గతంలో వరదలతో భారీ ఆస్తి, ప్రాణ నష్టాలు, పంట నష్టాలు వచ్చాయని గుర్తుచేశారు. గత 9 ఏళ్లుగా హైదరాబాద్‌లో సౌకర్యాల కల్పన, ప్రజలకు మేలు జరిగే ఒక్క చర్య చేపట్టలేదన్నారు. ఈ విషయాలపై కాంగ్రెస్ శ్రేణులు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు. బుధ, గురు వారాలలో రెండు రోజులలో ప్రభుత్వం ప్రజలకు సరైన సేవలు అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే శుక్రవారం నాడు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని రేవంత్ రెడ్డి హెచ్చరించారు.

## అవిశ్వాస తీర్మానంపై కిషన్ రెడ్డి రియాక్షన్ ఇదే..



హైదరాబాద్: లోక్‌సభలో మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ సమర్పించిన అవిశ్వాస తీర్మానంపై కేంద్రమంత్రి, తెలంగాణ బీజేపీ చీఫ్ కిషన్‌రెడ్డి స్పందించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం ఒక్కటేనని అన్నారు. కేంద్రంపై అవిశ్వాసం తీర్మానంతో ఒరిగేది ఏమీలేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే బీఆర్ఎస్, ఎంఐఎంకు ఓటు వేసినట్లే అని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం లోపాయికారి ఒప్పందాన్ని తెలంగాణ సమాజం అర్థం చేసుకోవాలని తెలిపారు. బీజేపీ మాత్రమే బీఆర్ఎస్‌తో పోరాటం చేస్తోందని చెప్పారు. బీఆర్ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎంలు అవినీతి, కుటుంబ పార్టీలే అంటూ వ్యాఖ్యలు చేశారు. ప్రత్యక్షంగా.. పరోక్షంగా మూడు పార్టీలు అనేక సార్లు తెలంగాణను పరిపాలించాయన్నారు. బీఆర్ఎస్ కారు స్టీరింగ్ ఎంఐఎం దగ్గర ఉందన్నారు. తెలంగాణలో మార్పు రావాలంటే బీజేపీనే సాధ్యమని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. మరోవైపు కాంగ్రెస్ ఇచ్చిన అవిశ్వాస తీర్మానానికి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఆమోదం తెలిపారు. దీనిపై చర్చకు తేదీని ఖరారు చేసేందుకు అన్ని పార్టీల నేతలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. కాగా... 26 పార్టీల కూటమి ఇండియా లో లేని పార్టీ బీఆర్ఎస్ కూడా అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చిన సంగతి తెలిసిందే.




**సిద్దిపేట జిల్లా చేర్యాల మండలంలో వేచరేణి గ్రామంలో హృదయ విదరక ఘటన చోటుచేసుకొంది. వర్షాల కారణంగా ఉద్ధృతంగా ప్రవహిస్తున్న వాగును దాటుకుంటూ అంతిమయాత్రను నిర్వహించాల్సిన పరిస్థితి తలెత్తింది. వాగు అవతల ఉన్న వైకుంఠ ధామానికి వెళ్లేందుకు మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు వాగులో ఇబ్బందులు పడుతూ వెళ్లారు. వాగుపై వంతెన లేకపోవడంతో తరచుగా ఇబ్బందులకు గురవుతున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. వెంటనే బ్రిడ్జి నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.**

## వరద ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి : మంత్రి సత్యవతి రాథోడ్

వరంగల్ : ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అధికార యంత్రాంగం యావత్తు అప్రమత్తంగా ఉండాలని గిరిజన సంక్షేమ శాఖల మంత్రి సత్యవతి రాథోడ్ అధికారులు ఆదేశించారు. మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల కలెక్టర్, ఎస్పీ, వివిధ శాఖల అధికారులతో మంత్రి టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. భారీ వర్షాల వల్ల ఎలాంటి పరిస్థితి ఉత్పన్నమైనా, సమర్థవంతంగా ఎదుర్కొనేలా అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది అందరూ తమ తమ కార్య స్థానాల్లోనే అందుబాటులో ఉంటూ క్షేత్రస్థాయిలో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని, ప్రజలకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ప్రస్తుత సమయంలో ఎవరు కూడా సెలవుల్లో వెళ్లకుండా, పూర్తి అప్రమత్తతో విధులు నిర్వర్తించేలా చూడాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టి, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రోడ్లు దెబ్బతిన్న ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడకుండా సత్వర చర్యలు తీసుకోవాలని, వరద ఉధృతి తగ్గిన వెంటనే పునరుద్ధరణ పనులు చేపట్టి వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. కంట్రోల్ రూమ్ లకు వర్ష ప్రభావిత ప్రాంతాల నుండి ఏదైనా సమాచారం అందిన వెంటనే సహాయక చర్యలు చేపట్టేలా సిబ్బందిని సమాయత్తపర్చాలని మంత్రి అధికారులకు తెలిపారు.విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకోకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని పలు ప్రాంతాలలో కుంభవృష్టి కురియడంతో చెరువులు, వాగులు ఉప్పొంగి ప్రవహిస్తునందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ముఖ్యంగా చేపలు పట్టే వారు, ఈత సరదా కోసం పిల్లలు, యువత చెరువులు, వాగులోకి దిగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com